www.vishvambhara.com
V3 NEWS
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
ఆదివారం
06-10-2024
సంపుటి : 01 | సంచిక : 154 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్
డా॥ కాచం సత్యనారాయణ
CMD



ఇళ్లస్థలాల దరఖాస్తుల పేరుతో

# జర్నలిస్టులను మభ్య పెట్టొద్దు

- డబ్ల్యూజేఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్



**విశ్వంభర, కరీంనగర్ :** జర్నలిస్టుల నివేశన స్థలాల బాధ్యత తమదే అన్నట్టుగా హైదరాబాద్, ఒక జర్నలిస్టు యూనియన్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (WJI) రాష్ట్ర శాఖ ఖండించింది. జర్నలిస్టులను మభ్యపెట్టి, పక్కదారి పట్టించేందుకు ఆ యూనియన్ చేస్తున్న చర్యలను WJI తీవ్రంగా వ్యతిరేకించింది. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయాంలో హనుమకొండలోని రెండు జర్నలిస్టు సొసైటీలకు ప్రభుత్వం కేటాయించిన 17 ఎకరాల స్థలాన్ని పంపిణీ చేయడంలో దశాబ్దాలుగా విఫలమైన యూనియన్ ప్రస్తుతం తామేదో ఉద్ధరిస్తామన్న ధోరణిలో జర్నలిస్టుల మధ్య అగ్గి రాజేసి చలి మంటలు కాల్చుకునే ప్రయత్నం చేస్తున్నదని డబ్ల్యూజెఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ ఆరోపించారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఖమ్మంలోని జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని ఇప్పటికీ వారికి అందజేయించడంలో జర్నలిస్టు ఉద్యమంలో దశాబ్దాల పెత్తనం తమదే అని చెప్పుకుంటున్న యూనియన్ వైఫల్యం చెందిందన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో అర్హులను పక్కనపెట్టి అనర్హులకు నివేషన స్థలాలు కేటాయిస్తే, జరిగిన తప్పులపై కనీసం నోరు మెదపని జిల్లా, రాష్ట్ర నాయకుల ఫలితంగా కొందరు జర్నలిస్టులు హైకోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి రావడం, సంబంధిత వ్యవహారంపై స్టే విధించడం సదరు యూనియన్ నాయకుల పాపాల ఫలితమే అని ఆయన విమర్శించారు. సంబంధిత యూనియన్ చేస్తున్న అనధికారిక కార్యకలాపాలకు మీడియా అకాడమీ ఛైర్మన్ మద్దతు ఇవ్వడాన్ని ఆయన తప్పుపట్టారు. గత కొద్ది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఇండ్ల స్థలాల దరఖాస్తుల పేరుతో ఒక సంఘం నాయకులు జర్నలిస్టులను అయోమయానికి గురిచేస్తున్నారని, తమ యూనియన్ పేరుతో వారు దరఖాస్తులు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. జర్నలిస్టుల ఉద్యమ నేత అని చెప్పుకుంటున్న నాయకుడికి సంబంధించిన నల్లగొండ జిల్లాలో నివేషన స్థలాల కేటాయింపు వ్యవహారంలో ఏం జరిగిందో జగద్వితమే అన్నారు. జర్నలిస్టుల కు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్న ఆలోచన, చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే సమాచార శాఖ ద్వారా ఈ ప్రక్రియ చేపట్టాలని, ఇందుకోసం ఆయా జిల్లాలలో జర్నలిస్టు యూనియన్ల ప్రతినిధులు, సీనియర్ పాత్రికేయులతో కమిటీ వేయాలని డిమాండ్ చేశారు.

మీడియా అకాడమీ అనేది తాను చేయాల్సిన బాధ్యతల నుంచి పూర్తిగా వైదొలిగిందని, ఆ ఒక్కటి తప్ప అన్ని పనులు తానే చేస్తాననే విధంగా మీడియా అకాడమీ ఛైర్మన్ వ్యవహరించడం, అందుకు ముఖ్యమంత్రి, మంత్రులు సై అనడం సరైంది కాదని అన్నారు. జర్నలిస్టుల సమస్యల విషయంలో గానీ, మీడియా అకాడమీ నిర్వహణలో గానీ గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు ఈ ప్రభుత్వంలో జరగకూడదని, అలా జరిగితే రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రభుత్వం జర్నలిస్టుల ఆగ్రహాన్ని చవి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీలను పరిగణనలోకి తీసుకోవాలని, సొసైటీలలో లేని అర్హులైన జర్నలిస్టుల జాబితాను ప్రభుత్వం రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాల విషయంలో ఒక యూనియన్ చేస్తున్న తప్పుడు ప్రచారాలతో జర్నలిస్టులు ఆందోళన చెందవద్దని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని జర్నలిస్టు సంఘాల భాగస్వామ్యం లేకుండా జర్నలిస్టు నివేశన స్థలాల సమస్యను పరిష్కరించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

# పర్యాటక కేంద్రాలను మరింత అభివృద్ధి చేస్తాం

- పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు




**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రపంచ స్థాయిలో పోటీపడేలా రాష్ట్ర పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామని తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అనేక అత్యంత ఆకర్షణీయమైన పర్యాటక స్థలాలు రాష్ట్ర పర్యాటక రంగం దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురిచేసిందన్నారు. వసతులు కల్పించి, మార్కెటింగ్ చేసి పర్యాటకులను ఆకర్షించడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామన్నారు. హైదరాబాద్ మాదాపూర్ హెచ్ఐసీసీలో నాగాలాండ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హార్న్ బిల్ మ్యూజిక్ ఫెస్టివల్ ప్రమోషనల్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాగాలాండ్ టూరిజాన్ని ప్రమోట్ చేసేందుకు ఆ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి టెన్ జెన్ ఇమ్నా అలాంగ్, బృందం ఇక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. తెలంగాణ పర్యటక ప్రదేశాన్ని ఔనత్యానత్వాన్ని ప్రపంచానికి తెలిపేందుకు దుబాయ్, అమెరికాలో అంతర్జాతీయ టూరిజం సదస్సుకు వెళ్తున్నామని వందలకోట్ల విలువైన పర్యటక ఆస్తులకు తగిన విధంగా ఉపయోగించేందుకు వృద్ధిలోకి తీసుకొస్తామని మంత్రి పేర్కొన్నారు. నాగాలాండ్ మంత్రి టెన్ జెన్ ఇమ్నా అలాంగ్ మాట్లాడుతూ నాగాలాండ్ రాజధాని కోహిమాలో ఈనెల 18 నుంచి 21 వరకు దేశంలోనే అతిపెద్ద హార్న్ బిల్ మ్యూజిక్ ఫెస్టివల్‌ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. భారతదేశంలోని అతిపెద్ద బ్యాండ్ కాంపిటీషన్ గా నిలవబోతుందని... ఈ పోటీల్లో ప్రథమ స్థానం నిలిచిన విజేతలకు 20 లక్షల రూపాయలు, రెండు మూడు స్థానాల్లో నిలిచిన వారికి పది లక్షల రూపాయలు ఐదు లక్షల నగదు, వ్యక్తిగతంగా ప్రతిభ చూపిన వారికి ఐదు లక్షల విలువైన సంగీత పరికరాలను అందజేస్తామని తెలిపారు. వేడుక నిర్వహణకు తెలుగు రాష్ట్రాల నుంచి సుచిర్ ఇండియా గ్రూప్, శ్రేయాస్ ఈవెంట్స్ గ్రూప్ సంస్థలతో నాగాలాండ్ శాఖ అవగాహన బృందం అగ్రిమెంట్ చేసుకుంది. ఈ కర్యక్రమంలో సుచిర్ ఇండియా గ్రూప్ ఎండీ కిరణ్, శ్రేయాస్ గ్రూప్ ఎండీ డైరెక్టర్ శ్రీనివాస్, ఆర్టిస్ట్ కనెక్ట్ సంస్థ సీఈవో ఉజ్వల్ ముఖియా, నాగాలాండ్ సీఎం సలహాదారుడు అబూ మెహ తా, టీఏఎఫ్ఎంఏ సంస్థ ఛైర్మన్ తేజ మీరు, నాగాలాండ్ టూరిజం డిపార్ట్మెంట్ అధికారులు ప్రముఖ తెలుగు సంగీత దర్శకుడు రమణ గోగుల పాల్గొన్నారు.

# వాగ్దేవి క్లబ్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు



**విశ్వంభర, కరీంనగర్ :** కరీంనగర్ వాగ్దేవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద హై స్కూల్ గ్రౌండ్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో తొలుత వాసవి మాత చిత్రపటానికి పూజలు చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అతిథులుగా పాల్గొన్న 12వ డివిజన్ కార్పొరేటర్ తోట రామన్న మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ ఆడపడుచులకు అత్యంత ఇష్టమైన పండుగ అన్నారు. వివేకానంద విద్యాసంస్థల ఛైర్మన్ సాగాని కొమరయ్య మాట్లాడుతూ దేవుని పూలతో పూజిస్తామని ఆ పువ్వులనే దేవునిగా కొలిచే పండుగ బతుకమ్మ పండుగ అని అన్నారు. వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ జంధ్యం మాధవి మాట్లాడుతూ కాకతీయుల కాలం నుండే బతుకమ్మ పండగ జరుపుకుంటున్నామని, తీరొక్క పువ్వులతో పేర్చే బతుకమ్మ పండగ విశిష్టత ఈరోజు ఖండాంతరాలకు విస్తరించిందని అన్నారు. దాదాపు 60 మందికి పైగా క్లబ్ సభ్యులు అత్యంత భక్తిశ్రద్ధలతో బతుకమ్మ ఆడారు. అందంగా పేర్చిన బతుకమ్మలకు ఈ సందర్భంగా వాగ్దేవి క్లబ్ బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి ప్రవంతి, రెండవ బహుమతి హరిణి, మూడవ బహుమతి పొందిన రమ్య లకు అతిథులతో కలిసి వాగ్దేవి క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి, ప్రధాన కార్యదర్శి ఎం స్వరూప బహుమతులు ప్రధానం చేశారు. అలాగే బతుకమ్మ పేర్చిన ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతిని అందజేశారు. బతుకమ్మలను కృత్రిమంగా ఏర్పాటు చేసిన కోనేటిలో నిమజ్జనం చేశారు. అనంతరం పాల్గొన్న వారందరికీ అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తోట రామన్న సతీమణి సుగుణ, వాసవి క్లబ్ క్యాబినెట్ సెక్రటరీ జంధ్యం మధుకర్, వాసవి క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర సివిల్ నీటిపారుదల శాఖ మంత్రి నల్లమోద ఉత్తంకుమార్ రెడ్డి తండ్రి పురుషోత్తం రెడ్డికి నివాళులర్పించి మంత్రి కుటుంబ సభ్యులను పరామర్శించిన సమాచార హక్కు వికాస సమితి నాయకులు వ్యవస్థాపక అధ్యక్షుడు యర్ర మాద కృష్ణారెడ్డి, మహిళా అధ్యక్షురాలు హేమలత, రాష్ట్ర కార్యదర్శి కోడుమూరు దయాకర్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉన్నం సత్యనారాయణ, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు గుంతకండ్ల ముకుందరెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు లక్ష్మీకాంతరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చేకూరి శివ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బీఎస్ రాములు, సూర్యాపేట నియోజకవర్గం అధ్యక్షుడు దండ వెంకటరెడ్డి, కోదాడ నియోజకవర్గం అధ్యక్షుడు ఎస్ పాదం, కోదాడ పట్టణ అధ్యక్షుడు గంధం పాండు, నియోజకవర్గ సభ్యులు హమ్మద్, బాజీ, ముసుకు గోవిందరెడ్డి, జనకిరాములు తదితరులు.

- విశ్వంభర, కొండాపూర్

# డాక్టర్ గంద్ర ధారణ అద్భుతం

**శతకం ఆవిష్కరణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్**



**విశ్వంభర, కరీంనగర్ :** కోట్ల లక్ష్మీనరసింహస్వామి పైన శతకం రాయడమే కాకుండా ఆ శతకాన్ని అదే దేవస్థానం ప్రాంగణంలో ఆవిష్కరించడం విశేషమైన అంశమని పెద్దపల్లి అదనపు పాలనాధికారి జీవి శ్యాంప్రసాద్ లాల్ అన్నారు. కోట్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన డాక్టర్ గంద్ర లక్ష్మణరావు గారి లక్ష్మీనరసింహ శతకము ఆవిష్కరణ కార్యక్రమం లో ఆయన ముఖ్యఅతిథి గా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. లక్ష్మణరావు పుస్తకంలో గొప్ప అభివ్యక్తి తోపాటు తాత్వికత ఉందని అన్నారు. 75 ఏళ్ల వయసులో లక్ష్మణరావు అవధానిగా కూడా పేరొందారని, ఆయన ధారణ శక్తి అద్భుతం అని కొనియాడారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ధర్మాధికారి కీర్తి కుమార్ మాట్లాడుతూ ఆలయ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగడం సంతోషదాయకమన్నారు. ఎన్నారై బి వి రావు ఆలయ అభివృద్ధి కోసం 50 వేల విరాళాన్ని అందజేశారు. జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు గాజుల రవీందర్ సాహితీ విశ్లేషణతో పుస్తకాన్ని పరిచయం చేయగా సాహితీ గౌతమి కార్యదర్శి కొత్త అనిల్ కుమార్ , కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, డా తత్వాది ప్రమోద్ కుమార్, సమైక్య సాహితి అధ్యక్ష కార్యదర్శులు మాడిశెట్టి గోపాల్, కె ఎస్ అనంతాచార్య, వేదాంతాచార్య తదితరులు అభినందన ప్రసంగాలు చేశారు. తుమ్మోరి రామ్మోహనరావు, విలాసాగరం రవీందర్ శతకంలోని పద్యాలను ఆలపించారు. కవి కే వి సంతోష్ బాబు వందన సమర్పణ చేశారు. కరీంనగర్ నుండి దాదాపు పాల్గొన్న 60 మందికి ఆలయం పక్షాన అన్న ప్రసాదాన్ని అందజేశారు.















www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
ఆదివారం
06-10-2024
సంపుటి : 01 | సంచిక : 154 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



## బీజేపీ ఆశలు గల్లంతేనా?

- జమ్మూ కాశ్మీర్‌కు హంగు తప్పదు..
- హర్యానాలో కాంగ్రెస్ హవా..
- వెలువడ్డ ఎగ్జిట్ పోల్స్ అంచనాలు

**విశ్వంభర (డెస్క్):** కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ కాశ్మీర్, హర్యానాల్లో ముగిసిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వెలువడుతున్నాయి. 90 సీట్లు ఉన్న జమ్మూ కాశ్మీర్‌లో మూడు దశల్లో పోలింగ్ ముగిసింది. కిందటి నెల 18, 25, ఈ నెల 1న తమ ఓటు హక్కును వినియోగించుకున్నారక్కడి ఓటర్లు. హర్యానాలో కూడా 90 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈ సాయంత్రం 6 గంటలకు ఒకే విడతలో పోలింగ్ ముగిసింది. 6:30 గంటల మిగతా5లో...



## రైతుల ఖాతాల్లో కిసాన్ సమ్మాన్ నిధులు

- ప్రారంభించిన ప్రధాని మోదీ
- 18వ విడుతలో 9.4కోట్ల మంది రైతుల ఖాతాల్లో దాదాపు రూ.20వేలకోట్లు జమకానున్న నిధులు

**ముంబయి:** ప్రధాని నరేంద్ర మోదీ కిసాన్ సమ్మాన్ నిధి విడుదల చేశారు. మహారాష్ట్ర పర్యటనలో భాగంగా వాశింలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నిధుల విడుదలను ప్రారంభించారు. 18వ విడుతలో 9.4కోట్ల మంది రైతుల ఖాతాల్లో దాదాపు రూ.20వేలకోట్లు జమ కానున్నాయి. ఈ సందర్భంగా మిగతా5లో...

## తిరుమలలో వీఐపీ సంస్కృతి తగ్గాలి

### ప్రముఖులు వచ్చినప్పుడు హడావుడి కనిపించకూడదు

- ఆర్భాటం, అనవసర వ్యయం వద్దు
- ప్రశాంతతకు ఎక్కడా భంగం కలగకూడదు
- విదేశీ భక్తుల పట్ల గౌరవం ప్రదర్శించాలి
- పవిత్రత, నమ్మకం కాపాడేలా పనిచేయాలి
- కొండపై గోవింద నామస్మరణ తప్ప వేరే వినిపించకూడదు
- ప్రసాదాల నాణ్యత మరింత మెరుగుపడాలి
- సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు
- టీటీడీలో రివర్స్ టెండరింగ్ విధానం రద్దుచేస్తూ ఈవో ఉత్తర్వులు



10



# హైడ్రా ఇక తగ్గేదేలే!

## ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం

- గెజిట్ నోటిఫికేషన్ విడుదల
- మరింత బలోపేతం ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ ఏజెన్సీ
- చేపట్టబోయే అన్ని కార్యకలాపాలకు చట్టబద్ధత
- లభించనున్న మరిన్ని కీలక అధికారాలు
- రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో చట్టబద్ధత కల్పించే అవకాశం

**విశ్వంభర, హైదరాబాద్:**

హైదరాబాద్ విపత్తు స్పందన, ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ ఏజెన్సీ(హైడ్రా)కి విస్తృతాధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు రాష్ట్ర గవర్నర్ జిష్ణు_ దేవ్ వర్మ ఆమోదం తెలిపారు. ఈ మేరకు శనివారం రాజ్‌భవన్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఇకపై హైడ్రా చేపట్టబోయే అన్ని కార్యకలాపాలకు చట్టబద్ధత లభించింది. ఏ చట్టం ప్రకారం ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందన్న ప్రశ్నలు తలెత్తడంతో.. జీహెచ్ఎంసీ చట్టం 1955ను సవరించింది. నగరంలోని జలాశయాలు, ఇతర ఆస్తులను కాపాడేందుకు అధికారిని లేదా సంస్థను ఏర్పాటు చేసే అధికారాన్ని ప్రభుత్వానికి కట్టబెడుతూ.. జీహెచ్ఎంసీ చట్టంలో మిగతా5లో...

## పాక్‌లో పర్యటన మాత్రమే

### ఆ దేశంతో చర్చల్లేవ్

విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్



9

మురళీకృష్ణుడి అవతారంలో

## తిరుమల శ్రీవారు

- చిన్నశేషవాహనంపై ఊరేగింపు
- నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం..
- ప్రత్యేక ఆకర్షణగా చిలకల మాలలు, కిరీటాలు..!
- రాత్రి వైభవంగా శ్రీవారి హంసవాహన సేవ..



8

## మూసీ వెనక దాక్కున్న ముసుగు దొంగ ఎవరు?

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్



05

## ఓపిక నశించింది

ఇదే చివరి ఛాన్స్: సుప్రీం

05

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 114 | ₹ 136 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 197 | ₹ 224 |

## మూసీనది నిర్వాసితులపై ప్రత్యేక దృష్టి



### జీవనోపాధి కోసం ప్రత్యేక కమిటీ

- సెర్ప్ సీఈఓ ఛైర్మన్, జీహెచ్ ఎంసీ కమిషనర్ వైస్ ఛైర్మన్, 14మంది సభ్యులు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**విశ్వంభర, హైదరాబాద్:**

మూసీనది ప్రక్షాళనలో భాగంగా నిర్వాసిత కుటుంబాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే నదీగర్భంలో నివాసాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు రెండు పడకల గదుల ఇళ్లను కేటాయిస్తున్న ప్రభుత్వం.. విద్య, ఉపాధి కల్పన కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సెర్ఫ్ సీఈవో ఛైర్మన్‌గా, జీహెచ్ఎంసీ కమిషనర్ వైస్ ఛైర్మన్‌గా 14 మంది సభ్యులతో జీవనోపాధి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మిగతా5లో...

## దేశానికి రోల్ మోడల్‌గా కొత్త రెవెన్యూ చట్టం

- కొత్త చట్టానికి పైలెట్ ప్రాజెక్టుగా తిరుమలగిరి-సాగర్ మండలం
- కొద్ది రోజుల్లో కొత్త చట్టం ప్రజల ముందుకు
- రెవెన్యూ మంత్రి పొంగులేటి



05



## త్వరలో తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు త్వరలో బియ్యం ఎగుమతి చేయనున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పౌర సరఫరాల భవన్ నుంచి ఫిలిప్పీన్స్ ఆహార, వ్యవసాయ శాఖ మంత్రి రోజేర్స్‌తో ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాణ్యత పరమైన కారణాల వల్ల గత కొన్నేళ్లుగా భారత్ నుంచి ఫిలిప్పీన్స్ బియ్యం దిగుమతి చేసుకోవడం లేదనే విషయం ప్రస్తావనకు వచ్చిందని మంత్రి అన్నారు. మిగతా5లో...

## రైతుల పేరుతో బీజేపీ, బీఆర్ఎస్ ఆందోళన విడ్డూరం



- సినిమావాళ్లు సంయమనం పాటించాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

**విశ్వంభర, హైదరాబాద్:** రైతుల పేరుతో బీజేపీ, బీఆర్ఎస్ ఆందోళన చేయడం విడ్డూరంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఆ రెండు పార్టీలు ఒకటే ఒకరి, తర్వాత ఒకరు ఆందోళన చేస్తున్నారన్నారు. శనివారం గాంధీభవన్ లో మీడియా చిట్ చాట్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మిగతా5లో...

## కూచిపూడికి ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాప్తి చేసిన

# రాజారెడ్డి దంపతులు

**నేడు రాజారెడ్డి జయంతి**



కూచిపూడి నృత్యానికి దేశవ్యాప్తంగానే కాదు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం కల్పించిన ప్రముఖుల్లో దంపతులు ఉండటం విశేషం. తెలంగాణలోని మారుమూల జిల్లా అయిన ఆదిలాబాద్ నుంచి ప్రపంచ ప్రఖ్యాతి సంపాదించారు రాజా, రాధారెడ్డి దంపతులు. రాజా రెడ్డి 1943, అక్టోబర్ 6 న ఆదిలాబాద్ జిల్లా నర్సాపూర్ గ్రామంలో సామాన్య వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. రాధారెడ్డి 1952, ఫిబ్రవరి 15 న జన్మించారు. వీరిది బాల్య వివాహం. వీరిరువురు వేదాంతం ప్రహ్లాదశర్మ దగ్గర శిష్యరికం చేసారు. ఏలూరులోని కళాక్షేత్రంలో కూచిపూడి నృత్యాన్ని అభ్యసించారు.

**నృత్యప్రదర్శనలు..**

రాజా రెడ్డికి చిన్ననాటి నుండి కూచిపూడి భాగవతం పైన ప్రత్యేక శ్రద్ధ. ఏలూరులో చిన్న చిన్న నృత్య ప్రదర్శనలు ఇచ్చిన తరువాత 1967 వ సంవత్సరం ప్రభుత్వ ఉపకారవేతనంతో ఢిల్లీలోని మాయారావ్ కళాశాలలో కూచిపూడి నృత్యాన్ని అభ్యసించారు. తరువాత భారతదేశంలోనే కాక అమెరికా, క్యూబా, రష్యా, ఫ్రాన్స్ ఇలా ప్రపంచమంతటా నృత్య ప్రదర్శనలిచ్చారు. కృష్ణాసత్యలుగా శివపార్వతులుగా ఈ దంపతుల నృత్యానికి నాటి ప్రధాని ఇందిరాగాంధీనే కాక క్యూబా అధ్యక్షుడు ఫిడెల్ క్యాస్ట్రో వంటివారి నుండి ప్రశంసలు అందాయి. సంప్రదాయ నృత్యరీతులకు పెద్దపీట వేస్తూనే కూచిపూడి నృత్యానికి ఆధునిక సొబగులద్దారు.

తమ నాట్యప్రదర్శనలతో కూచిపూడి ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపచేసిన వీరు న్యూఢిల్లీలో నాట్య తరంగిణి అనే కళాశాలను ఏర్పరిచి భావితరాలకు శిక్షణ ఇస్తున్నారు. వీరి కుటుంబానికే చెందిన కౌసల్యా రెడ్డి, యామినీ రెడ్డి, భావనా రెడ్డిలు ప్రముఖ కూచిపూడి కళాకారులుగా వెలుగొందుతున్నారు. వీరంతా కూచిపూడి సాంప్రదాయ ఒరవడిని కొనసాగిస్తూ ఇప్పటికీ దేశవిదేశాలలో అనేక ప్రదర్శనలు ఇస్తున్నారు. ఉత్తర భారతదేశంలో శాస్త్రీయ నృత్యమైన కూచిపూడి శైలిని ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి ప్రారంభించిన నాట్య తరంగిణి లక్ష్యాన్ని మరింతగా ప్రచారం చేయడానికి హైదరాబాదు శాఖను ప్రారంభించారు. సాధారణ తరగతులతో పాటు, నాట్య తరంగిణి తన విద్యార్థుల అభ్యాసాన్ని మెరుగుపరచడానికి నృత్యం, సంగీత రంగానికి చెందిన ప్రసిద్ధ కళాకారులచే వర్క్‌షాప్‌లు, సెషన్‌లను కూడా చురుకుగా నిర్వహిస్తోంది.

**నృత్యానికి పర్యాయ పదాలుగా నిలిచిన దంపతులు**

రాజా, రాధా రెడ్డి కూచిపూడి నృత్య జంట, గురువులే కాక నృత్య దర్శకులు. వారి పేర్లు కూచిపూడి నృత్యానికి పర్యాయపదాలుగా మారాయి. కళా రంగానికి వారు చేసిన సేవలకుగాను భారత ప్రభుత్వం వారికి పద్మశ్రీ , పద్మభూషణ్ అవార్డులను ప్రదానం చేసింది. వారిది పూర్తిగా నృత్యానికి అంకితమైన ఏకైక కుటుంబం- రాజా, అతని ఇద్దరు భార్యలు , ఇద్దరు కుమార్తెలు. ఏస్ కొరియోగ్రాఫర్, రాజా రెడ్డికి అనేక కొరియోగ్రఫీలు ఉన్నాయి, అవి 'శివాస్ డ్యాన్స్', 'మహానటం' (మూడు ఖండాలు ప్రయాణించినవి), 'శివ లీలలు', 'రస శబ్దం', 'కురు యధునానంద అష్టపది' ఇంకా అనేకం. రాజా రెడ్డి కొరియోగ్రఫీలో డిప్లొమా, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి బ్యాచిలర్ డిగ్రీ చేశారు. . రాధా రెడ్డికి కొరియోగ్రఫీలో డిప్లొమా కూడా ఉంది. కూచిపూడికి చేసిన కృషికి గాను 2010లో వీరిద్దరికి హైదరాబాద్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేసింది. పెళ్లి తర్వాత రాధ అతనిని అనుసరించి కూచిపూడిలోకి వెళ్లింది.



రాజా వినికిడి, ప్రసంగ బలహీనత ఉన్న విద్యార్థులకు, బ్లైండ్ రిలీఫ్ అసోసియేషన్‌లో శిక్షణ ఇచ్చారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మూడు కవితల ఆధారంగా నృత్యం చేయడానికి కూడా సిద్ధమయ్యారు. ఐదు దశాబ్దాలుగా సాగుతున్న వారి కెరీర్ ఇంకా కొనసాగుతోంది. ఫ్రాన్స్, సాల్జ్‌బర్గ్ (ఆస్ట్రియా) లోని అవిగ్నాన్ ఇంటర్నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్, అమెరికా, బ్రిటన్, బంగ్లాదేశ్‌లలో జరిగిన ఫెస్టివల్స్ ఆఫ్ ఇండియాలో ప్రదర్శించిన మొదటి భారతీయ నృత్యకారులు డా.రాజా , రాధా రెడ్డి. . జపాన్‌లో, ది రెడ్డీస్ ది ఆల్-స్టార్ బ్యాలెట్ గాలా ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇరవై రెండు మంది స్టార్ డ్యాన్సర్‌లలో వీరు ఇద్దరూ ఉన్నారు.వాస్తవానికి, ది ఆల్-స్టార్ బ్యాలెట్ గాలా ఫెస్టివల్‌కు హాజరైన భారతీయ శాస్త్రీయ నృత్యకారులు వారు మాత్రమే. రాజా రాధా రెడ్డి దర్బన్ (దక్షిణాఫ్రికా)లో "ప్లే హౌస్ థియేటర్"ని ప్రారంభించారు.

**అవార్డులు**

1984లో పద్మశ్రీ
2000లో పద్మభూషణ్
సంగీత నాటక అకాడమీ అవార్డు
లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు — రోటరీ క్లబ్ ఢిల్లీ
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ద్వారా డాక్టరేట్లు.



-పోతుగంటి వెంకటరమణ,
న్యూస్ నెట్‌వర్క్ ఇన్‌ఛార్జి
వీ3 న్యూస్, విశ్వంభర
సెల్: 6304475133

# పౌరాణిక చిత్రాల బ్రహ్మ కమలాకర కామేశ్వరరావు

తెలుగు సినిమా ప్రపంచంలో ప్రత్యేక స్థానం కమలాకర కామేశ్వరరావుది. పౌరాణిక సినిమాలకు కేరాఫ్ అడ్రస్ ఆయనదే. తెలుగు సినిమా ప్రేక్షకుల హృదయాలలో దైవ స్వరూపునిగా సుస్థిర స్థానం సంపాదించుకుని, పాత తరానికి చెందిన కొందరిచే చిత్ర పట పూజలు సైతం అందుకున్న ఎన్టీఆర్ పౌరాణిక హీరోగా వెలుగు వెలగడానికి కారణం కమలాకర కామేశ్వరరావు తీసిన సినిమాలే. తెలుగు పౌరాణిక చిత్రాలకు సాటి రాగల పౌరాణికాలు యావద్భారత దేశంలోనే మరే భాషలో లేవు. తెలుగు పౌరాణికాలకు ఆ ఘనతను సాధించి పెట్టిన చిత్రాలు చాలానే ఉన్నాయి. నర్తనశాల, పాండవ వనవాసంలాంటివి ఆయన దర్శకత్వ ప్రతిభకు నిదర్శనంగా మిగిలిపోయాయి. వాస్తవానికి తెలుగు ప్రేక్షకులకు తన సినిమాలతో భక్తి మార్గం పట్టించిన ఘనుడాయన. ఆయన తీసిన సినిమాలు.. ఒక్కొక్కటి ఒక్కొక్క ఆణిముత్యం.

కమలాకర కామేశ్వరావు 1911 అక్టోబర్ 4న మచిలీపట్నంలో జన్మించారు. అక్కడే బి.ఎ పూర్తి చేశారు. మొదట్లో కృష్ణా పత్రికలో 'సినీఫాన్' అన్న పేరుతో సినిమా రివ్యూలు వ్రాసే వారు. విడుదలైన తెలుగు సినిమాలను; న్యూ థియేటర్స్, ప్రభాత్ వారి హిందీ సినిమాలనూ కూలంకషంగా పరిశీలిస్తూ నిశితంగా విమర్శించేవారు. సినిమాల్లో కథ, కథాసంవిధానం ఎలా వున్నాయి? ఆ సినిమాలు టెక్నికల్ గా ఎలా వున్నాయి? అన్న విషయాల మీద ఆయన విమర్శలు సాగేవి. తెలుగు, హిందీ సినిమాలేగాక ఆంగ్ల చిత్రాల గురించి కూడా రాసేవారు.1931లో నోబెల్ బహుమతి గ్రహీత పెరల్ బక్ రాసిన 'గుడ్ ఎర్త్' నవలను 1937లో సిడ్నీ ఫ్రాంక్లిన్ దర్శకత్వంలో ఇర్వింగ్ తాల్ బర్గ్ సినిమాగా నిర్మించగా, అందులో పాల్‌ముని, లూసీ రైనర్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఆస్కార్‌ను గెలుచుకుంది. ఈ సినిమా గురించి కమలాకర నాలుగు వారాలు సమీక్షలు రాశారు. నిశిత దృష్టితో రాసిన ఆ సమీక్షలు పాఠకులను విపరీతంగా ఆకర్షించాయి. ఆయన సినిమా విమర్శలకు ఎంతో విలువ ఉండేది. ఆ విమర్శలు విజ్ఞులందరికీ ప్రామాణికంగా ఉండేవి. ఆ విమర్శల్ని చదివి, వాటిలో 'బాగుంది' అని రాస్తేనే ఆ సినిమాలను చూసేవాళ్ళు, బాగలేదని రాస్తే చూడని వాళ్ళు కూడా ఉండేవారు. ఆయన విమర్శలను నార్ల వెంకటేశ్వరరావు, గూడవల్లి రామబ్రహ్మంలాంటి ప్రముఖులందరూ ప్రశంసించారు. 'వస్త్రాపహరణం', 'మానసంరక్షణం' చిత్రాల మీద రాసిన విమర్శలే కామేశ్వరరావును సినిమా రంగంలోకి అడుగులు వేసేలా చేశాయి. 1936లో ఆయన సినిమాల మీదున్న మక్కువతో మద్రాస్ చేరారు. స్క్రిప్ట్ మీదున్న పట్టువల్ల మొదట్లో రచయితగా పనిచేశారు. అదే సమయంలోనే కె.వి. రెడ్డి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశారు. ఆయనతో



కలిసి అనేక సినిమాలకు స్క్రిప్ట్ వర్క్ కూడా చేశారు. వాహినీ వారి దేవత చిత్రం నుంచి కామేశ్వరరావు అసోసియేట్ గా పనిచేశారు. ఆసియాలోకెల్లా అతిపెద్ద స్టూడియోగా పేరుపొందిన వాహినీ స్టూడియోకు శంకుస్థాపన జరిగినప్పుడు మట్టి వేసిన వారిలో కామేశ్వరరావు ఒకరు.

బందరులో కామేశ్వరరావుకు పింగళి నాగేంద్ర రావుతో ఉన్న పరిచయంతో, కామేశ్వరరావు ఆయనను కె.వి.రెడ్డికి, బి.ఎన్.రెడ్డికి పరిచయం చేశారు. అలా తెలుగు సినిమా చరిత్రలో అత్యంత ప్రతిభావంతమైన రచయితను పరిశ్రమకు పరిచయం చేసింది కూడా కామేశ్వరరావే. కమలాకర కామేశ్వరావు దర్శకత్వం వహించిన మొదటి సినిమా 'చంద్రహారం'. ఇది జానపద సినిమాగా తెరకెక్కింది. ఇదే సినిమాను తమిళ వెర్షన్‌లో కూడా చేశారు.ఆ తర్వాత 'పెంకి పెళ్లాం' సినిమా చేశారు. ఎన్టీఆర్‌తో కలిసి 'పాండురంగ మహాత్మ్యం' అనే పౌరాణిక సినిమా చేసిన కామేశ్వరరావుకు ఊహించని పేరు వచ్చింది. ఈ సినిమా అప్పటి వరకు గ్లామర్ హీరోగా వెలిగిన ఎన్టీఆర్ ఈ సినిమాలో మరో కోణంలో చూపించి సక్సెస్ అందుకున్నారు. తర్వాత వరుసగా 'శోభ', 'రేచుక్క పగటి చుక్క', 'మహాకవి కాళిదాసు' 'మహామంత్రి తిమ్మరుసు' లాంటి సినిమాలు ఆయన దర్శకత్వంలో వచ్చి హిట్స్ అందుకున్నాయి. 'మహాకవి కాళిదాసు', 'మహామంత్రి తిమ్మరుసు' సినిమాలకు రాష్ట్రపతి పురస్కారం అందుకున్నారు కామేశ్వరరావు. 1962లో వచ్చిన 'గుండమ్మ కథ', 'మహామంత్రి తిమ్మరుసు' వంటి వరుస సక్సెస్‌లతో బాక్సాఫీస్ దగ్గర కామేశ్వరావు పేరు మారుమోగి పోయింది. 'గుండమ్మ కథ' సినిమా కుటుంబ కథా చిత్రంగా కామేశ్వరరావుకు మంచి పేరు తెచ్చుకుంది.

కామేశ్వరరావు దర్శకత్వంలో వచ్చిన మరో హిట్ మూవీ 'నర్తనశాల'. ఈ సినిమాతోనే ఎస్.వి.రంగారావుకు ప్రపంచ వ్యాప్తంగా పేరొచ్చింది. జకార్తాలో జరిగిన ఆఫ్రో ఏషియన్ ఫిలిం ఫెస్టివల్‌లో పాల్గొని ఉత్తమ నటుడిగా ఎస్వీఆర్ అవార్డు అందుకున్నారు.

అంతకు ముందు కమలాకర దర్శకత్వంలో వచ్చిన 'పాండవ వనవాసం' సినిమా కూడా కామేశ్వరరావుకు మంచి పేరు తీసుకొచ్చింది. పౌరాణిక సినిమాల్లో అదే ఆయన ఫస్ట్ మూవీ. ఆ తర్వాత 'శకుంతల', 'శ్రీకృష్ణ తులాభారం', 'కాంభోజరాజు కథ', 'శ్రీకృష్ణావతారం', 'కలిసిన మనసులు', 'వీరాంజనేయ' లాంటి సూపర్ హిట్ సినిమాలు దర్శకుడిగా ఆయన ఖ్యాతిని పెంచాయి. పౌరాణికాల మీదున్న పట్టుతో 1972లో కామేశ్వరరావు పిల్లలతో 'బాల భారతం' సినిమా తీసి ప్రేక్షకులను మెప్పించారు. 1970 ద్వితీయార్థానికి తెలుగులో పౌరాణికాలకు ఆదరణ పెరిగింది. ఒక రకంగా ఎన్టీఆర్ పౌరాణిక హీరోగా ఒక వెలుగు వెలగడంలో కమలకర కామేశ్వరరావు తీసిన సినిమాలే కీ రోల్ పోషించాయి. రామారావు కూడా కమలకర కామేశ్వరరావును తన గురువుగా భావించేవారు. 'కురుక్షేత్రం', అంతగా విజయవంతం కాకున్నా, తర్వాత ఆయన దర్శకత్వంలో వచ్చిన 'సీతారామ వనవాసం', 'వినాయక విజయం', 'వాసవీ కన్యకా పరమేశ్వరి మహాత్మ్యం', 'సంతోషిమాత వ్రత మహాత్మ్యం', 'శ్రీదత్త దర్శనం', 'అష్టలక్ష్మి వైభవం', 'ఏడుకొండల స్వామి' లాంటి పౌరాణిక సినిమాలెన్నో బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్‌గా నిలిచాయి. దర్శకుడిగా కమలాకర కామేశ్వరరావు పౌరాణిక, చారిత్రాత్మక, జానపద, సాంఘిక సినిమాలు చేసినా... ఆయనకు పేరు సంపాదించి పెట్టినవి మాత్రం పౌరాణికాలే. అందుకే ఆయన్ని అందరు తెలుగు వెండితెర పౌరాణిక బ్రహ్మగా కీర్తిస్తారు. ఎన్నో అపురూపమైన చిత్రాలలో ప్రేక్షకుల మనసు దోచుకున్న కామేశ్వర రావు 1998 జూన్ 29న కన్ను మూశారు. గ్లాస్గో పంచె, తెల్లని మల్లెపూల వంటి జుబ్బా, నెరసిన జుట్టు, నుదుట కుంకుమ బొట్టు... జీవితంలో ప్యాంటు వేయని మూర్తీభవించిన తెలుగుదనానికి ప్రతీకగా నిలిచిన కమలాకర కామేశ్వరరావు మన మధ్య లేకపోయినా. ఆయన సినిమాలతో ఇప్పటికీ ప్రేక్షకుల మదిలో చిరంజీవిగా నిలిచే ఉన్నారు.



-రామ కిష్టయ్య
సంగన భట్ల...
9440595494

# ఆదిపరాశక్తి మనందరికీ నిత్య స్ఫూర్తి

ఆశ్వయుజం వచ్చింది. మనందరికీ ఆదిపరాశక్తిని (జగన్మాత) కొలిచే అదృష్టాన్నిఇచ్చింది. అమ్మను కొలిచే ఈ తొమ్మిది రోజులను నవ రాత్రులుగాను,శరదృతువులో వస్తుంది కనుక శరన్నవ రాత్రులుగాను, దేవిని ఆరాధన చేస్తాము కనుక దేవీనవరాత్రులుగాను మనం భావిం చి పూజించాలి. అత్యంత పవిత్ర శుభ దినాలైన దేవీ నవరాత్రులలో ఆదిశక్తిని ఆరాధించే విధానాన్ని విష్ణు పురాణం, దేవీ త్రిశతి, స్కాంద పురాణం, దేవి భాగవతం లాంటి గ్రంథాలు వివరిస్తున్నాయి. దేవీ నవ రాత్రులలో ఆ అమ్మను మనంవివిధ రూపాల్లో ఎలా పూజించాలో తెలుసుకుందాం. ఈ శరన్నవరాత్రులు చైతన్య స్ఫూర్తిదాయకాలు ఆశ్వయిజ పాడ్యమినాడు కలశస్థాపన చేసి, దేవుని ఆవాహనం చేసి నవమి వరకు పూజలు చేస్తారు. ఈ తొమ్మిది రోజులు అన్ని శక్తి పీఠాల్లో, దేవాలయాల్లో, ఇళ్లల్లో, ఈ మధ్యకాలంలోనైతే మండపా లలో అమ్మ ఆదిపరాశక్తిని అర్చిస్తారు. అదే మన సంప్రదాయం.

సర్వ మంగళ మాంగళ్యే;
శివే సర్వార్థ సాధికే|
శరణ్యే త్రయంబకే గౌరీ;
నారాయణి నమోస్తుతే||

చెడును నశింపజేసి మంచిని నెలకొల్పడానికి దానవత్వాన్ని తుంచి, మానవత్వాన్ని స్థాపించడానికి అధర్మం మీద ధర్మం సాధించే విజయానికి క్షేత్రమైన ఈ నవరాత్రులు జగత్తుకు స్ఫూర్తిని చైతన్యాన్ని కలిగిస్తున్నాయి.

సర్వ దేవతాశక్తుల ఏకరూపమే ఆదిపరాశక్తి అవతారము

యా దేవీ సర్వభూతేషు;
శక్తి రూపేణ సంస్థితా||
నమస్తస్యై నమస్తస్యై;
నమస్తస్యై నమో నమః

సమస్త ప్రాణికోటిలో శక్తిరూపంగా గోచరించే దేవికి నమస్కారం అని మార్కండేయ పురాణం చెబుతుంది. శక్తి లేని పదార్థం ఏ పని చేయలేదని భాష్యం పేర్కొంటుంది. ఈ నామరూపక ప్రపంచంలో ఆపరాశక్తి ఉందని యజుర్వేదం చెబుతోంది 'అహం బ్రహ్మస్వరూపిణీ మత్తః ప్రకృతి పురుషాత్మకం జగత్' నేను బ్రహ్మస్వరూపిణిని నా వల్లనే ప్రకృతి పురుషాత్మక జగత్తు అంతా ఉద్భవించిందని దేవి తెలుపుతుంది. అమ్మ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయిక ఆదిపరాశక్తి ఆదిమధ్యంతరహిత శుద్ధ పర బ్రహ్మ స్వరూపిణి. ఆ తల్లి సృష్టి వేళలో సృజన రూప, పాలన వేళలో జగద్రక్షకి, సంహార వేళ రుద్ర రూపిణి. ఆ తల్లి ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి దేవకార్య నిర్వహణార్థం త్రిమూర్తుల దివ్యశక్తులను ఏకోన్ముఖం చేసి సర్వదేవతా శ క్తులను కేంద్రీకృతం చేస్తూ చేసిన యజ్ఞంలో చిదగ్ని గుండ సంభూతగా ఆవిర్భవించిన దివ్య కాంతిపుంజం. పరమేశ్వరుని శుద్ధమంగళ స్వరూపం జగన్మాత.




**దుర్గతి నాశిని, సద్గతి దాయిని ఆ దుర్గమ్మ**

జగన్మాత అనంత బాహువులలో సర్వ దేవతల ఆయుధాల తేజం చేరింది. నహి కారణం వినాకార్యం శివోత్పత్తి కారణం లేకుండా కార్యం కలుగదు కాబట్టి దుష్ట శిక్షణ శిష్ట రక్షణ కొరకు అవతరించిన ఆ శక్తి స్వరూపిణి ఆ మాతృ శక్తి మనకు నిత్యస్ఫూర్తి దాయకం స్వార్థపరత్వం అసూయ ,ఈర్ష్యా ద్వేషాలను కోపావేశాలను అణిచి మానవకోటిని సక్రమ మార్గంలో నడిపించే ఆ తల్లి మనకు సన్మార్గదర్శి చెడు నుండి రక్షించే ఆపద్బాంధవి సకల విజయాలకు సంపదలకు మూలస్థానం జగన్మాత.

ఆదిశక్తిని ఆదర్శంగా తీసుకొని జీవిద్దాం!

స్త్రీ శక్తికి ప్రతీక అయిన ఆ తల్లి శుభ నిశుంబులను అణిచి మహిషాసురుని అంతమొందించి లోకాలను ఎలా రక్షించిందో అలాగే ఈ సమాజంలో మనకు ఎదురయ్యే రాక్షస ప్రవృత్తుల నుండి మనల్ని మనం రక్షించుకుందాం. దుర్వ్యసనాలను నాశనం చేద్దాం మనలోని మన చుట్టూ ఉన్న దుర్గుణాలను నశింపజేద్దాం స్త్రీ అంటేనే శక్తి స్వరూపిణి స్త్రీ మూర్తిలో అమ్మ ఉంది ఆ అమ్మే జ్ఞానం ఆ అమ్మే శక్తి ఆ అమ్మే అన్నపూర్ణ ఆ అమ్మే దుర్గాదేవి ఆ అమ్మే మహిషాసురమర్ధిని ఆకలి వేస్తే అన్నం పెడుతుంది అన్యాయం చేస్తే ప్రాణం తీస్తుంది అని ప్రతి ఒక్కరు గుర్తించేలా చేస్తుంది. అమృతత్వాన్ని అమ్మ అవతారాలను అమ్మ రూపాలను తెలియజేసే ఈ ఆశ్వీయుజ పాడ్యమి మొదలు నవమి వరకు అమ్మ ఆరాధన వల్ల కలిగే సకారాత్మక శక్తిని ఆ శక్తి ప్రకృతిలో మమేకమై పరాశక్తిగా అందించే శుభతత్వాన్ని స్వీకరిద్దాం! ఆ దుర్గామాతను ఆదర్శంగా తీసుకొని ఆ స్ఫూర్తితో దరిద్రాన్ని, దుఃఖాన్ని తరిమికొడదాం! దుర్వ్యసనాలను నాశనం చేద్దాం! అన్యాయం అత్యాచార అధర్మ అసురీ ప్రవృత్తులను నశింపజేసి ఆ తల్లి స్ఫూర్తితో మనం అన్యాయాన్ని ఎదిరిద్దాం! అత్యాచారాలను అరికడదాం! అధర్మాన్ని దునుమాడుదాం! అసురీ భావాలను అంతం చేద్దాం. మన ఆడబిడ్డలను దుర్గలుగా తీర్చిదిద్దుదాం! ఆ పరాశక్తిని భక్తితో కొలుద్దాం! అమ్మను , అమ్మ శక్తిని ఆదర్శంగా స్వీకరిద్దాం! ఆదర్శంగా జీవిద్దాం! సనాతన భారతీయ ధర్మాన్ని మనం అందరం పరిరక్షిద్దాం!



వ్యాసకర్త: "సాహిత్య కళా విభూషణ"
-చౌదూరి నరసింహారావు
ఆధ్యాత్మిక,సామాజిక విశ్లేషకులు

## వైవిధ్య పాత్ర చిత్రణల

# మధురాంతకం

400కు పైగా కథలు, రెండు నవలలు, నవలికలు, నాటకాలు, గేయాలు, సాహితి వ్యాసాలు రచించిన మధురాంతకం రాజారం (అక్టోబర్ 5, 1930 - ఏప్రిల్ 1, 1999) తెలుగు సాహితీ ఉన్నతికి చేసిన కృషి అనన్య సామాన్యం. తెలుగు సాహిత్యపు మాధుర్యాన్ని ప్రపంచమంతా చాటిన గొప్ప కథకులు. ఆయన ఎక్కువగా తమిళ రచనలను తెలుగులోకి అనువదించారు. ఆయన కథలు అనేకం తమిళ, కన్నడ, హిందీ, ఆంగ్ల భాషలలోకి అనువాదమయ్యాయి. చిన్ని ప్రపంచం - సిరివాడ నవల రష్యన్ భాషలోకి తర్జుమా అయింది. 1993 లో మధురాంతకం రాజారాం కథలు పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. మధురాంతకం రాజారాం చిత్తూరు జిల్లా మొగరాల గ్రామంలో 1930, అక్టోబర్ 5న ఆది లక్ష్మమ్మ, విజయరంగం పిళ్ళై దంపతులకు జన్మించారు. ఆయన ప్రాథమిక విద్య ఒక ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో జరిగింది. 1945 లో చిత్తూరులోని జిల్లా బోర్డు హైస్కూలు (ప్రస్తుతం పి. సి. ఆర్ కళాశాల) నుంచి ఎస్. ఎస్. ఎల్. సి పూర్తి చేశారు. చదువుకునే రోజుల నుంచి ఆయన సాహిత్యం పట్ల అభిరుచి కలిగి ఉండేవారు. రాజారాం వృత్తి రీత్యా ఉపాధ్యాయులు.

ముందు గేయ రచయితగా తన రచనా ప్రస్థానం ప్రారంభించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నారు. ఆయనకు ఆంధ్రపత్రిక, భారతి లాంటి పత్రికలతో పరిచయం ఏర్పడింది. అందులో రచనలు, పద్యాలు, గేయాలు చదివి ఆయన సాహితీ రంగం వైపు ఇంకా ఉత్తేజితులయ్యారు. 1951లో ఆయన రాసిన పరమానంద శిష్యులు అనే కథా గేయం ఆంధ్రపత్రికలో ప్రచురితమైంది. ఆయన రాసిన మొట్టమొదటి కథ కుంపట్లో కుసుమం. 1968 లో ఆయనకు ఉత్తమ కథకుడిగా సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. తెలుగులో మలితరం కథా రచనలో రాజారందొక భిన్నమైన శైలి. వందలాది కథలలో అమోఘమైన వైవిధ్య భరిత పాత్ర చిత్రణలు ఆయనకే ప్రత్యేకం. పోలికలు ఏ మాత్రం లేని విభిన్న వ్యక్తిత్వాలు



దర్శనం ఇస్తాయి. ఆయన పాత్రలు వాస్తవాలకు ప్రతిరూపాలు. పలు రకాల మనుషులు, భిన్న మనస్తత్వాలు, గ్రామీణ జీవితాలు, మధ్యతరగతి మానవులు, సగటు మనిషి సమస్యలు ఆయన కథా వస్తువులు.

గ్రామీణ వాతవరణంలో పుట్టిపెరిగి, టీచరుగా పల్లెటూళ్ళు తిరుగుతూ, పలురకాల మనుషులను, భిన్న మన స్తత్వాలను లోతుగా, అత్యంత సమీపంగా చూసే అవకాశం ఆయనకు కలిగింది. ఆ అనుభవాలే కథల రూపంలో వచ్చాయి. ఆయన రాసిన కథలన్నీ మనకు నిత్య జీవితంలో మన చుట్టూ జరిగినట్టే ఉంటాయి. ఆయన కథలు మాత్రమే కాక, నవలలు, నాటకాలు, గేయాలు, వ్యాసాలు కూడా ఎన్నో రాశారు. 1968 లో తాను వెలిగించిన దీపాలు కథా సంపుటికకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం. అనువాద రచనకు తంజావూర్ విశ్వ విద్యాలయం అవార్డు, 1990 లో గుంటూరు అరసం కొండేపూడి శ్రీనివాసరావు సాహితీ సత్కారం, 1991 లో గోపీచంద్ సాహితీ సత్కారం; 1993 లో మధు రాంతకం రాజారాం కథలు పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి; 1994 లో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్; 1996 లో అప్పా జోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వారి ప్రతిభామూర్తి పురస్కారం లభించాయి. ఆయన 1999, ఏప్రిల్ 1వ తేదిన ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

## మూసీనది నిర్వాసితులపై ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)
ఎండీ దాన కిషోర్ కన్వీనర్‌గా ఉన్న ఈ కమిటీలో మైనార్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఎస్సీ, బీసీ సంక్షేమశాఖతోపాటు పాఠశాల విద్య కమిషనర్, తెలంగాణ గురుకుల పాఠశాలల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ కమిటీలోని సభ్యులు..తమ తమ శాఖలకు సంబంధించిన కార్యాచరణను రూపొందించి 30 రోజుల్లోగా ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించింది.

## రైతుల పేరుతో బీజేపీ, బీఆర్‌ఎస్ ఆందోళన విడ్డూరం

(మొదటి పేజీ తరువాయి)
10 నెలల కాంగ్రెస్ పాలన విజయవంతంగా సాగిందన్నారు. రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులు అధిగమించి హామీలు నెరవేస్తున్నామన్నారు. వరదల వల్ల రూ.10 వేల కోట్ల నష్టం జరిగితే కేంద్రం రూ.400 కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. మంత్రి కొండా సురేఖ విషయంలో సినిమా వాళ్లు సంయమనం పాటించాల్సి ఉందని మంత్రి పొన్నం అన్నారు. ఆమె తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నాక సినిమా వాళ్లు స్పందించడం సరికాదన్నారు. మంత్రి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నాక సమస్య ముగిసినట్టే అన్నారు. బలహీనవర్గాల మహిళా మంత్రి ఒంటరి కాదని పొన్నం ప్రభాకర్ అన్నారు. సినిమా వాళ్ల విషయంలో కొంత సంయమనం పాటించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంత్రి తన వ్యాఖ్యలు ఉపసంహరించుకున్నా కొందరు ఇంకా చర్చను కొనసాగించారన్నారు. కొండా సురేఖను అవమానించేలా పోస్ట్ చేసిన అంశంపై కూడా సినిమా వాళ్లు స్పందిస్తే బాగుండేదని మంత్రి పొన్నం అన్నారు.

## త్వరలో తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి

(మొదటి పేజీ తరువాయి)
తెలంగాణలో ధాన్యం దిగుబడులు గణనీయంగా పెరగడంతో పాటు నాణ్యత మెరుగుపడినందున బియ్యం ఎగుమతిపై చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు.

## మూసీ వెనక దాక్కున్న ముసుగు దొంగ ఎవరు?

**విశ్వంభర, హైదరాబాద్ :** మూసీ నది ప్రక్షాళన పేరుతో.. పేదల జీవితాలతో ఆటాడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా.. రైతు రుణమాఫీ, రైతుబంధు ఎగ్గొట్టాడని రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ నిప్పులు చెరిగారు. రేవంత్ సర్కార్ పరిపాలనపై కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. రైతు రుణమాఫీ ఎగ్గొట్టి, మూసీలో మురికి రాజకీయాలు చేస్తున్న మురికి దొంగ ఎవరు..? అని కేటీఆర్ నిలదీశారు. రైతుబంధు ఎగ్గొట్టి, మూసీ పేదల ఉసురు పోసుకుంటున్న దుర్మార్గుడు ఎవరు..? మహిళలకు వంద రోజుల్లోనే నెలకు రూ. 2500 ఇస్తా అని చెప్పి తప్పించుకు తిరుగుతున్న మోసగాడు ఎవరు..? అవ్వ, తాతలకు నెలకు రూ. 4000 ఇస్తా అని చెప్పి ఎగ్గొట్టిన నయవంచకుడు ఎవరు..? ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం ఇస్తా అని మాట తప్పిన దగావీరుడు ఎవరు..? మూసీ బ్యూటిఫికేషన్ పేరిట లూటిఫికేషన్‌కి తెరతీసిన ఘనుడు ఎవరు..? అని కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు.

## రైతుల ఖాతాల్లో కిసాన్ సమ్మాన్ నిధులు..

(మొదటి పేజీ తరువాయి)
నమో షెత్కారీ మహాసమ్మాన్ నిధి యోజన సైతం ప్రారంభించారు. దేశవ్యాప్తంగా రైతులకు కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.6వేల చొప్పున మూడు విడుతల్లో కిసాన్ సమ్మాన్ నిధిని నేరుగా రైతుల ఖాతాల్లో సమ చేస్తున్న విషయం తెలిసిందే. తొలి విడుతలో ఏప్రిల్ – జూలై మధ్య.. రెండో విడుతలో ఆగస్టు-నవంబర్.. మూడో విడుతలో డిసెంబర్-మార్చి మధ్య కేంద్రం సాయాన్ని రైతులకు అందిస్తున్నది. ఇక ఇప్పటి వరకు రూ.3.45 లక్షల కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. కిసాన్ నిధులు సమ కాని రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని.. ఇందు కోసం అధికారిక వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కేంద్ర సూచించింది. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, కేంద్రమంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, రాజీవ్ రంజన్ సింగ్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవిస్, అజిత్ పవార్, మంత్రి సంజయ్ రాథోడ్ పాల్గొన్నారు.

## ఓపిక నశించింది..

**ఢిల్లీ:** రేషన్ కార్డుల కోసం ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వలస కార్మికులకు కార్డుల జారీలో జాప్యం చేస్తున్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. రాష్ట్రాల తీరు ఆందోళనకరమని, ఈ విషయంలో తమకు ఇక ఓపిక నశించిందని పేర్కొంది. ''ఈ అంశంలో ఎలాంటి ఉదాసీనతకు చోటు లేదని మరోసారి స్పష్టంగా చెబుతున్నాం. ఇక మాకు ఓపిక నశించింది. మా ఉత్తర్వులను పాటించేందుకు మీకు చివరి అవకాశం ఇస్తున్నాం. లేదంటే మీ కార్యదర్శులు కోర్టుకు రావాల్సి ఉంటుంది'' అని సుప్రీంకోర్టు ధర్మాసనం హెచ్చరించింది. ఈ వ్యవహారంపై నవంబరు 19లోగా కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. కొవిడ్ సమయంలో వలస కార్మికులు ఎదుర్కొన్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని.. సర్వోన్నత న్యాయస్థానం 2020లో దీనిపై సుమోటోగా విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే జాతీయ ఆహార భద్రత చట్టం కింద కోటాతో సంబంధం లేకుండా.. ఈ-శ్రమ్ (e-shram Portal) పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న దాదాపు 8 కోట్ల వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయాలని 2021లో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. అయితే, ఇప్పటివరకు కొన్ని రాష్ట్రాలు మాత్రమే ఈ ప్రక్రియను పూర్తి చేయగా.. మిగతా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు జాప్యం చేస్తున్నాయి. దీంతో సుప్రీంకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది.



# హైడ్రా ఇక తగ్గేదేలే!

(మొదటి పేజీ తరువాయి)
కొత్తగా 374 బి సెక్షన్‌ను చేర్చింది. ఆ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోద ముద్ర వేయడంతో గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఆర్డినెన్స్ తో హైడ్రా మరింత బలోపేతంకానుంది. ఈ చట్టాన్ని రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదించనున్నట్లు తెలుస్తోంది. అప్పటివరకు హైడ్రాకు ఈ ఆర్డినెన్స్ రక్షణగా ఉండనుంది. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఆర్డినెన్స్‌పై గవర్నర్ పలు సందేహాలు వ్యక్తం చేయగా.. పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ నివృత్తి చేయడంతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోద ముద్ర వేశారు. చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు, ఆట స్థలాలు సహా ప్రభుత్వ ఆస్తుల్ని సంరక్షించడంతో పాటు ప్రకృతి వైపరీత్యాల సమయంలో రక్షణ చర్యలు, భారీ వర్షాలు కురిసినప్పుడు ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుని క్రమబద్ధీకరించడం, అగ్నిమాపకశాఖ సేవలకు ఎన్‌వోసీ జారీచేయడం తదితర లక్ష్యాలతో జులై 19న జీవో ఎం.ఎస్ 99 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసింది. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని హైడ్రా పరిధిలో చేర్చారు. హైడ్రా ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విభాగం, విపత్తు నిర్వహణ విభాగాలు ఇప్పటికే పనిచేస్తుండగా.. ఆర్డినెన్స్‌తో మరిన్ని కీలక



అధికారాలు హైడ్రాకు దఖలు పడ్డాయి. ఆ విభాగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఇటీవలే పలువురు ఉన్నతాధికారులు సిబ్బందిని ప్రభుత్వం కేటాయించింది.

**ఇవీ అధికారాలు..**

- ఆక్రమణలను పరిశీలించడం, నోటీసులివ్వడం, ప్రభుత్వ స్థలాల్లోని ఆక్రమణల తొలగింపు అధికారం కల్పించే జీహెచ్‌ఎంసీ చట్టం-1955లోని సెక్షన్ 374బీని ఆర్డినెన్స్‌లో చేర్చారు. అనధికారిక ప్రకటనలకు జరిమానాలు విధించే అధికారం కూడా హైడ్రాకు బదిలీ అయింది.
- పురపాలక చట్టం-2019 ప్రకారం సంబంధిత కార్పొరేషన్, మున్సిపాలిటీ కమిషనర్‌కు ఉన్న అధికారాలు, బీపాస్ చట్టం-2020 ప్రకారం జోనల్ కమిషనర్ నేతృత్వంలోని జోనల్ టాస్క్‌ఫోర్స్, కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు ఉన్న అధికారాలు హైడ్రాకు ఇచ్చారు.
- హెచ్ఎండీఏ చట్టం-2008లోని పలు సెక్షన్ల కింద కమిషనర్‌కు ఉన్న అధికారం, తెలంగాణ భూ ఆదాయ చట్టంలోని సెక్షన్ 1317ఎఫ్ ప్రకారం ఆక్రమణల తొలగింపు, ఆస్తుల పరిరక్షణకు సంబంధించి ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌కు ఉన్న అధికారాలు, ఇవే అంశాలకు సంబంధించి తెలంగాణ నీటిపారుదల చట్టంలోని అధికారాలు, జీవో ఎం.ఎస్-67 ద్వారా 2002లో యూడీఏ/ఎగ్జిక్యూటివ్ అధికారికి ఇచ్చిన అధికారాలను హైడ్రాకు కట్టబెట్టారు.
- భూ ఆక్రమణ చట్టం-1905లోని పలు సెక్షన్ల కింద జిల్లా కలెక్టర్, తహసీల్దార్, డీటీకి ఉన్న అధికారాలు, వాల్టా చట్టం-2002, తెలంగాణ బిల్డింగ్ రూల్స్, తెలంగాణ ఫైర్ సర్వీసెస్ చట్టంలోని పలు అధికారాలను కూడా హైడ్రాకు వర్తింపజేశారు. నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో జాప్యానికి తావు లేకుండా హైడ్రా కొత్త అధికారాలతో స్వయంగా చర్యలను సకాలంలో తీసుకోగలుగుతుంది.

## దేశానికి రోల్ మోడల్ గా కొత్త రెవెన్యూ చట్టం

**విశ్వంభర, నాగార్జున సాగర్:** ప్రస్తుతం ఉన్న రెవిన్యూ చట్టంలో మార్పులను తీసుకువచ్చి దేశానికే రోల్ మోడల్ గా ఉండేలా నూతన రెవెన్యూ (ఆర్ ఓ ఆర్) చట్టాన్ని తీసుకురానున్నామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం ఉన్న రెవెన్యూ చట్టంలో తప్పొప్పులను సవరించి ,అన్ని రకాల భూ సమస్యలను పరిష్కరించి నూతన చట్టాన్ని తీసుకువచ్చేందుకు ఉద్దేశించి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన నాగార్జునసాగర్ నియోజకవర్గం, తిరుమలగిరి సాగర్ మండలం, నెల్లికల్ గ్రామంలో నిర్వహించిన రైతుల ముఖాముఖి కార్యక్రమానికి మంత్రి శనివారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2020 రెవెన్యూ చట్టం,ధరణి వల్ల రాష్ట్రంలోని రైతులు, ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని,, 2020 చట్టాన్ని, ధరణిలోని తప్పొప్పులను సవరించేందుకు దేశంలోని అన్ని రెవెన్యూ చట్టాలను పరిశీలించి మేలైన చట్టం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను సేకరించి పబ్లిక్ డొమైన్ లో ఉంచినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే తిరుమలగిరి సాగర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశామని చెప్పారు.నూతన రెవెన్యూ చట్టంపై ప్రజల అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే చట్టం తీసుకురావాలని ,అలాగే ప్రధాన ప్రతిపక్ష పార్టీల సూచనలు సైతం పరిగణనలోకి తీసుకొని అతి కొద్ది రోజుల్లోనే నూతన రెవెన్యూ చట్టాన్ని ప్రజల ముందుకు తీసుకురాబోతున్నామని మంత్రి వెల్లడించారు. అర్హులైన పేదవారికి ప్రభుత్వ భూములు అందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని ,ప్రత్యేకించి తిరుమలగిరి సాగర్ లో కొంతమంది




పొజిషన్లో ఉన్నప్పటికీ పట్టాలు లేవని, పట్టాలున్న వారికి భూమిలేదని, అలాగే ఎవాక్యూవేషన్ ప్రాపర్టీ కి సంబంధించి, ఇతర ప్రభుత్వ భూములకు సంబంధించిన చేస్తున్న సర్వే పూర్తయిన తర్వాత సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. తిరుమలగిరి సాగర్లో సుమారు 13 వేల ఎకరాలకు బోగస్ పట్టా పాస్ పుస్తకాలు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తమ దృష్టికి తీసుకువచ్చారని, ప్రభుత్వం పేదలకు మంచి చేయాలన్నదే తపన అని, ప్రభుత్వాస్తులన్నీ పేదవాడికి చెందాలని, పేదవాడికి చెందేలా ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని చెప్పారు. తిరుమలగిరి సాగర్ లోని 3500 నుండి 4 వేల ఎకరాలు అర్హులైన పేదవారికి పట్టాలు ఇవ్వాల్సి ఉందని, డిసెంబర్ 9న రాష్ట్ర ముఖ్యమంత్రిని నాగార్జునసాగర్ నియోజకవర్గానికి తీసుకువచ్చి ఇక్కడే బహిరంగ సభ ఏర్పాటు చేసి నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని వేలాది ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంచుతామని మంత్రి వెల్లడించారు. గతంలో చెప్పినట్లుగానే పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని, నెలాఖరులోపు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు మొదటి విడతన 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లను ఇస్తామని , నాగార్జునసాగర్ నియోజకవర్గానికి 5000 ఇండ్లు ఇస్తామని మంత్రి ప్రకటించారు. గతంలో ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి సర్టిఫికెట్లు లేక బ్యాంకులో తాకట్టులో ఉన్న వాటిని ఆ మార్ట్ గేజ్ అప్పు నిలిపివేసి లబ్ధిదారులకే ఆ ఇండ్లు సొంతం అయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు.అలాగే గతంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరై గృహనిర్మాణ శాఖలో ఉన్న హక్కు పత్రాలు పెండింగ్ లో ఉన్నాయని, ఆ పెండింగ్ ను క్లియర్ చేసి లబ్ధిదారులందరికీ ఆ హక్కు పత్రాలు ఇచ్చేలా గృహ నిర్మాణ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## బీజేపీ ఆశలు గల్లంతేనా?

(మొదటి పేజీ తరువాయి)
నుంచి ఎగ్జిట్ పోల్స్ అంచనా పోటెత్తుతున్నాయి. ఆర్టికల్ 370 రద్దు, దశాబ్దకాలం తరువాత అసెంబ్లీ ఎన్నికలు జరగడం వల్ల అందరి దృష్టి కూడా జమ్మూ కాశ్మీర్ మీదే నిలిచింది.ఇక్కడ హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ సంస్థలు అంచనా వేశాయి. దైనిక్ భాస్కర్, రిపబ్లిక్- గులిస్తాన్ వంటి ఎగ్జిట్ పోల్స్ అన్నీ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశాయి. సంస్థ అంచనా వేసింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మేజిక్ ఫిగర్ 46. ఈ సంఖ్య ఏ పార్టీకి కూడా అందబోదని అభిప్రాయపడింది. తాజాగా యాక్సిస్ మై ఇండియా కూడా ఇదే బాట పట్టింది. జమ్మూ కాశ్మీర్‌లో హంగ్ అసెంబ్లీ తప్పదని అంచనా వేసింది. దాదాపుగా ఏ పార్టీకి కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన సంఖ్యా బలం దక్కకపోవచ్చని తెలిపింది. నేషనల్ కాన్ఫరెన్స్- కాంగ్రెస్ పార్టీ అతిపెద్ద కూటమిగా ఆవిర్భవిస్తాయని పేర్కొంది. ఈ కూటమికి 35 నుంచి 45 సీట్లు దక్కవచ్చు. భారతీయ జనతా పార్టీకి ఈ ఎన్నికలు ఆశనిపాతంలా మారుతాయని యాక్సిస్ మై ఇండియా పేర్కొంది. ఈ ఎగ్జిట్ పోల్స్ ప్రకారం చూస్తే బీజేపీ 24 నుంచి 34 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వస్తుంది. మెహబూబా ముఫ్తికి చెందిన పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీకి ఏడు సీట్లు మాత్రమే లభిస్తాయి. ఇతరులు 15 స్థానాలను గెలుచుకుంటారు.పోల్ ఆఫ్ పోల్స్ సంస్థ కూడా నేషనల్ కాన్ఫరెన్స్- కాంగ్రెస్ వైపే మొగ్గు చూపింది. ఈ కూటమికి 38 నుంచి 45 నియోజకవర్గాలు లభిస్తాయని తెలిపింది. ఇక్కడ హంగ్ అసెంబ్లీ లేదా బొటాబొటి మెజారిటీతో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి



వస్తుందని తెలిపింది. భారతీయ జనతా పార్టీకి నిరాశ తప్పకపోవచ్చు. దాదాపుగా అన్నిఎగ్జిట్ పోల్స్ కూడా బీజేపీని రెండో స్థానానికే పరిమితం చేయడం గమనార్హం. బీజేపీకి 25 నుంచి 32 సీట్లే వస్తాయని పోల్ ఆఫ్ పోల్స్ కూడా తెలిపింది. ఆర్టికల్ 370 రద్దు, జమ్మూ కాశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చినప్పటికీ.. దీనివల్ల వల్ల పెద్దగా బీజేపీకి రాజకీయ లబ్ధి దక్కే అవకాశం లేదని పేర్కొంది. ఇక పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ 5 నుంచి 9 సీట్లు లభిస్తాయి. ఇతరులు 8 నుంచి 14 స్థానాలను దక్కించుకుంటారు. ప్రభుత్వ ఏర్పాటులో ఈ ఇతరులు అనే ఫ్యాక్టరే కీలకంగా మారుతుందనే అంచనాలు ఉన్నాయి. స్వతంత్రులు, చిన్న పార్టీల ఎమ్మెల్యేలు పెద్ద పాత్ర పోషించడం ఖాయంగా కనిపిస్తోంది.

**జమ్మూ కశ్మీర్..**

పీపుల్స్ పల్స్ సర్వేలో జేకేఎన్-సీ 33-35, బీజేపీ 23-27, కాంగ్రెస్ 13-15, జేకే పీడీపీ 7-11, ఏఐపీ 0-1, ఇతరులు 4-5 నుంచి సీట్లు గెలిచే అవకాశాలున్నాయని చెప్పింది. రిపబ్లిక్ మ్యాట్రిజ్ సర్వే ప్రకారం.. బీజేపీకి 25, కాంగ్రెస్‌కు 12, ఎన్సీకి 15, పీడీపీకి 28, ఇతరులు ఏడు స్థానాల్లో గెలుస్తారని చెప్పింది. ఇండియా టుడే-సీ ఓటర్ సర్వేలో ఎన్సీ కూటమికి 11-15, బీజేపీ 27-31, పీడీపీ 0-2, ఇతరులు 0-1 సీట్లు వస్తాయని పేర్కొన్నది.

**హర్యానాలో కాంగ్రెస్ హవా..**

హర్యానాలో ఈ సారి బీజేపీకి పరాభవం తప్పదని.. కాంగ్రెస్‌దే హవా అని పలు సర్వేలు పేర్కొన్నాయి. ఇక జమ్మూ కశ్మీర్‌లో సంకీర్ణ ప్రభుత్వం వస్తుందని పీపుల్స్ పల్స్ సౌత్ సర్వే చెప్పింది. హర్యానాలో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసే అవకాశం ఉందని తెలిపింది. అయితే, ఆర్టికల్ 376 ఎత్తిన తర్వాతన తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో ఏ ఒక్క పార్టీకి మెజారిటీ వచ్చే అవకాశం లేదని.. నేషనల్ కాన్ఫరెన్స్ మాత్రం అతిపెద్ద పార్టీగా నిలిచే అవకాశాలున్నట్లు పేర్కొంది. హర్యానాలో 90, జమ్మూ కశ్మీర్‌లో 90 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి.

**హర్యానా ఎగ్జిట్ పోల్స్ ఇలా..**

పీపుల్స్ పల్స్ సర్వే ప్రకారం.. కాంగ్రెస్‌కు 55, బీజేపీకి 26, ఐఎన్ఎల్డీ 2-3, బీజేపీకి ఒక స్థానంలో గెలిచే అవకాశాలున్నాయని చెప్పింది. సట్టా బజార్ సర్వేలో కాంగ్రెస్ 50, బీజేపీ 25 సీట్లు వస్తాయని.. ఏబీపీ-సీ ఓటర్ సర్వేలో బీజేపీకి 78, కాంగ్రెస్ 8కి వస్తాయని తెలిపింది. న్యూస్ 18-ఐపీఎస్ఓఎస్ సర్వేలో బీజేపీ-75, కాంగ్రెస్-10 వస్తాయని తెలిపింది.

## మస్క్ పొరపాటు.. తప్పుడు ఖాతాకు రూ.43కోట్లు బదిలీ..!

**బ్రెజిల్:** తప్పుడు సమాచారం వ్యాప్తి విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న టెస్లా అధినేత ఎలాన్ మస్క్ బ్రెజిల్ కోర్టు విధించిన జరిమానాను చెల్లించారు. అయితే X(ఎక్స్) పొరపాటుగా 5.2 మిలియన్ల (రూ.43 కోట్లు) డబ్బును తప్పుడు ఖాతాలోకి బదిలీ చేసింది. ఈవిషయాన్ని న్యాయమూర్తి మోరేస్ వెల్లడించారు. ''ఎక్స్ జరిమానా మొత్తాన్ని చెల్లించింది. అయితే కోర్టు ఆర్డర్‌పై ఉన్న ఖాతాకు కాకుండా మరొక ఖాతాకు డబ్బు చెల్లించింది. ఆ నిధులను వెంటనే కోర్టు ఖాతాలోకి మళ్లించమని అధికారులను ఆదేశించాం'' అని పేర్కొన్నారు. కాగా బ్రెజిల్‌లో ఎక్స్‌పై నిషేధం కొనసాగుతోంది. బ్రెజిల్‌లో తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్న పలు ఎక్స్ ఖాతాలను తొలగించాలని గతంలో అక్కడి సుప్రీంకోర్టు న్యాయమూర్తి అలెగ్జాండర్ డె మోరాసే ఆదేశించారు. దీంతో అక్కడ సామాజిక మాధ్యమం ఎక్స్ సేవలు నిలిచిపోయాయి. అక్కడి న్యాయస్థానం తీరుపై ఎక్స్ యజమాని ఎలాన్‌మస్క్ స్పందిస్తూ.. ''వాక్‌స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి పునాది. ప్రజామోదంతో ఎన్నిక కాని న్యాయమూర్తి.. ఈ పునాదిని రాజకీయ లబ్ధి కోసం నాశనం చేస్తున్నాడు'' అని పేర్కొన్నాడు. దుష్ప్రచారం నెపంతో ఖాతాలను బ్లాక్ చేసేందుకు ఆదేశిస్తున్నారని ఆరోపించారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని వ్యాఖ్యానించారు. ఆయన ప్రజాభీష్టాన్ని విస్మరిస్తున్నారన్నారు. దీనివల్ల బ్రెజిల్ నుంచి వస్తున్న ఆదాయం మొత్తం పోతుందని.. ఫలితంగా అక్కడ కార్యకలాపాలను మూసివేయాల్సి ఉంటుందన్నారు. అయినప్పటికీ తాము చింతించడం లేదని చెప్పారు. లాభాల కంటే తమకు సిద్ధాంతాలే ముఖ్యమని వ్యాఖ్యానించారు. దీంతో వారిరువురి మధ్య వాగ్వాదం చెలరేగింది. మస్క్ న్యాయమూర్తిని ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తీవ్రంగా పరిగణించిన న్యాయమూర్తి.. తప్పుడు సమాచార వ్యాప్తిపై జరుగుతున్న విచారణలో మస్క్‌ను కూడా చేర్చారు. కోర్టు కార్యకలాపాలకు అడ్డు తగులుతున్నారని.. తీర్పులకు వక్రభాష్యం చెబుతున్నారని పేర్కొన్నారు. అందుకు ఎక్స్‌ను ఆయుధంగా వాడుకుంటున్నారన్నారు. తద్వారా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న కొంతమంది వ్యక్తులకు ఆయన మద్దతుగా నిలుస్తున్నారని ఆరోపించారు. ఈనేపథ్యంలో కోర్టు ఆయనకు 5.2 మిలియన్ల(రూ.43 కోట్లు) జరిమానా విధించింది.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌తో అప్పులపాలు..

### రైతు కుటుంబం ఆత్మహత్య

**విశ్వంభర, నిజామాబాద్ :** ఆన్‌లైన్ బెట్టింగ్.. ఓ రైతు కుటుంబాన్ని నిండా ముంచింది. చివరకు పొలం అమ్ముకోవాల్సి వచ్చింది. అప్పులపాలై ఆ కుటుంబం ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాదకర ఘటన నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలో వెలుగు చూసింది.వివరాల్లోకి వెళ్తే.. బోధన్ నియోజకవర్గం ఎడపల్లి మండలం వడ్డేపల్లికి చెందిన హరీశ్.. రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి. అయితే ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడ్డ హరీశ్.. దాదాపు రూ. 20 లక్షలు పోగొట్టుకున్నాడు. దీంతో కుటుంబాన్ని పోషించేందుకు అప్పులు చేయాల్సి వచ్చింది. అప్పులు కూడా అధికం అవడంతో.. ఉన్న పొలాన్ని కూడా అమ్మేశాడు. అయినప్పటికీ ఆర్థిక ఇబ్బందులు హరీశ్‌ను వెంటాడుతూనే ఉన్నాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన హరీశ్.. తన తల్లిదండ్రులకు ఉరేసి తాను ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులను సురేశ్, హేమలతగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేప్టటారు.

## లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు..

### హమాస్ కీలక నేత మృతి

**హమాస్:** ఇజ్రాయెల్- హెజ్‌బొల్లాల మధ్య భీకర దాడులు కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలో ఇజ్రాయెల్ తాజాగా జరిపిన వైమానిక దాడుల్లో హమాస్‌కు చెందిన కీలక నేత, ఆయన కుటుంబసభ్యులు మృతి చెందినట్లు సమాచారం. ఉత్తర లెబనాన్‌లో ట్రిపోలిలోని పాలస్తీనా శరణార్థుల శిబిరంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో హమాస్‌కు చెందిన అల్ ఖసమ్ బ్రిగేడ్ సాయుధ విభాగంలో సభ్యుడైన సయీద్ అతల్లా మృతి చెందారు. ఈ దాడుల్లో అతల్లాతో పాటు ఆయన ముగ్గురు కుటుంబసభ్యులు సైతం మరణించినట్లు సమాచారం. ఈమేరకు హమాస్‌కు చెందిన పలు మీడియా వర్గాలు ఉటంకిస్తున్నాయి. మరోవైపు ఇజ్రాయెల్‌కు చెందిన పలు వార్తాసంస్థలు సైతం ఇదే విషయాన్ని ధృవీకరించాయి. హమాస్ మిలిటెంట్ గ్రూపుల్లోని మరో అగ్ర నాయకుడు మరణించారనేది అందులోని సారాంశం. ఇక, లెబనాన్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇప్పటివరకు 2 వేల మందికిపైగా మృతి చెందినట్లు పలు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. అందులో 250 మంది హెజ్‌బొల్లాకు చెందినవారు ఉండటం గమనార్హం. బీరుట్‌లోని ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో హెజ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా మరణించిన విషయం తెలిసిందే. దీంతో ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకారంగా 180 క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇజ్రాయెల్ సైతం పేర్కొంది.

# డ్రైనేజీ నిర్మాణం లేక రోడ్డుపై పారుతున్న మురుగునీరు

**విశ్వంభర, సూర్యాపేట:** మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో ఆంజనేయస్వామి గుడి వెనుక బజారులో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురికినీరు రోడ్లపై పారుతుంది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మురికినీరు రోడ్డుపైనే నిల్వ ఉండటంతో చుట్టూ పక్కన నివసిస్తున్న వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురికినీరు రోడ్డుపైనే నిలుస్తుండడంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలి అనారోగ్యాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం అయితే చాలు దోమలు స్వైర విహారం చేస్తున్నాయనీ పట్టించుకోని నాథుడే కరువయ్యాడని మండి పడ్డారు. మురుగునీరు పోవడానికి సరైన డ్రైనేజీ నిర్మాణం చేయకపోవడం వల్ల ఈ పరిస్థితి దాపురించిందని వాపోయారు అదే విధంగా రోడ్డు నిర్మాణం లేకపోవడంతో ఏక్కడ నీరు అక్కడ నిలిచిపోతుందని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ పై ఎన్నిసార్లు అధికారులకు తెలియజేసిన కనీసం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ, రోడ్డు నిర్మాణం చేపట్టి అంటూ వ్యాధుల బారి నుండి కాపాడలని కోరుతున్నారు. 0మున్సిపాలిటీ పన్ను , నల్ల బిల్లు కరెంట్ బిల్లు అన్ని కడుతున్న సరైన వసతులు మాత్రం కల్పించడం లేదని ఆరోపించారు. ఇకనైనా అధికార యంత్రాంగం చొరవ చూపి రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు



ప్రజలు గుమ్మడవెల్లి వెంకటేశ్వర్లు, తోట యాదయ్య, చింత కృష్ణయ్య, మూల రమేష్, బోయినపల్లి సోమేశ్వరం, వెన్న మాధవి, మూల ఉపేందర్, రమణ కోరారు.

## రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చు: డాక్టర్ ముస్తఫా

**విశ్వంబర, ఎల్బీనగర్:** రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడిన వారమవుతావని సెయింట్ వేవ్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ ముస్తఫా అన్నారు. శనివారము ఐ సి బి ఎం- స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎక్సలెంట్ కళాశాలలో సెన్వేవ్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా కళాశాల మోటివేటర్ సయ్యద్ హసన్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల కొంతమందిలో నీరసం, బక్కగా అవుతారని అపోహ ఉంటుందని, రక్తదానం చేయడం వల్ల ఎంతో ఆరోగ్యంగా ఉంటారని



తెలిపారు. నేటికీ బ్లడ్ బ్యాంకులలో రక్తం కొడతా తో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. తల సేమియా బాధితులకు నెలకు రెండు సార్లు రక్తము ట్రాన్స్లేషన్ చేయాల్సి వస్తుందని తద్వారా వారికి ఎంతో రక్తము ఉపయోగ పడుతుందన్నారు. సమస్త ప్రతి నిధి పివిజయ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## గడ్డం వెంకట స్వామికి ఘన నివాళి



**విశ్వంభర, మహబూబాబాద్:** గడ్డం వెంకట స్వామి (కాక) 95 వ జయంతి కార్యక్రమం శనివారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంటు సభ్యులు, కేంద్ర, రాష్ట్ర, మంత్రిగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, పెద, బడుగు బలహీనర్గాలు, అందరికీ సేవలందించారనీ తెలిపారు. ఈ జయంతి కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, డిసిఓ వెంకటేశ్వర్లు, డిడి గ్రౌండ్ వాటర్ సురేష్, డిహెచ్ఓ మరియన్న, డిఎఓ విజయ నిర్మల, కలెక్టరేట్ పర్యవేక్షకులు బాలకిషన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాతబస్తీలో ఘనంగా బతుకమ్మ




**విశ్వంభర, హైదరాబాద్:** పాతబస్తీ గౌలిపుర డివిజన్ హనుమాన్ నగర్‌లోని విజ్ఞాన్ మోడల్ హై స్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. విద్యార్థినిలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మను తీరొక్క పూలతో అలంకరించి దాండియా నృత్యలలో, ఆటపాటలతో బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఉపాధ్యాయ బృందం విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జల సంరక్షణ కోసం ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలి

### జలమండలి ప్రత్యేక అధికారి: డాక్టర్ జాల సత్యనారాయణ

**విశ్వంభర, ఎల్బీనగర్:** జలమండలి డివిజన్ 10 బి పరిధిలోని వనస్థలిపురం రైతు బజార్ వద్ద గల జలమండలి కార్యాలయం వద్ద ఇంకుడు గుంతల ప్రత్యేక అధికారి డాక్టర్ జాల సత్యనారాయణ, డిజిఎం రాజగోపాల్, మేనేజర్స్ శ్రీవాహిని, శ్రీనివాస్‌లు జెండా ఊపి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా అవసరాల దృష్ట్యా నానాటికి జలవినియోగం పెరిగిపోతుంది గతంలో 200 ఫీట్లలో నీరు వస్తే నేడు 2000 ఫీట్ల వరకు వెళ్లిన నీరు దొరకని పరిస్థితులు ఉంటున్నాయి. భూగర్భ జలాలను పెంచుకోకపోతే భవిష్యత్ తరాల బ్రతుకులు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది కావున ప్రతి వర్షపు నీటి బొట్టును వృధా పోనీయకుండా ఒడిసి పట్టుకొని భూగర్భ జలాల పెంపు కోసం ప్రతి ఒక్కరు ప్రతి ఇంటి యజమాని తమ ఇంటిపై పడే వర్షపు నీటిని తమ ఇంటి ఆవరణలోనే భూమిలోకి ఇంకించే ప్రయత్నం చేయాలి. అందుకోసం కావాల్సిన సలహాలు సూచనలు అందించడానికి జలమండలి అధికారుల తో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అందుబాటులో ఉంటారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి అని కోరారు. జల సంరక్షణ కోసం ఒక ఉద్యమంలో ప్రతి ఒక్కరు కృషి చేయాల్సి ఉంటుందని తెలియజేశారు. ఈ డివిజన్లో ప్రచార రథం మూడు రోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. మంగళవారం డివిజన్ 10 ఎ సాహెబ్



నగర్ పరిధిలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రతి డివిజన్లో మూడు రోజుల చొప్పున మూడు నెలల పాటు ప్రచార రథం అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గాంధీ సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ టి సురేందర్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ప్రోగ్రామ్ ఇన్చార్జ్ డాక్టర్ గిరిధర్ పొట్లపల్లి, మమత ఎడ్యుకేషనల్ సొసైటీ సీఈవో కే సుభాష్ చంద్ర,, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ఇంచార్జ్ సతీష్, శ్రీకాంత్, ఫిరోజ్ ఖాన్, సాకేత్, జలమండలి సిబ్బంది వేణుగోపాల్ రెడ్డి, చంద్రశేఖర్, ఉపేందర్ రెడ్డి, రాజేష్, యాదిరెడ్డి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



**విశ్వంభర, ఎల్బీనగర్:** కొత్తపేటలోని శ్రీరామ్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ దాచేపల్లి రమేష్ తెలిపారు. ఈ తెలంగాణలో ఆడపడుచులు బతుకమ్మ పండుగను ఎంతో వైభవంగా నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులకు సాంప్రదాయాలను తెలియజేసే విధంగా కళాశాలలో ప్రతి పండుగను ఎంతో ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో, బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ విద్యార్థులు అందరూ కలిసి ఎంతో ఆనందంగా బతుకమ్మ పండుగను నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్యామల, సిబ్బంది నాగమణి, నాగలత, రామసుధ, రామశేషు, శ్రీదేవి, లలిత శ్వేతనవనీత రామేశ్వర్‌రెడ్డి రవీంద్రంనాగేశ్వరరావు వెంకన్న పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలి



**విశ్వంభర, అంబర్‌పేట్:** డిడి కాలనీలో బిజెపి ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథులుగా హాజరై క్యాంపును బిజెపి సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్ రావు, బిజెపి ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కళ్యాణ్ నాయక్ ప్రారంభించారు. శనివారం అంబర్పేట్ నియోజకవర్గం డిడి కాలనీలోని ఉస్మానియా యూనివర్సిటీ NCC గేట్ వద్ద బిజెపి ఎస్టి మోర్చా ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో కాలనీవాసులు, వాకర్స్, బిజెపి కార్యకర్తల సభ్యత్వం నమోదు చేసారు. బిజెపి నేతలు గోవర్ధన్ రెడ్డి, భాస్కర్ రాంరెడ్డి ఎస్టీ మోర్చా అధికార ప్రతినిధి బానోత్ అనూష, క్యాంపు నిర్వాహకులు, బిజెపి ఎస్టీ మోర్చా ఆఫీస్ జాయింట్ సెక్రటరీ రూపావత్ మహేష్ పాల్గొన్నారు.

## దుర్గమాత పూజలో పాపిశెట్టి దంపతులు



**విశ్వంభర, ఆమనగల్లు:** దేవి శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని సుర సముద్రం చెరువు కట్టపై వెలసిన కట్ట మైసమ్మ ఆలయంలో అమ్మవారు లలిత త్రిపుర సుందరి దేవి అవతారంలో దర్శనమిచ్చారు. ప్రముఖ సంఘ సేవకులు మెడికల్ అసోసియేషన్ పాపిశెట్టి శ్వేత రాము దంపతులు, కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీంర్థప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారు. పాపిశెట్టి కౌసల్య కుమారస్వామి, పాపిశెట్టి కళ్యాణి, అరవింద్ దంపతులు కట్ట మైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు ముక్తాల వెంకటయ్య, ఎర్రవోలు మహేష్, గంజి వెంకటేష్, చెన్నంశెట్టి మల్లేష్, శ్రీకాంత్, కొప్పు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

### కార్పోరేటర్ రాధా ధీరజ్ రెడ్డి

**విశ్వంభర, ఎల్బీనగర్:** సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని ఆర్కే పురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి అన్నారు. కొత్తపేటలోని శివాని మహిళా కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథులుగా కార్పోరేటర్ రాధా ధీరజ్ రెడ్డి, కళాశాల చైర్మన్ డాక్టర్ పి. రామ్ రెడ్డి, సెక్రటరీ, కరస్పాండెంట్ వేధిరె సుదర్శన్ రెడ్డిలు హాజరయ్యారు.



రాధా ధీరజ్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిలోని పూలను దైవంగా కొలిచి బతుకమ్మ పండుగను జరుపుకోవడం తెలంగాణలో తప్ప ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. విద్యార్థులకు చదువు మానసిక ఉల్లాసంతో పాటు తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలను విద్యార్థులకు తెలియ జేయాలని ఉద్దేశంతో కళాశాల యాజమాన్య నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొని నృత్య ప్రదర్శనలతో అలరించారు. ప్రిన్సిపాల్ అనిత, డైరెక్టర్ ప్రేమ్ నాథ్ రెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## దసరాకు ఊరు వెళ్తున్నారా.. జాగ్రత్త: ఇన్స్పెక్టర్ సైదిరెడ్డి

**విశ్వంభర,ఎల్బీనగర్:** దసరా పండుగకు ఊరు వెళ్తున్నారా.. అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్త పడాలని సరూర్ నగర్ ఇన్స్పెక్టర్ సైది రెడ్డి అన్నారు. శనివారము సరూర్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పి అండ్ టి కాలనీ, ఇతర కాలనీలలో ఆటో పెట్రోలింగ్ ద్వారా అవగాహన కల్పిస్తూ పాంప్లెట్స్ ఆవిష్కరించారు.



అనంతరం ఇన్స్పెక్టర్ సైదిరెడ్డి మాట్లాడుతూ దసరాకు సొంత గ్రామాలకు బంధువులు స్నేహితులు ఇండ్లకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. దసరా పండుగను అదునుగా భావించి దొంగలు రెచ్చిపోయి తాళం వేసిన ఇండ్లనే లక్ష్యంగా పెట్టుకొని చోరీలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయని అన్నారు. తప్పనిసరిగా సీసీ కెమెరాలు పని చేస్తున్నాయో లేవో చూసుకోవాలని అన్నారు. ఊరికి వెళ్లే సమయంలో విలువైన వస్తువులు బంగారు నగలు ఇంట్లో ఉంచకుండా బ్యాంకులో గాని లాకర్లో గాని భద్రత ఉన్నచోట దాచుకోవాలని సూచించారు. కాలనీలలో అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే 100 నెంబర్ కు గాని స్థానిక పోలీసులకు గాని సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సీసీ కెమెరాలను తప్పనిసరిగా మార్చుకోవాలని ఆ స్తోమత లేని వారు కాలనీ కమిటీల ద్వారా కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ఎక్కడికి వెళ్లినా సెల్ ఫోన్ల ద్వారా ఎప్పటికప్పుడు గమనించుకోవచ్చని అన్నారు. ప్రజలందరూ పోలీసులు ఇచ్చే సలహాలు సూచనలు పాటించి ఏమాత్రం నష్టపోకుండా పండుగను ఉత్సా హంగా సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. ఎస్సైలు మారయ్యగౌడ్, కిషన్‌సిబ్బంది పాల్గొన్నారు.

## హైదరాబాద్ బుక్ ఫెయిర్ 2024 గౌరవ సలహాదారుల ఎన్నిక

**విశ్వంభర, హైదరాబాద్:** 37వ హైదరాబాద్ బుక్ఫెయిర్ గౌరవ సలహాదారులుగా ప్రముఖ సాహితీవేత్త రామచంద్రమూర్తి, ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాంను శనివారం బుక్ ఫెయిర్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. బుక్ ఫెయిర్ జనరల్ బాడీ సమావేశం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో షోయాబ్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా గౌరవ సలహాదారు



లను కమిటీ ఎన్నుకుంది. దీంతో పాటు బుక్ ఫెయిర్ కొత్త నిబంధనలను కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించింది. బుక్ఫెయిర్ నిర్వహన డిసెంబర్ చివరి వారా ల్లో నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. త్వరలోనే తేదీలను, స్టాళ్ల నిర్వహణనకు అప్లికేషన్ల ప్రకటన ఉంటుంది. రామ చంద్రమూర్తిని మర్యాద పూర్వకంగా కమిటీ సభ్యులు సన్మా నించారు. బుక్ ఫెయిర్ ప్రెసిడెంట్ కవి యాకూబ్, జనరల్ సెక్రటరీ ఆర్ వాసు, వైస్ ప్రెసిడెంట్ బాల్ రెడ్డి, శోభన్ బాబు, ట్రెజరర్ నారాయణ రెడ్డి, జాయింట్ సెక్రటరీ సూరి బాబు, సురేశ్ బాబు, ఎమెస్కో అధినేత విజయ్ కుమార్, వీక్షణం ఎడిటర్ఎన్ వేణుగోపాల్ తోపాటు తెలుగు పబ్లిషర్లు పాల్గొన్నారు.

## డయాగ్నస్టిక్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

విశ్వంభర,మహబూబాబాద్: మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో డాక్టర్ ముల్లంగి జ్యోతి రెడ్డి, అన్వేష్ రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య డయాగ్నస్టిక్ సెంటర్‌ను శనివారం స్థానిక శాసనసభ్యులు డాక్టర్ భూక్యా మురళి నాయక్, డీసీసీ అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి కలిసి ప్రారంభించారు. ముల్లంగి జ్యోతి రెడ్డి, అవినాష్ రెడ్డి లు ప్రజలకు ఇబ్బంది లేకుండా, దూర ప్రాంతాలకు వెళ్లకుండా మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో 24 గంటల సౌకర్యం కల్పిస్తూ డయాగ్నస్టిక్ సెంటర్ ను ఏర్పటు చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. అన్ని రకాల మెడికల్ టెస్టులు చేసే విధంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య



డయాగ్నస్టిక్ సెంటర్‌ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా, పలు వార్డుల నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## డబల్ బెడ్ రూం ఇండ్ల వద్ద పనుల పరిశీలన



**విశ్వంభర, కల్వకుర్తి:** గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్‌ల పనులను అసంపూర్తిగా వదిలేసిందని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీమ్ముల శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి చొరవతో అసంపూర్తిగా ఉన్న పనులకు నిధులు కేటాయించారని అన్నారు. శనివారం కల్వకుర్తిలో ఉన్న డబల్ బెడ్ రూమ్ వద్ద జరుగుతున్న పనులనుపరిశీలించారు. శానవాజ్ ఖాన్, మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, నానియాదవ్, జమ్ముల శ్రీకాంత్ పాల్గొన్నారు.

## అసంపూర్తి రోడ్డు పనులను వారంలో పూర్తి చేస్తాం



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండల కేంద్రం నుండి మిడ్జిలు వెళ్లే రహదారిలో అసంపూర్తిగా ఉన్న వంతెనల వద్ద మిగిలిపోయిన పనులను శనివారం స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక నాయకులతో కలిసి ఆర్ అండ్ బి అధికారి ఏఈ రవితేజ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏ ఈ మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న రోడ్డు బ్రిడ్జి పనులను ఈ వారం రోజులలో పూర్తి చేస్తామని తెలిపారు .ఈ కార్యక్రమంలో వెల్జల్ మాజీ ఎంపీటీసీ మల్లెకిడి అంబాజీ, వెల్జాల్ మాజీ ఉపసర్పంచ్లు, బి నర్సింహులు, ఎంఎ అజీజ్, డిసిసి కార్యదర్శి రవీందర్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు డిగ్రీ కృష్ణ, తలకొండపల్లి కాంగ్రెస్ నాయకులు తుమ్మ నరసింహులు, రవి, తదితరులు పాల్గొన్నారు.

# అక్రిడేషన్‌కి జర్నలిజానికి సంబంధం లేదు

**అక్రిడేషన్ ఉంటేనే జర్నలిస్టులు కాదు**

**సమాచార సేకరణలో జర్నలిస్టులపై ఎలాంటి వివక్ష చూపరాదు**

**డీజేఎఫ్ కాశమొల్ల విజయ్ కుమార్**

**విశ్వంభర, సంగారెడ్డి:** అక్రిడేషన్ ఉంటేనే జర్నలిస్టులని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అక్రిడేషన్‌కి జర్నలిజానికి సంబంధం లేదని డీజేఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్ అన్నారు. కొన్ని ప్రాంతాల్లో కొందరు దళారి జర్నలిస్టులు అక్రిడేషన్ ఉన్న జర్నలిస్టులకు మాత్రమే ప్రభుత్వం సమాచారం అందించాలని అధికారులకు, నాయకులకు వినతి పత్రాలు అందిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. డీజేఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అక్రిడేషన్ అనేది ప్రభుత్వం ఇచ్చే రాయితీ కార్డు మాత్రమేనని, జర్నలిస్టులను గుర్తించే పట్టాకానే కాదని గుర్తించుకోవాలన్నారు. అక్రిడేషన్ ఉంటేనే జర్నలిస్టు అని ఎవరైనా అంటే అంతకన్నా అవివేకం మరొకటి లేదని, కొందరు చేస్తున్న ప్రచారాన్ని నమ్మి ఎవరైనా అధికారులు పాత్రికేయులకు సమాచారం ఇవ్వడంలో వివక్షత చూపరాదన్నారు. అక్రిడేషన్ పేరుతో సమాచారం అందించే విషయంలో జర్నలిస్టులపై వివక్షత చూపించే అధికారులు న్యాయస్థానాల మెట్లు ఎక్కాల్సి ఉంటుందని వివక్షత చూపే అధికారులు, నేతలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాసమ్యలను వెలుగులోకి తీసుకొచ్చే వారంతా పాత్రికేయులేనన్నారు. జర్నలిస్టులకు గుర్తింపు వారు రాసే వార్తలతో పాటు వారి నిజాయితీ మాత్రమే గుర్తింపని ఈ విషయాన్ని




అధికారులు, నేతలు గుర్తించాలన్నారు. చాలా ప్రాంతాల్లో అక్రిడే షన్ నాన్ జర్నలిస్టుల చేతిలో ఉన్న విషయాన్ని మరవరాదన్నారు. ఎవరైనా ఎక్కడ్కైనా అక్రిడేషన్ పేరుతో సమాచారం అందించే విషయంలో వివక్షత చూపితే తమ దృష్టికి తీసుక రావాలని అలాంటి వారి విషయాన్ని న్యాయ స్థానాల్లో తేలుస్తామని డెమొ క్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు మాన సాని కృష్ణారెడ్డి పిలుపు నిచ్చారని డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్ అన్నారు.

## దాండియా నృత్యాలు, పాటలతో బతుకమ్మ సంబరాలు



**విశ్వంభర,హైదరాబాద్:** హైదరాబాద్ పాతబస్తీ గౌలిపుర డివిజన్ హనుమాన్ నగర్ విజ్ఞాన్ మోడల్ హై స్కూల్‌లో బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినిలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మను తీరొక్క పూలతో అలంకరించారు. విద్యార్థినిలు అలంకరించిన బతుకమ్మను పాఠశాల ఆవరణలో ఉంచి దాండియా నృత్యాలు, పాటలతో బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉపాధ్యాయులు ఇన్‌చార్జి స్వప్న, కల్పన,శివలీల,సరళ,వనిత,మమత, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బతుకమ్మ సంబరాలు




**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మాధవరావు, ఆమనగల్లు సంఘ సేవకులు సాయిరాం మెడికల్ పాపిశెట్టి రాము దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించి బతుకమ్మ ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు కలిసి బతుకమ్మ పాటలు, నృత్యాల మధ్య సుర సముద్రం చెరువులో నిమజ్జనం చేశారు. అధ్యాపకులు కృష్ణయ్య, వెంకటయ్య, జైపాల్, పర్వతాలు, లక్ష్మన్న, విష్ణు, రవి అలివేలు,నాగమణి,సంతోష్ కుమార్, బోధ నేతర సిబ్బంది శేఖర్, కిరణ్, రాజు, వేణు, సుశీలమ్మ, పాల్గొన్నారు.

## కన్యకాపరమేశ్వరి దేవాలయంలో పూజలు



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు భక్తులకు 'అన్నపూర్ణ దేవి' అవతారంలో దర్శనమిచ్చారు. మూడవ రోజు శనివారం జరిగిన కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి పాల్గొన్నారు. ఆయన శరనవరాత్రి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, దేవస్థానం అధ్యక్షులు వీర బొమ్మ రామ్మోహన్, కమిటీ సభ్యులు బికుమాండ్ల నరసింహ, సామల కృష్ణయ్య, కర్నాటి కృష్ణయ్య, కండె సుమన్, నటరాజ్ ప్రవీణ్, జూలూరి నరసింహ, అర్థంఅశోక్,ఆనంద్ పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చిన మున్సిపల్ చైర్‌పర్సన్



**విశ్వంభర, కొత్తూరు:** అడిగిన వెంటనే ప్రజల దాహార్తిని తీర్చారు మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్. కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరిగూడెంలో గత కొంతకాలంగా ప్రజలు తాగునీటి సమస్యతో బాధపడుతున్నారు. సీసీ రోడ్ తవ్వకాల్లో మిషన్ భగీరథ పైప్ లైన్ పాడవడంతో తీవ్రమైన తాగునీటి సమస్యతో అల్లాడుతున్నారు. ఈ విషయాన్ని కుమ్మరిగూడ ప్రజలు మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన దేవేందర్ యాదవ్ కుమ్మరిగూడెంకు కొత్తగా బోరు వేయించారు. బోరు బావిలో నీరు పుష్కలంగా రావడంతో బోరు మోటర్ బిగించి ప్రజల దాహార్తి తీర్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్స్ పీర్ల గూడెం మాధవి గోపాల్ గౌడ్, సోమ్లా నాయక్, బ్యాగరీ ప్రసన్న లత యాదయ్య, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

## ఘనంగా ఆంజనేయ స్వామి పల్లకీ సేవ



**విశ్వంభర, రంగారెడ్డి:** జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మ గుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ ఆట పాటలు, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలు, భజనలతో ఆలయంలో శ్రీరామ నామస్మరణ మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్ర చార్య, అర్చకులు కృష్ణ, ప్రమోద్, సునీల్ పంతులు భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పులిమామిడి శ్రీశైలం గౌడ్, వసంతరావు, అన్నారం రఘు గౌడ్, గడ్డమీద రమేష్ ముదిరాజ్, చెట్ల వెంకటేష్, రఘునందన్ రెడ్డి, క్యాసెట్ శ్రీనివాస్, కిషన్ నాయక్, రాఘవేందర్, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, లక్ష్మీకాంత్ రెడ్డి, కృష్ణ చారి, శంకరయ్య యాదవ్, వీఆర్వో బచ్చన్న, యాదగిరి, పి.ప్రవీణ్ గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

## జర్మనీ, ఫ్రాన్స్ ఎడ్యుకేషనల్ ఫెయిర్




**విశ్వంభర,హైద్రాబాద్:** ఓరియంట్ స్పెక్ట్రా హయత్ ప్లేస్ బంజారాహిల్స్‌లో జర్మనీ, ఫ్రాన్స్ ఎడ్యుకేషనల్ ఫెయిర్‌ను నిర్వహించారు. మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మేళాకు 12 మంది యూనివర్సిటీ ప్రతినిధులు హాజరయ్యారు. అనేక ఫీజు రాయితీలతో, ఫెయిర్‌కు హాజరైన చాలా మంది విద్యార్థులకు TOEFL పరీక్ష తగ్గింపు ఇవ్వబడింది. చాలా మంది విద్యార్థులు ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్ లో పాల్గొన్నారు. విదేశాల్లో చదువుకోవడానికి చాలా ఉపయోగకరంగా వుందని విద్యార్థులు అన్నారు.

# జేబి గ్రూప్ పేరిట రియల్ ఎస్టేట్ మోసాలు

■ అక్రమాలపై అప్రమత్తంగా ఉండాలని జె.బి ఇన్‌ఫ్రా గ్రూప్ సూచన ■ హయత్ నగర్ పోలీసులకు ఫిర్యాదు



**విశ్వంభర, హైదరాబాద్:** రియల్ ఎస్టేట్ రంగంలో 23 ఏళ్ల సుదీర్ఘ అనుభవంతో కొనుగోలుదారుల విశ్వసనీయత, నమ్మకమే పెట్టుబడిగా మార్కెట్లో తమకంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నామని జేబీ ఇన్ఫ్రా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. అయితే తమకున్న బ్రాండ్ వాల్యూను దుర్వినియోగం చేస్తూ, జేబి గ్రూప్ పేరిట కొన్ని మోసపూరిత కంపెనీలు చెలామణి అవుతున్నట్లుగా, అక్రమాలకు పాల్పడుతున్న నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని వివరించారు. పెద్ద అంబర్ పేట్ లో జేబీ గ్రూప్ బ్రాంచ్ ఆఫీసులోనిర్వహించిన మీడియా సమావేశంలో మేనేజింగ్ పార్టనర్ సిద్ధార్థ రెడ్డి, సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్లతో కలిసి మీడియాకు వివరించారు. వాస్తవాలను తెలుసుకొని కొనుగోళ్ళు చేయాలని సూచించారు. జేబీ గ్రూప్ బ్రాండ్ పేరిట జరుగుతున్న మోసాలకు తమకు ఎలాంటి సంబంధం లేదని అనిల్ స్పష్టం చేశారు. ఇప్పటికే కొందరు కొనుగోలుదారులు నష్టపోయినట్లుగా తమ దృష్టికి వచ్చింద న్నారు. మార్కెట్లో జరుగుతున్న మోసాలకు తమ గ్రూప్నకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. మొదటి నుంచీ ఈ కంపెనీలో నలుగురు మాత్రమే మేనేజింగ్ పార్టనర్లు ఉన్నారని, హైదరాబాద్ కేంద్రంగా నాలుగు కార్యాలయాలు పనిచేస్తున్నట్లుగా పేర్కొన్నారు. మార్కెట్‌లో తమ బ్రాండ్ పేరిట జరుగుతున్న మోసాలపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, తమ బ్రాండ్ విలువకు తగ్గించేలా జరుగుతున్న మోసాలపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## పది రూపాయలకే భోజనం

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**విశ్వంభర, షాద్‌నగర్:** షాద్‌నగర్ పట్టణంలోని విజయనగర్ కాలనీలో ఉపాధ్యాయ సేవా వారధి సంస్థ ఆధ్వర్యంలో అన్నపూర్ణాలయంలో 10 రూపాయలకే భోజనాన్ని అందజేయడం గొప్ప విషయమని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థులకు సేవ చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి సహాపడ్డ ఉపాధ్యాయులు రిటైర్మెంట్ తర్వాత నిస్వార్థంగా విశ్రాంత జీవితాన్ని సేవా కార్యక్రమానికి వినియోగించడం గొప్ప విషయం అని ఎమ్మెల్యే అన్నారు. పూర్వపు ఉపాధ్యాయులైన నందిగామ సురేష్, ఆశంబాబు, బుచ్చయ్య, క్రాంతి కుమార్, తిరుపతయ్య, పాతూరు బ్రహ్మయ్యల నేతృత్వంలో సమయానికి భోజనం అందక ఇబ్బంది పడుతున్న పేదవారికి అన్నపూర్ణాలయం ద్వారా తక్కువ డబ్బులకే భోజనం అందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. అన్నదానం చేయటం తనకెంతో ఇష్టమైన కార్యక్రమం అని నామమాత్రపు రుసుము ద్వారా నిత్యాన్నదాన చేస్తున్న ఇట్టి కార్యక్రమానికి ఎల్లప్పుడూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే తన వంతు సహాయంగా వంట మనుషులు చందన, మేఘన లకు చెరో 5,000 రూపాయల చొప్పున ఆర్థిక సహాయంగా అందించారు. ఉపాధ్యా వారధి సంస్థ ద్వారా నిర్విఘ్నంగా పేదవారికి భోజనం అందించేందుకు తనవంతు సహాయంగా సంవత్సరానికి లక్ష రూపాయల వరకు ఆర్థిక సహాయ చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణ ప్రముఖులు బద్య, తిరుపతయ్య, రమేష్, వెంకటయ్య, మామిడి శ్యాం సుందర్ రెడ్డి, అగ్గునూర్ విశ్వం, కొం కళ్ల చెన్నయ్య, చెంది తిరుపతి రెడ్డి, వెంకట్రాంరెడ్డి, విజయకుమార్ రెడ్డి, సర్వర్ పాషా, అందే మోహన్, పులిమామిడి రాజేష్, దంగు శ్రీను, పూజారి మల్లేష్, దండు శరత్ బాబు, హాజరయ్యారు.

## ఐబీఓసీ కార్యాలయంలో కాకా జయంతి వేడుకలు

**విశ్వంభర, భూపాలపల్లి:** వెంకటస్వామి నిస్వార్థంగా ప్రజా సేవకు అంకితమై తన రాజకీయ జీవితంలో ఎంతో మందికి ఆదర్శప్రాయంగా నిలిచారని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. శనివారం ఐబీఓసీ కార్యాలయంలో వెంకటస్వామి జయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వెంకటస్వామి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. స్వర్గీయ జి వెంకటస్వామి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారకంగా నిర్వహించుటకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. వెంకటస్వామి సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను నేటి తరాలకు మార్గదర్శమని తెలిపారు. స్వర్గీయ జి.వెంకటస్వామి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో వివిధ శాఖల మంత్రిగా పని చేశారని, ప్రజలకు విశేష సేవలు అందించారని ఆయన త్యాగం, అంకితభావం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఉద్యానవన శాఖ అధికారి సంజీవ రావు, సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య, పశు సంవర్ధక శాఖ డాకుమారస్వామి, వ్యవసాయ అధికారి విజయభాస్కర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కుసుమ కుమారి, కలెక్టరేట్ ఏఓ ఖాజా జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలంలోని గానుగుమర్ల తండా గ్రామ పంచాయతీకి చెందిన ఇస్లావత్ మోతి అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ గానుగు మర్ల తండా కు వెళ్లి మోతీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మోతి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తదుపరి మోతి కుటుంబ సభ్యులకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 5,000 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. మాజీ ఉప సర్పంచ్ శారద పాండు, మాజీ వార్డు సభ్యులు శ్రీను, భీమన్, చందు, సూర్య కిషన్, పాల్గొన్నారు.

## విస్తృతంగా బీజేపీ సభ్యత్వ నమోదు



**విశ్వంభర, రామన్న పేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, ఇంద్ర పాల నగరం గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షులు పల్లపు దుర్గయ్య ఆధ్వర్యంలో విస్తృతంగా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. జనతా పార్టీ మండల కమిటీ సభ్యులు ప్రజలకు నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తున్న సభ్యత్వాల నమోదును చేపట్టారు.

### తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం సంఘం

## ఉమ్మడి జిల్లాల అధ్యక్షుల నియామకం



**విశ్వంభర, తార్నాక:** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం సంఘం కమిటీ సమావేశం శనివారం ఉస్మానియ యూనివర్సిటిలోని ఆర్ట్స్ కాలేజి వద్ద నిర్వహించారు. ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం సంఘం ఉమ్మడి జిల్లాల కమిటీ అధ్యక్షులను నియమించారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా బాబా పసియుద్దీన్, అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, మెదక్ జిల్లా అధ్యక్షుడు డా. ప్రదీప్‌కుమార్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు డా. రాజు, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పీ సంతోష్, నల్గొండ జిల్లా అధ్యక్షుడు మిర్యాల సైదులు, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు పల్లాటి సురేందర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నర్సింహాగౌడ్, నిజాంబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశ నారాయణ, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా బాలరాజ్ నాయక్‌లను నియమించారు.

## గ్రామపంచాయతీని తనిఖీ చేసిన డి.ఎల్.పి.ఓ



**విశ్వంభర, త్రిపురారం:** నల్గొండ జిల్లా త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామపంచాయతీని డి.ఎల్.పి.ఓ తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వకపోవడం, నిధుల దుర్వినియోగంపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు మిర్యాలగూడ డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవ రావు పెద్ద దేవులపల్లి గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. త్వరలో గ్రామపంచాయతీ సిబ్బందికి జీతాలు ఇప్పిస్తామని తెలిపారు. అలాగే నిధుల దుర్వినియోగం పై పూర్తి నివేదిక తయారు చేసి జిల్లా పై అధికారులకు పంపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టైపిస్ట్ గులాం అలీ, పంచాయతీ కార్యదర్శి జాఫర్, ఠాకూర్ రమేష్ సింగ్, అంబటి వేణు, సింగం సతీష్, యానక బాలకృష్ణ, మల్లయ్య మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ సిబ్బందికి దసరా కానుక

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం తిరుమలాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ సిబ్బందికి దసరా పండుగ సందర్భంగా బట్టలు పంపిణీ చేసారు. దాత కొత్తపల్లి రాము సహకారంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బట్టలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు గజ్జి రవి, మండల యూత్ ప్రధాన కార్యదర్శి గోపగని శివకృష్ణ, గ్రామ ప్రధాన కార్యదర్శి గోల్కొండ మహేష్, గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలగొండ చిరంజీవి, యూత్ అధ్యక్షులు ప్రవీణ్, కొర్రి రాజు, గోపగాని చిన్న వెంకటేశ్వర్లు, నీరటి నారాయణ, మెస్సయ్యా, రవి, శ్రీకాంత్, గోల్కొండ పైడి, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం ఆర్కపల్లి గ్రామంలో పదిహేను సంవత్సరాలుగా మండపాన్ని ఏర్పాటు చేసి దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఈ సంవత్సరం కూడా నిర్వాహకులు శోభాయమానంగా మండపాన్ని ఏర్పాటు చేసి అమ్మవారికి అంగరంగ వైభవంగా పూజలు చేస్తున్నారు. ఈ సందర్భంగా దుర్గామాత మాల ధారణ చేసిన యువత తొమ్మిది రోజులు నిష్టంగా ఉంటూ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం నవరాత్రుల్లో మూడవ రోజు అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో గ్రామప్రజలు భక్తులు పాల్గొన్నారు.
– విశ్వంభర, మాడ్గుల



## ఒకే రాత్రి ముగ్గురు మహిళలకు సాధారణ కాన్పులు చేసిన 108 సిబ్బంది



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన 108 సిబ్బంది ఒకే రాత్రిలో ముగ్గురు గర్భిణీ మహిళలకు అంబులెన్స్ లోనే సాధారణ కాన్పులు చేశారు. ఆమనగల్లు మండలానికి చెందిన ప్రేమలత, దివ్య కర్తాల్ మండలానికి చెందిన అఖిల పురిటి నొప్పులతో బాధపడుతూ 108 నంబర్‌కు డయల్ చేయడంతో సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే నొప్పులు రావడంతో ముగ్గురికి 108 ఆసుపత్రి సిబ్బంది సాధారణ కాన్పులు చేశారని ప్రభుత్వ ఆసుపత్రి వర్గాల వివరించారు. అఖిల, దివ్య మగ బిడ్డలను ప్రసవించగా ప్రేమలత ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లులు బిడ్డలు క్షేమంగా ఉన్నారని ప్రభుత్వ ఆసుపత్రులలో చేర్చి చికిత్సఅందిస్తున్నామనీ తెలిపారు. సమయానికి స్పందించి సహాయం అందించిన 108 సిబ్బంది రమేష్, చంద్రశేఖర్‌కి వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## 17వ డివిజన్‌లో నీట మునిగిన ప్రాంతాలు

### పర్యటించిన కార్పొరేటర్ పోగుల నరసింహారెడ్డి



**విశ్వంభర, బోడుప్పల్:** మున్సిపల్ కార్పొరేషన్ 17వ డివిజన్ కార్పొరేటర్ మరియు బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నరసింహారెడ్డి తన డివిజన్లోని రామ్ రెడ్డి కాలనీ, మారుతి నగర్ కాలనీ, వినాయక నగర్ కాలనీ, మణికంఠ నగర్ కాలనీ, విజయపురి కాలనీలో కలియతిరిగారు. నిన్న రాత్రి కురిసిన భారీ వర్షానికి కాలనీలు నీట మునిగి, డ్రైనేజీలు ఉప్పొంగాయి. కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించడానికి నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించారు. కాలనీవాసులు వర్షపు నీటి వలన పడుతున్న ఇబ్బందులను గమనించి త్వరలోనే పరిష్కరిస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరుస్తామని, రోడ్డు వ్యవస్థ పై దృష్టి సారించి మరలా ఇలాంటి ఇబ్బందులు జరగకుండా, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్య పరిష్కారానికై కృషి చేస్తామని తెలిపారు. కాలనీ వాసులు కార్పొరేటర్‌తో కలిసి కలియ తిరుగుతూ వారి సమస్యలను వివరించారు.

## దేవీ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**విశ్వంభర, నందిగామ:** దుర్గమాత నవరాత్రి వేడుకల్లో భాగంగా మూడవ రోజు శ్రీ అన్నపూర్ణ దేవి అవతారంలో పూజలు అందుకుంటున్న దుర్గాదేవి అమ్మవారికి షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం పరిధిలోనీ గాంధీ సెంటర్లో శివాజీ యూత్ ఆధ్వర్యంలో మూడవ రోజు పూజా కార్యక్రమాలు జరిగాయి. షాద్ నగర్ పట్టణానికి చెందిన రవికుమార్ పంతులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింలు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జిల్లెల్ల రామ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు జాకీర్, ధార యాదయ్య, రవి కుమార్ గౌడ్, బోర్ర రమేష్, శివాజీ యూత్ పాల్గొన్నారు.

## శ్రీ దుర్గామాత ఆలయ నిర్మాణానికి భూమి పూజ

### హాజరైన ఎమ్మెల్యే, సింగరేణి అధికారులు



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మైన్స్ రెస్క్యూ స్టేషన్ ఆవరణలో శ్రీ దుర్గామాత ఆలయ నిర్మాణానికి శనివారం భూమి పూజ జరిగింది. దుర్గామాత ఆలయ నిర్మాణ కమిటీ మైన్స్ రెస్క్యూ స్టేషన్ ఇంచార్జి రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సింగరేణి జీఎం హబీబ్ హుస్సేన్, రెస్క్యూ జీఎం శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఓటు జీఎం కవీంద్ర లు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానికంగా ఏర్పాటు చేసిన దుర్గామాతకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ కనకదుర్గ ఆలయ నిర్మాణం చేపట్టడం హర్షనీయమన్నారు. ఆలయ నిర్మాణం పూర్తయ్యే వరకు అందరి సహకారం అందించాలని కోరారు. ఆలయ నిర్మాణానికి తన వంతుగా సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దసరా నవరాత్రుల సమయంలో కనకదుర్గ ఆలయ నిర్మాణం చేపట్టడం చాలా మంచి విషయం అని, ఇందులో పాల్గొనడం తన అదృష్టమని ఎమ్మెల్యే చెప్పారు. అనంతరం మహా అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

## ప్రజల వద్దకు న్యాయ సేవను తీసుకెళ్లాలి

**విశ్వంభర, భూపాలపల్లి:** పారా లీగల్ వాలంటీర్లు తమ పరిమితులకు లోబడి న్యాయ సేవను ప్రజల గుమ్మం వద్దకు తీసుకెళ్లాలని భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి. నారాయణ బాబు అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం పారా లీగల్ వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రజలకు న్యాయ సేవను అందించాలనే ఉద్దేశంతో పారా లీగల్ వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు ఉచిత, సమాన, సత్వర న్యాయం అందించడంలో వాలంటీర్ల పాత్ర ముఖ్యమైనదని జడ్జి అన్నారు. ఎటువంటి విషయాన్నైనా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకు రావాలని జడ్జి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం రెడ్డి, వివిధ మండలాల నుండి పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలలో అందని పౌష్టికాహారం



**విశ్వంభర, షాద్ నగర్:** ఉన్నతాధి కారుల పర్యవేక్షణ లేకనో లేక పాల కులు సందర్శించక పోవడమోగాని, అంగన్వాడీ కేంద్రాలకు రావాల్సిన పౌష్టికా హారం బాలామృతం, లేక చిన్నారులు, గర్భిణీలు, మహిళలు ఇబ్బంది పడు తున్నారని షాద్ నగర్ బీజేపీ యువ నాయకులు మఠం ఋషికేష్ ఆవేదన చెందారు. అంగన్వాడీ కేంద్రాలకు రావాల్సిన పౌష్టికాహారం సరైన సమయానికి రాకపోవడం పై మండిపడ్డారు. కోడిగుడ్లు, బాలామృతం, పాల ప్యాకెట్లు, కందిపప్పు వంటి మొదలగు పౌష్టికా హారమైన సరుకులు సమయానికి అందక రోజువారిగా బాలింతలు, చిన్నారులు బలహీనపడుతూ రోగాల బారిన పడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ వెంటనే అన్ని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి తగిన చర్యలు జాగ్రత్తలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో పౌష్టికాహార లోపంవల్ల ప్రతిఏటా చిన్నారులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు మరణించడం జరిగిందన్నారు. అలాంటి పరిస్థితులు పునరావృతం కావద్దని కేంద్ర ప్రభుత్వం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా ఐసీడీఎస్ ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్మెంట్ సర్వీసెస్ ప్రతి ఏటా అంగన్వాడీ కేంద్రాలకు సరిపడా నిధులు సమకూరుస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సరైన సమయానికి చిన్నారులకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు సమయానికి పౌష్టికాహారాన్ని అందించడం లేదన్నారు.

## అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చిన దుర్గమాత

**విశ్వంభర, షాద్ నగర్:** శ్రీ దేవి నవరాత్రులలో భాగంగా మూడవ రోజు షాద్ నగర్ పట్టణం ఆర్టీసీ కాలనీలో అన్నపూర్ణ దేవిగా దర్శన మిచ్చిన దుర్గమాతను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి దర్శించుకున్నారు. వారితో పాటు బీజేపీ నాయకులు మల్చలం, కమిటీ సభ్యులు సాయి కృష్ణ, సుధాకర్, బిక్షపతి, నారాయణ స్వామి, పాల్గొన్నారు. నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ దసరాగా పిలవబడే పర్వదినం ముందు తొమ్మిది రాత్రులు దేవిని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారని శరన్నవరాత్రుల్లో అమ్మవారిని ఒక్కోరోజు ఒక్కోరూపంలో అలంకరించి పూజిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రుణమాఫీపై చర్చకు బీఆర్ఎస్ సిద్ధమా?




**నేను సీఎం రేవంత్ రెడ్డిని ఒప్పిస్తా**
**కేసీఆర్‌ను ఒప్పించి తీసుకువచ్చే కెపాసిటీ నీకు ఉందా?**
**హరీష్ ఢిల్లీలో దీక్ష చేసిన రోజే నేను కేసీఆర్ ఇంటి దగ్గర దీక్ష చేస్తా**
**హరీష్ రావు కు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సవాల్**

**విశ్వంభర,హైదరాబాద్** : రైతు రుణమాఫీపై బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. రుణమాఫీతో రైతులను కాంగ్రెస్ మోసం చేసిందంటూ బీఆర్ఎస్ విమర్శలు గుప్పిస్తోంది. ఈ అంశంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పందించారు. గాంధీ భవన్ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణమాఫీ చేయలేదని అదేపనిగా విమర్శిస్తున్న హరీశ్ రావు చర్చకు సిద్ధమా అంటూ సవాల్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని ఒప్పించి చర్చకు తాను తీసుకు వస్తానని చెప్పారు. కేసీఆర్‌ను ఒప్పించి తీసుకువచ్చే కెపాసిటీ హరీష్‌కు ఉందా అని ప్రశ్నించారు. అక్కడ, ఇక్కడ భయమైతే సిద్దిపేటలోనే చర్చ పెట్టు అని సవాలు విసిరారు. సాంకేతిక కారణాలవల్ల కొందరికి రుణ మాఫీ కాలేదని తామే చెప్పున్నామని అన్నారు. రుణమాఫీ అందని రైతులకు ఏ కారణాల వల్ల అంద లేదో వివరాలు తెప్పించమని అధికారులకు సీఎం ఆదేశించారని వెల్లడించారు. హరీష్ రావు పదే పదే అసత్య ప్రచారం చేస్తున్నా రన్నారు. ఆర్థిక శాఖను కేసీఆర్, హరీష్‌లు దివాళా తీయించారని అన్నారు. కేసీఆర్ తొమ్మిదిన్నర సంవత్సరాల్లో నాలుగు కిస్తీల్లో లక్ష రుణమాఫీ చేయలేకపోయారని విమర్శించారు. తాము అధికా రంలోకి వచ్చిన పది నెలల్లోనే రెండులక్షల రుణమాఫీ చేశామని చెప్పారు. మేము చేసింది చెప్పుకోవడంలో పబ్లిసిటీ దగ్గర ఫెయి లయ్యామని, కానీ మీరు చేయనిది చేసినట్టు చెప్పి పబ్లిసిటీ దగ్గర పాసయ్యారు అంతే తేడా అని చెప్పారు. ఏ మొహం పెట్టుకొని హరీష్ ఢిల్లీ వెళ్లి దీక్ష చేస్తారని జగ్గారెడ్డి ప్రశ్నించారు. పదేళ్ల పాలనలో రైతులను మోసం చేసినందుకు కేసీఆర్ ఎక్కడ ఉంటే అక్కడ తాను దీక్ష చేస్తానని చెప్పారు. హరీష్ ఢిల్లీలో దీక్ష చేసిన రోజే తాను కేసీఆర్ ఇంటి దగ్గర దీక్ష చేస్తానని తెలిపారు . అయితే రాహుల్ గాంధీ ఎక్కడ ఉంటాడో క్లారిటీ ఉంది కానీ కేసీఆర్ ఎక్కడ ఉంటాడో తెలియదని జగ్గారెడ్డి ఎద్దేవా చేసారు. హరీష్ డైలాగులకు డిక్షనరీలో కూడా అర్థాలు దొరకవని చెప్పా రు. కేసీఆర్ది రైతు గుండె అని చెబుతున్న హరీష్ రావుకు తొమ్మిదిన్నర సంవత్సరాల తర్వాత ఇది గుర్తు వచ్చిందా? అని ప్రశ్నించారు. మల్లన్న సాగర్ రైతుల వీపులు పగలగొట్టినప్పుడు రైతు గుండె ఏమైంది? ఖమ్మం రైతులకు బేడీలు వేసినప్పుడు కేసీఆర్ గుండె ఫ్రిజ్‌లో పెట్టారా? అని జగ్గారెడ్డి నిలదీశారు.

## కొబ్బరి బోండాలు అమ్ముకునే భక్తుడు

### విజయవాడ దుర్గమ్మకు విశేష కానుక

### రూ. 18 లక్షల బంగారు మంగళసూత్రం బహూకరణ



**విశ్వంభర, విజయవాడ:** దేవీ నవరాత్రుల సందర్భంగా విజయవాడ దుర్గమ్మకు భక్తులు భారీగా కానుకలను సమర్పించుకుంటున్నారు. 9 రోజుల పాటు అత్యంత వైభవంగా ఇంద్రకీలాద్రిపై జరిగే ఉత్సవాలను తిలకించడానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుంటున్నారు. ప్రకాశం జిల్లా కొండేపీ నివాసి కల్లగుంట అంకులయ్య అనే కొబ్బరిబోండాలు అమ్ముకునే భక్తుడు రూ. 18 లక్షల విలువైన బంగారు మంగళసూత్రాన్ని శనివారం అమ్మవారికి బహూకరించారు. గుంటూరుకు చెందిన మరో భక్తుడు చేబ్రోలు పుల్లయ్య 6.5 కేజీల వెండితో తయారు చేయించిన హంస వాహనాన్ని కానుకగా సమర్పించారు. ఆలయ ఈవో రామారావు మాట్లాడుతూ భక్తుల కోరికలు తీర్చే దుర్గమ్మకు కానుకల రూపేణా అందజేసిన దాతలకు అభినందనలు తెలిపారు. దాతలపై అమ్మవారి కటాక్షం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా శనివారం అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

## మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శ



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం బొమ్మ పూర్ గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ బండం పుష్పలత ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆమె చిత్రపటానికి మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పూలు వేసి నివాళులు అర్పించి, వారికుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు లింగపల్లి శ్రీనివాసరావు, మహదేవపూర్ మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు ఉన్నారు.

## కొండా సురేఖను విమర్శిస్తే సహించేది లేదు



**విశ్వంభర, భూపాలపల్లి:** అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మా దాయ శాఖ మంత్రి కొండా సురేఖకు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సమస్యల రూపంలో దండ వేయగా.. దానిని బీఆర్ఎస్ సోషల్ మీడియాలో ట్రోల్‌చేస్తూ.. బీసీ మహిళా మంత్రిని అవమాని స్తున్న తీరును యావత్తు మహిళలోకం తీవ్రంగా ఖండిస్తుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం రంగాపురం మాజీ ఎంపీటీసీ ఆకుతోట లక్ష్మి తీవ్రంగా విమర్శించారు. పేద ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకునే ఒక బీసీ మహిళా మంత్రిపై అగ్రవర్ణ కుల దొ(దు)రహంకారులు ఇలాంటి నీచమైన కార్యక్రమాలకు పాల్పడుతూ కొండా సురేఖను మానసికంగా వేధించడం నీచమైన చర్యగా అభివర్ణించారు. పోరాటంలో పేద ప్రజల పెన్నిధిగా పేరు గాంచిన తెలంగా ణ కాంగ్రెస్ పార్టీ మహిళా ఫైర్‌బ్రాండ్ సురేఖను టార్గెట్ చేస్తే బీఆర్ఎస్‌కు పుట్ట గతులుండవన్నారు. సురేఖకు క్షమాపణలు చెప్పాలని, లేకుంటే బీసీల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పెద్ద శంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల బృందంతో పాటు విద్యార్థులు భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను ఒకచోటచేర్చి పూజాది కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం పాటలు పాడుతూ బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు కలిసి బతుకమ్మ పాటలు, నృత్యాల బతుకమ్మ కుంటలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, అధ్యాపకులు, సిబ్బందితోపాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘట్కేసర్ సీఐ సస్పెండ్



**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా రాచకొండ పోలీస్ స్టేషన్ పరిధి ఘట్కేసర్ పోలీస్ ఇన్స్పెక్టర్ సైదులను రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గడ్డం మహేశ్ హత్య కేసులో ఇన్స్పెక్టర్ డబ్బులు తీసుకుని ఓ వ్యక్తిని కేసు నుంచి తప్పించాడనే ఆరోపణల నేపథ్యంలో గడ్డం మహేశ్ తరపు బంధువులు రెండు రోజుల క్రితం సీపీ సుధీర్ బాబుకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం శనివారం సస్పెండ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

## అడవి జంతువుల అక్రమ రవాణా ముఠా అరెస్టు



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి అటవీ రేంజ్ పరిధిలో గల మేడిపల్లి టోల్ ప్లాజా వద్ద వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో , ఇంటలిజెన్స్ సమాచారంతో పంగోలిన్ (వాలుగా) అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అధికారులు కొనుగోలుదారుల రూపంలో వచ్చి అరెస్టు చేశారు.అనంతరం తదుపరి విచారణ నిమిత్తం వారిని భూపాలపల్లి అటవీ శాఖ రేంజ్ కార్యాలయంలో విచారించారు. పంగోలిన్ (వాలుగా ) అక్రమ రవాణాలో మరో ఐదుగురి ప్రమేయం ఉన్న నిందితుల పేర్లు వెల్లడించారు. ఐదుగురి కోసం గాలించగా ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. మిగతా ముగ్గురు తప్పించుకొని పరారీలో ఉన్నారు. వారందరి పై వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కేసు నమోదు చేసారు.

## అక్రమ కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం

**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్ ఎక్సైజ్ శాఖ పరిధిలోని 4 మండలాల్లో వివిధ కేసుల్లో సీజైన వాహనాలు, నాటు సారాయి లిక్కర్ అండ్ బీర్ ను రంగారెడ్డి డివిజన్ డిప్యూటీ కమిషనర్ ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్ ఆదేశానుసారం డీపీఈఓ ఉజ్వల రెడ్డి ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను వేలం వేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర 24 వేల రూపాయలు అయితే వేలంలో విక్రయించిన ఎక్కువ ధర 45 వేల రూపాయలు పలికిందని, 73 కేసుల్లో పట్టుబడిన అక్రమ నాటు సారాయి 128.4 లీటర్ల మద్యం, 5.86 లీటర్లు , 4.55 లీటర్ల బీరు సీసాలను డీపీఈఓ ఉజ్వల రెడ్డి సమక్షంలో ధ్వంసం చేశామని సీఐ వైద్యనాథ్ చౌహాన్ తెలిపారు.

## కేసీఆర్‌ను కలిసిన శంభీపూర్ క్రిష్ణ



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు. తాను అభిమానుల మధ్య పుట్టినరోజు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

# మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర



**విశ్వంభర, హైదరాబాద్:** సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. పదోన్నతి కోసం దాదాపు మూడు దశాబ్దాలుగా ఎదురుచూసిన జూనియర్ అసిస్టెంట్స్‌కు గ్రేడ్ 3 ఈవోలుగా దేవాదాయ శాఖ ప్రమోషన్ కల్పించింది. జీవో 134 ద్వారా మొత్తం 33 మంది జూనియర్ అసిస్టెంట్‌లు ఈవోలుగా పదోన్నతులు పొందారు. సచివాలయంలో శనివారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రమోషన్ పత్రాలను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ, నేడు 33 మంది జూనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్ 3 ఈవోలుగా తన చేతుల మీదుగా ప్రమోషన్ పత్రాలు అందివ్వడం చాలా ఆనందంగా వుందని అన్నారు. ఒక సంతకంతో వారికి ప్రమోషన్లు కల్పించేందుకు కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని అన్నారు. ఉద్యోగులకు సంబంధించిన ప్రమోషన్స్ అనేవి సాధారణ ప్రక్రియలో భాగమనీ, అటువంటి ప్రమోషన్స్ ను కూడా చేపట్టకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులను మానసికంగా హింసించిందని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలకు, ఉద్యోగులకు సంబంధించిన ఏ సమస్యనైనా త్వరిత కాలంలోనే పరిష్కరిస్తుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. నాడే వారికి ప్రమోషన్స్ వచ్చుంటే వారి సేవలతో దేవాదాయ శాఖ మరింత బలోపేతమయ్యేదనీ, పెండింగ్ సమస్యలకు పరిష్కారం లభించేదని అన్నారు. ఇప్పటికే గ్రేడ్ 1, గ్రేడ్ 2 ఈవోలుగా పలువురికి ప్రభుత్వం ప్రమోషన్లు కల్పించిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. కొత్త ఈవోలుగా బాధ్యతలు చేపట్టిన ఉద్యోగులు దేవాలయాల అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మంత్రి సూచించారు. దేవాదాయశాఖ భూముల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి, దేవాదాయ భూములకు జియో ట్యాగింగ్ వంటి నిర్ణయాలతో దేవాదాయశాఖ ఆస్తులకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుదిట్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతున్నదని అన్నారు. కోర్టు కేసుల్లో వున్న దేవాలయ భూములకు విముక్తి ప్రసాదించేందుకు దేవాదాయ శాఖ లీగల్ ఆఫీసర్ ను నియమించనుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, అడిషనల్ కమిషనర్ జ్యోతి, దేవాదాయశాఖ దేవాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్, పదోన్నతి పొందిన ఈవోలు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



**విశ్వంభర,చండూరు:** శ్రీ మార్కండేశ్వర స్వామి దేవాలయంలో దేవి ఉత్సవాల్లో రాజ రాజేశ్వరి దేవిఅన్నపూర్ణ అలంకారంలో దర్శనం ఇచ్చింది.



**విశ్వంభర,చండూరు:** భావనఋషి యూత్ ఆధ్వర్యంలో అన్నపూర్ణ దేవి అలంకారంలో దుర్గాదేవి దర్శనం ఇచ్చింది. ట్రస్మా నల్గొండ జిల్లా అధ్యక్షులు, గాంధీజీ విద్యా సంస్థల, ఫౌండేషన్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు,అరుణ దంపతులు పూజలో పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న కలప స్వాధీనం



**విశ్వంభర,పెద్దశంకరంపేట:** అటవీరేంజ్ పరిధిలోని టేక్మాల్ మండలం కుసంగి గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న కలప ట్రాక్టర్‌ను స్వాధీన పర్చుకున్నామని పెద్ద శంకరంపేట రేంజ్ అటవీశాఖ అధికారి వికాస్ తెలిపారు. పట్టా భూముల్లో అక్రమంగా నరికిని చింత, తుమ్మ, వేప చెట్ల మొద్దులను కుసంగి నుంచి ఇతర గ్రామాలకు తరలిస్తుండగా వచ్చిన రహస్యంగా దాడిచేసి పట్టుకున్నామని అన్నారు. ట్రాక్టర్‌ని స్వాధీన పర్చుకుని ట్రాక్టర్‌యజమాని నారాయణపై కేసు నమోదు చేశామని తెలిపారు.

# మురళీకృష్ణుడి అవతారంలో దర్శనమిచ్చిన శ్రీవారు



**విశ్వంభర, తిరుమల:** తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు తిరుమలలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఉదయం స్వామి వారిని చిన్నశేష వాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు. మురళీకృష్ణుడి అవతారంలో ఆయన భక్తులకు అభయప్రదానం చేశారు. పురాణ ప్రాశస్త్యం ప్రకారం చిన్నశేషుడిని వాసుకిగా భావిస్తారు. శ్రీవైష్ణవ భగవంతుడు శేషి, శేషభూతం. శేషవాహనం సూచిస్తుంది. చిన్నశేష వాహనాన్ని దర్శిస్తేభక్తులకు కుండలినీయోగ సిద్ధిఫలం లభిస్తుందని ప్రశస్తి.

### నేత్రపర్వంగా తిరుమంజనం..

వేడుకల్లో భాగంగా మలయప్పస్వామి వారికి స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా సాగింది. కార్యక్రమంలో శ్రీవల్లి పుత్తూరు నుంచి తొలిసారిగా తెచ్చిన చిలకలతో చేసిన మాలలు, కిరీటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయంలోని రంగనాయకుల మండపంలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మూడు గంటల వరకు వేద మంత్రోచ్ఛారణ మధ్య స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై ఆశీనులను చేసి వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. రంగురంగుల ఆర్కిడ్ పుష్పాలలతో వేదికను సుందరంగా తీర్చిదిద్దారు. వేడుకలో మొదట విష్వక్సే నారాధన, పుణ్యాహవచనం, ముఖ ప్రక్షాళన, ధూప దీప నైవేద్యం, ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, రాజోపచారం నిర్వహించారు. అర్ఘ్య పాద నివేదనలో భాగంగా పాలు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు.శంఖనిధి, పద్మనిధి, సహస్రధార, కుంభధారణలతో వైఖానస ఆగమయుక్తంగా స్నపనం జరిగింది. ఈ సందర్భంగా ఉపనిషత్తు మంత్రాలు, దశశాంతి మంత్రాలు, పురుష సూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం వంటి పంచసూక్త మంత్రాలు, దివ్యప్రబంధంలోని అభిషేక సమయంలో అనుసంధానం చేసే వేదాలను టీటీడీ వేద పారాయణదారులు పారాయణం చేశారు. అభిషేకానంతరం వివిధ పాశురాలను తిరుమల పెద్ద జీయ్యంగార్, తిరుమల చిన్న జీయ్యంగార్లు పఠించారు. వేడుకలో ఏలకులు, వట్టివేరు, బాదం, వివిధ రకాల డ్రై ఫ్రూట్స్, చందనం, నల్ల ద్రాక్ష, రోజ్ పెటల్స్. తులసి దండలు స్వామి అమ్మవార్లకు అలంకరించారు. టీటీడీ గార్డెన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. దాదాపు టన్ను సంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్స్, పండ్లు, లతలతో వేదికను శోభాయమానంగా తీర్చిదిద్దారు. మలయప్ప స్వామి వారికి రూపొందించిన పూలమాలలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చెన్నైకి చెందిన దాత ఈ మాలలను విరాళంగా అందించారు.

### తిరుమలలో వైభవంగా శ్రీవారి

### హంసవాహన సేవ..

బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు రాత్రి శ్రీమలయప్పస్వామి వీణాపాణియై హంస వాహనంపై సరస్వతీమూర్తి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మ వాహనమైన హంస పరమహంసకు ప్రతీక. హంసకు ఒక ప్రత్యేకత ఉంది. అది పాలను, నీళ్లను వేరుచేయగలదు. అంటే మంచిని, చెడును గ్రహించగలిగిన అపురూపమైన శక్తిగలదని అర్థం. అందుకే ఉపనిషత్తులు హంసను పరమేశ్వరునిగా అభివర్ణిస్తున్నాయి. శ్రీవారు హంస వాహనాన్ని అధిరోహించి దర్శనమివ్వడం ద్వారా అహంభావాన్ని తొలగించి దాసోహభావాన్ని(శరణాగతి) కలిగిస్తాడని భక్తుల విశ్వాసం.

## శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



**ఆంధ్రప్రదేశ్:** హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప శనివారం భ్రమరాంబ మల్లికార్జున క్షేత్రాన్ని దర్శించుకున్నారు. శనివారం ఆలయ ప్రధాన గోపురం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి ఈవో పెద్దిరాజు ఘన స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు వేదాశీర్వచనం చేయగా.. స్వామి అమ్మవార్ల శేష వస్త్రంతో సన్మానించి.. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# పాక్‌లో పర్యటన మాత్రమే.. ఆ దేశంతో చర్చల్లేవు: జై శంకర్

**దిల్లీ:** కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ పాకిస్థాన్ పర్యటనకు వెళ్లనున్నారు. అక్టోబర్ 15-16 తేదీల్లో ఇస్లామాబాద్ వేదికగా జరగనున్న షాంఘై సహకార సంఘం వార్షిక సమావేశానికిఆయన హాజరుకానున్నారు. పాక్ పర్యటన గురించి మాట్లాడుతూ ఆ దేశంతో ఎలాంటి ద్వైపాక్షిక చర్చలు ఉండవని తేల్చిచెప్పారు."నేను బహుళపక్ష కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్నా. భారత్-పాకిస్థాన్ సంబంధాలు గురించి మాట్లాడేందుకు కాదు. ఎస్‌సీఓలో సభ్యుడిగా ఆ దేశంలో పర్యటిస్తున్నా. నేనొక మర్యాదగల పౌరుడిని.. దానికి అనుగుణంగానే వ్యవహరిస్తాను" అని జై శంకర్ వెల్లడించారు. అలాగే సౌత్ ఏషియన్ అసోసియేషన్ ఆఫ్ రీజినల్ కో-ఆపరేషన్ (%బూూ=జ%)లో విషయంలో ఎలాంటి పురోగతి లేకపోవడం గురించి ప్రస్తావించారు. "కొన్ని చిన్న కారణాల వల్ల సార్క్ సమావేశాలు జరగడం లేదు. సార్క్‌లోని ఒక సభ్యదేశం.. ఆ గ్రూప్‌నకే చెందిన దేశంపై ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతోంది" అని పాకిస్థాన్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. ఆ దేశం చర్యల వల్లే సార్క్ సమావేశాలు ఆగిపోయాయని.. అయితే పూర్తిగా ప్రాంతీయ కార్యకలాపాలు నిలిచిపోయాయని దానర్థం కాదని వెల్లడించారు. ఇంకా చెప్పాలంటూ గత ఐదారేళ్లుగా.. భారత ఉపఖండంలో మరింతగా ప్రాంతీయ సమైక్యత పెరిగిందన్నారు. ఈసారి ఎస్‌సీవో సదస్సుకు ఆతిథ్యమిస్తోన్న పాకిస్థాన్ నుంచి ప్రధాని మోదీకి ఆహ్వానం అందినట్లు ఆగస్టు 30న కేంద్రం ధ్రువీకరించిన విషయం తెలిసిందే. ఈ శిఖరాగ్ర సమావేశంలో ఎస్‌సీఓ సభ్య దేశాలకు చెందిన ప్రతినిధులు ఆయా దేశాల మధ్య ఆర్థిక, సామాజిక-సాంస్కృతిక,మానవతా సహకారం తదితర అంశాలపై చర్చించ నున్నారు. కశ్మీర్ సమస్య, సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాకిస్థాన్ తీరుతో ఇరు దేశాల మధ్య సంబంధాలు దిగజారిపో యాయి. అలాంటి పాకిస్థాన్‌కు దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత తొలిసారి భారత విదేశాంగ మంత్రి వెళ్తుండటం విశేషం. షాంఘై శిఖరాగ్ర సదస్సుకు భారత ప్రతినిధి బృందానికి జైశంకర్ నాయ కత్వం వహిస్తారని, ఆయన కేవలం ఈ సదస్సు కోసం మాత్రమే వెళ్తున్నారని జైశ్వాల్ స్పష్టంచేశారు. గతంలో 2015 డిసెంబర్‌లోఅఫ్గానిస్థాన్ అంశంపై పాకిస్థాన్‌లోజరిగిన కాన్ఫరెన్స్‌కు అప్పటి భారత విదేశాంగమంత్రిగా ఉన్న సుష్మాస్వరాజ్ హాజరైన విషయం తెలిసిందే. షాంఘైలో 2001లో జరిగిన శిఖరాగ్ర సదస్సులో ఎస్‌సీవో ఏర్పాటైంది. తొలుత ఇందులో



రష్యా, చైనా, కిర్గిజ్ రిపబ్లిక్, కజికిస్థాన్, తజికిస్థాన్, ఉబ్జెకిస్థాన్‌లు ఉండగా.. 2017లో భారత్, పాకిస్థాన్‌లు శాశ్వత సభ్యత్వం పొందాయి. గతేడాది భారత్ ఆతిథ్యంలో వర్చువల్‌గా జరిగిన ఈ సదస్సు సందర్భంగా ఇరాన్ శాశ్వత సభ్య దేశంగా చేరింది.

## కుప్వారాలో ఎన్‌కౌంటర్ ఇద్దరు ఉగ్రవాదులు హతం



**కుప్వారా:** జమ్మూ కశ్మీర్ లోని కుప్వారా జిల్లాలోఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఉగ్రవాదులు, భద్రతా బలగాల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో ఇద్దరు టెర్రరిస్ట్‌లు హతమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భారత్‌పాకిస్థాన్ సరిహద్దుల్లో చొరబాటు ప్రయత్నాన్ని భద్రతా బలగాలు భగ్నం చేశాయి. గుగల్‌ధార్‌లో అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించిన బలగాలు.. ఆ ప్రాంతంలో ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో ఉగ్రవాదులు, పోలీసుల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకన్నాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు భారత సైన్యం శనివారం వెల్లడించింది. ఎన్‌కౌంటర్ జోన్ నుంచి భారీగా ఆయుధాలు గుర్తించినట్లు తెలిపింది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఆపరేషన్ కొనసాగుతున్నట్లు వెల్లడించింది.

## బెంగాల్‌లో మరో ఘోరం.. ఒంటినిండా గాయాలతో శవమై కనిపించిన బాలిక

**కోల్‌కతా:** కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఘటనను మరువకముందే బెంగాల్‌లో మరో ఘోరం చోటుచేసుకుంది. శుక్రవారం కోచింగ్ క్లాస్‌కు వెళ్లిన 11 ఏళ్ల బాలిక అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోవడంతో ప్రజల్లో ఆగ్రహ జ్వాలలు చెలరేగాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగాలలోని సౌత్ 24 పరగణాస్ జిల్లాకు చెందిన ఓ బాలిక కోచింగ్ క్లాస్‌కు హాజరయ్యేందుకు శుక్రవారం ఇంటినుంచి వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక కోసం గాలిస్తున్న క్రమంలో శనివారంతెల్లవారుజామున 3.30గంటల సమయంలో ఓపొలంలో ఆమె మృతదేహం లభ్యమైంది. ఒంటినిండా గాయాలు ఉండటంతో కిడ్నాప్ చేసి హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దారుణానికి ఒడిగట్టినట్లు అనుమానిస్తున్న మొస్తకిన్ సర్దార్ అనే 19 ఏళ్ల యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో ఆగ్రహించిన గ్రామస్థులు తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. కర్రలతో పోలీసుస్టేషన్‌పై దాడి చేసి, అవుట్ పోస్ట్‌కు నిప్పుపెట్టారు. దీంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు భద్రతా బృందాలనుమోహరించారు. కాగా బాలికపై అత్యాచారం జరిగి ఉంటుందని కేంద్ర మంత్రి, బీజేపీరాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ పేర్కొన్నారు. ఇన్ని అఘాయిత్యాలు జరుగుతున్నా బెంగాల్ ప్రభుత్వం నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే మరో అమాయక బాలిక ప్రాణాలు కోల్పోయిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి మమతాబెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## అప్పుల బాధ తాళలేక ఒకే కుటుంబంలో ముగ్గురి ఆత్మహత్య

**విశ్వంభర, ఎడవల్లి:** నిజామాబాద్ జిల్లాలోని ఎడవల్లి మండలం వడ్డేపల్లిలో విషాద ఘటన చోటుచేసుకుంది. అప్పుల బాధ తాళలేక ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. మృతులను సురేశ్ (53),హేమలత (45),హరీశ్(22)గా గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను బోధన్ ఆసుపత్రికి తరలించారు.

## నీతీశ్ కుమార్‌కు భారతరత్న ఇవ్వాలి పట్నాలో వెలసిన పోస్టర్లు



**పట్నా:** బిహార్ రాజధానిలో పట్నాలో ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ కు సంబంధించిన పోస్టర్లు చర్చనీయాంశంగా మారాయి. నీతీశ్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'భారత రత్న'ను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నగరమంతా ఆయన పార్టీ జనతా దళ్ (యూనైటెడ్) పోస్టర్లు అంటించినట్లు తెలుస్తోంది. ఆ గౌరవాన్ని పొందేందుకు ఆయన అర్హుడని పార్టీ పేర్కొంది.పార్టీ కార్యాలయం గోడలపై పోస్టర్లు ఉండడంతో మీడియా జేడీయూ నేతలను ప్రశ్నించింది. "నీతీశ్ కుమార్‌కు కచ్చితంగా భారత రత్న ఇవ్వాలనేది మా డిమాండ్ కాదు. కానీ, ఆ గౌరవాన్ని అందుకునేందుకు ఆయన పూర్తిగా అర్హులు" అని పార్టీ సీనియర్ నాయకుడు ఒకరు పేర్కొన్నారు. కాగా.. రాష్ట్ర సీఎంగా సుదీర్ఘ కాలం సేవలందించిన నీతీశ్ కుమార్.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి నాయకత్వం వహించనున్నారు.మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ హయాంలో కేంద్ర మంత్రిగా నీతీశ్ సేవలందించారు. ఆయన భారతరత్న పురస్కారాన్ని స్వీకరించేందుకు వీటితో పాటు మరెన్నో కారణాలు ఉన్నాయని పార్టీ పేర్కొంది. పోస్టర్లపై స్పందించిన ఆర్జేడీ.. జేడీయూపై తీవ్ర విమర్శలు గుప్పించింది. సీఎం కుర్చీని ఖాళీ చేయా లంటూ నీతీశ్‌పై బీజేపీ ఒత్తిడి తెస్తోందని ఆరోపించింది. "ఈ నేపథ్యం లోనే జేడీయూ సమావేశం ఏర్పాటు చేసింది. ఇప్పుడు పట్నాలో పోస్టర్లే ఆ పార్టీ అయో మయంలో ఉందనడానికి నిదర్శనం" అంటూ విమర్శించింది.

## ఐనేని సూర్యప్రకాశ్ రావును సన్మానించిన కేటీఆర్



**విశ్వంభర, హైదరాబాద్ :**కల్వకుర్తి సూర్యలత స్పిన్నింగ్ మిల్ అధ్యక్షుడిగా మూడోసారి గెలిచిన ఐనేని సూర్యప్రకాశరావును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌సన్మానించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ రావుకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. కేటీఆర్‌కు సూర్యప్రకాశ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కల్వకుర్తి మండలం మార్చాల సత్యసాయి నగర్ సూర్యలత స్పిన్నింగ్ మిల్లులో ఇటీవల జరిగిన కార్మిక సంఘం ఎన్నికల్లో బీఆర్ఎస్‌కేవీ బలపరిచిన అభ్యర్థి సూర్యప్రకాశ్‌రావు అధ్యక్షుడిగా ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. సూర్యలత కాటన్ మిల్లులో కార్మిక సంఘం ఎన్నికల్లో బీఆర్ఎస్‌కేవీ బలపరిచిన అభ్యర్థిగా సూర్యప్రకాశ్‌రావు, ఐఎన్‌టీయూసీ(కాంగ్రెస్) అభ్యర్థిగా మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ పోటీ చేశారు.మంగళవారం కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో ఉదయం 7 నుంచి మధ్యా హ్నం 2 గంటల వరకు జరిగిన ఎన్నికల్లో మొత్తం 450ఓట్లకు గానూ 438 ఓట్లు పోలవ్వగా అందులో 251 ఓట్లు సూర్యప్రకాశ్‌రావుకు, 183 ఓట్లు ఆనంద్‌కుమార్‌కు పోలవ్వగా, 4 ఓట్లు చెల్లని ఓట్లుగా నమోదు కాగా 68 ఓట్ల మెజార్టీతో సూర్యప్రకాశ్‌రావు విజయం సాధించారు. సూర్యప్రకాశ్‌రావు విజయం సాధించడంతో అభిమానులు, కార్మికులు పెద్దఎత్తున సంబురాలు జరుపుకొన్నారు.

## గాయత్రిదేవి అలంకారంలో దర్శనమిచ్చిన భద్రకాళీ అమ్మవారు

**విశ్వంభర, వరంగల్:** ప్రసిద్ధ భద్రకాళీ అమ్మవారి దేవాలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి అభిషేకాలతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భద్రకాళీ అమ్మవారిని గాయత్రీదేవిగా సర్వాంగ సుందరంగా అలంకరించారు. దర్శించుకునేందుకు భక్తులు ఆలయ ప్రాంగ ణంలో క్యూలైన్లలో బారులు తీరారు. భద్రకాళీ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. దర్శనమిస్తున్నారు.కాగా, ఉత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం అమ్మవారు అన్నపూర్ణేశ్వరిగా దర్శనమిచ్చారు. ఉదయంమకర, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై ఊరేగారు. తొమ్మిదిరోజులపాటు జరిగే ఉత్సవాలలో అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనం ఇస్తున్నారు. ధ్వజారోహణంతో మొదలయ్యే శరన్నవరాత్రి ఉత్సవాలు, తెప్పోత్సవంతో ముగియనున్నాయి.

**భద్రాచలంలో..**భద్రాద్రి సీతారామచంద్రస్వామివారి ఆలంయలో దేవిశరన్నరాత్రి మహోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. లక్ష్మీతాయరు అమ్మవారు సంతానలక్ష్మిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారికి మహానివేదన, అనంతరం మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహిచారు. అమ్మవారికి సాయంత్రం విశేష దర్బారు సేవ,



మంత్రపుష్పం, తిరువీధి సేవ నిర్వహిస్తారు.ఇక మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మూడో రోజైన నేడు అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారికి అభిషేకం, సహస్రనామార్చన, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

## ఇండిగోలో సాంకేతిక లోపం

### విమాన సేవలపై ప్రభావం




**దిల్లీ:** దేశీయ విమానయాన సంస్థ ఇండిగోలో సాంకేతిక సమస్య తలెత్తింది . దీంతో దేశవ్యాప్తంగా విమాన సేవలకు అంతరాయం ఏర్పడింది. చెక్-ఇన్ ప్రక్రియలు నెమ్మదిగా సాగడంతో పాటు, టికెట్ బుకింగ్‌లలో సైతం సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ కారణంగా ప్రధాన విమానాశ్రయాల్లో చెక్-ఇన్ కోసం పెద్ద సంఖ్యలో ప్రయాణికులు క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి తలెత్తింది. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఈ సమస్య ఉత్పన్నమైంది.ఎయిర్‌లైన్స్‌లో సాంకేతిక లోపంపై ఇండిగో స్పందించింది. తమ నెట్‌వర్క్‌లు అన్నింటిలోనూ తాత్కాలికంగా వ్యవస్థలు నెమ్మదిం చాయని తెలిపింది. దీని ప్రభావం వెబ్‌సైట్, బుకింగ్ సిస్టమ్‌పై పడిందని పేర్కొంది. చెక్-ఇన్‌లు ఆలస్యంగా జరుగుతున్నట్లు తెలిపింది. దీంతో రద్దీ పెరిగే అవకాశం ఉందని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా సేవలను అందించేందు కు తమ ఎయిర్‌పోర్ట్ బృందం కృషి చేస్తోందని వెల్లడించింది. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఇండిగో స్పష్టం చేసింది. ఈ మేరకు కస్టమర్లకు కలిగిన అసౌకర్యానికి విచారం వ్యక్తం చేసింది. మరోవైపు ఎయి ర్‌లైన్స్‌లో నెలకొన్న సమస్య నేపథ్యంలో తమకు కలిగిన అసౌకర్యాన్ని పలువురు కస్టమర్ల సోషల్ మీడియా ద్వారా పంచుకుంటున్నారు..ఫొటోలు, వీడియోలు పోస్టు చేస్తున్నారు.

## గుర్రంపై వచ్చి ఓటు వేసిన బీజేపీ ఎంపీ నవీన్ జిందాల్



**చండీగఢ్:** హర్యానాకు చెందిన బీజేపీ ఎంపీ నవీన్ జిందాల్ గుర్రంపై పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కురుక్షేత్ర ఎంపీ అయిన నవీన్ జిందాల్ ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. శుభపరిణామంగా భావించి గుర్రంపై స్వారీ చేస్తూ పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేసినట్లు తెలిపారు. తన తల్లి సావిత్రి జిందాల్ హిసార్ నుంచి పోటీ చేస్తున్నదని ఆయన చెప్పారు. హిసార్ కోసం చాలా చేయాలని ఆమె కోరుకుంటున్నదని తెలిపారు. అయితే తమ ప్రతినిధిగా ఎవరు ఉండాలో అన్నది హిసార్ ప్రజలు నిర్ణయిస్తారని అన్నారు.కాగా, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయంపై నవీన్ జిందాల్ విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు తమ పార్టీని ఆశీర్వదిస్తారని తెలిపారు. 'ప్రజల్లో చాలా ఉత్సాహం ఉంది. వారు ఈ రోజు ఓటు వేయడం చాలా సంతోషంగా ఉంది. హర్యానా ప్రజలు ధైర్యవంతులు, అవగాహన ఉన్న వారని నేను విశ్వసిస్తున్నా. బీజేపీకి ఆశీస్సు లు అందజేసి ఆశీర్వదిస్తారు. నయాబ్ సింగ్ సైనీ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు' అని అన్నారు.

# ఆయుధాలు ఎప్పుడో వదిలేశా..

## నేనిప్పుడు గాంధేయవాదిని: యాసిన్ మాలిక్



**దిల్లీ:** తాను ఇప్పుడు గాంధేయవాదిగా మారిపోయానని వేర్పాటువాది యాసిన్ మాలిక్ వెల్లడించాడు. 1994 నుంచి సాయుధ పోరాటాన్ని వదిలేశానని చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం - ఉపా ట్రైబ్యునల్‌కు తెలిపాడు. ఐక్యత, స్వతంత్రతతో కూడిన కశ్మీర్‌ను ప్రోత్సహించేందుకే తాను హింసను విడనాడానని ట్రైబ్యునల్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నాడు. జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్-యాసిన్పై కేంద్రం ఐదేళ్లపాటు నిషేధం విధించింది. దీనిని సమీక్షించిన ఉపా ట్రైబ్యునల్ ఆ నిషేధాన్ని సమర్థించింది. ఈ నేపథ్యంలోనే యాసిన్ అఫిడవిట్ సమర్పించాడు. ఇదిలాఉంటే.. 1990 జనవరి 25న పాత శ్రీనగర్ ఎయిర్‌ఫీల్డ్‌లో విధుల నిర్వహణకు సిద్ధమైన వాయుసేన సిబ్బంది శ్రీనగర్ శివార్లలోని రావల్‌పుర ప్రాంతంలో పికప్ కోసం ఎదురుచూస్తున్నారు. అంతలోనే ఉగ్రవాదులు వారిపై కాల్పులకు పాల్పడ్డారు. మాలిక్ నాయకత్వంలోనే ఈ ఘాతుకం జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో స్క్వాడ్రన్ లీడర్ రవిఖన్నా సహా నలుగురు మృతి చెందగా.. 22 మంది గాయపడ్డారు. ఆ సమయంలో మాలిక్.. జమ్ముకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ తరఫున పని చేశాడు. ఆ తర్వాత అరెస్టయిన అతడిపై.. సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. 1994లో మాలిక్ జైలు నుంచి విడుదలయ్యాడు. 1995 లో విచారణపై కోర్టు స్టే విధించింది. అనంతరం జేకేఎల్ఎఫ్ ముక్కలైంది. ఇందులో ఒక వర్గానికి మాలిక్ నాయకత్వం వహించాడు. అనంతరం ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమకూర్చాడనే ఆరోపణలు రుజువు కావడంతో అతడికి శిక్ష పడింది. ప్రస్తుతం తిహాడ్ జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు. ఇదిలాఉంటే.. వాయుసేన సిబ్బందిపై కాల్పుల కేసులో ప్రధాన షూటర్, కశ్మీర్ వేర్పాటువాది యాసిన్ మాలిక్ అని విచారణలో భాగంగా ప్రత్యక్షసాక్షి గుర్తించిన సంగతి తెలిసిందే.

## ఇప్పుడు.. తలవంచి నమస్కరించడం వల్ల లాభమేంటి..? : రాహుల్



**ముంబయి:** బీజేపీ ప్రభుత్వం ప్రజలను భయపెట్టడంతో పాటు రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. మహారాష్ట్ర లోని కొల్హాపూర్‌లో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు.సింధుదుర్గ్ జిల్లాలోని రాజ్‌కోట్ కోటలో 35 అడుగుల శివాజీ విగ్రహం కుప్పకూలిన ఘటనను ఉద్దేశిస్తూ.. బీజేపీ సర్కార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. "ప్రజలను భయపెడుతూ, రాజ్యాంగాన్ని, ఆయా సంస్థలను నాశనం చేస్తూ..ఇప్పుడు ఛత్రపతి శివాజీఎదుట తల వంచి నమస్కరించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. శివాజీఅందించిన సందేశందేశమంతటికీ వర్తిస్తుంది. ఛత్రపతి, షాహూమహరాజ్ లాంటి యోధులు లేకపోయి ఉంటే.. నేడు మనకు రాజ్యాంగం ఉండేది కాదు" అని ప్రధాని మోదీ ని ఉద్దేశిస్తూ రాహుల్ వ్యాఖ్యానించారు.కాగా.. భారీ వర్షాల కారణంగాఈ ఏడాది ఆగస్టులో రాజ్‌కోట్ కోటలో 35 అడుగుల శివాజీ విగ్రహం కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటన రాజకీయంగా తీవ్రదుమారం రేపింది. నాణ్యతా లోపం కారణంగా విగ్ర హం కూలిపోయిందంటూ రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేశాయి. ఈ ఘటన చోటుచే సుకున్న తర్వాత రాష్ట్రంలో పర్యటించిన ప్రధాని మోదీ.. శివాజీకి తల వంచి క్షమాపణలు తెలియజేశారు. మనకు ఈ దైవం కంటే గొప్పది ఏమీ లేదన్నారు. తాజాగా కొల్హాపూర్‌లో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన రాహుల్.. నాడు ప్రధాని ప్రసంగాన్ని ఉద్దేశిస్తూ తీవ్ర విమర్శలు గుప్పించారు.

## రాహుల్ గాంధీకి పుణె కోర్టు సమన్లు

**పుణె:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి పుణె ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. గతేడాది లండన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాహుల్ మాట్లాడుతూ వినాయక్ దామోదర్ సావర్కర్ పై తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లుగా సావర్కర్ మనవడు సత్యకి సావర్కర్ గతంలో పుణెలోని ఓ కోర్టులో పరువు నష్టం దావా దాఖలు చేశారు. దీనికి ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు పోలీసులు తేల్చారు. కాగా ఈ కేసు గత నెలలో జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ (ఎఫ్ఎంఎఫ్‌సి) కోర్టు నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టుకు బదిలీ అయ్యింది. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన కోర్టు అక్టోబర్ 23న తమముందు హాజరుకావాలని కోరుతూ రాహుల్‌కు సమన్లు జారీ చేసింది.రాహుల్‌గాంధీ గతంలో 'మోదీ' ఇంటి పేరుపై చేసిన వ్యాఖ్యల కారణంగా ఆయనపై పరువు నష్టం కేసు నమోదైంది. సూరత్ కోర్టు రాహుల్‌ను దోషిగా తేల్చి రెండేళ్ల జైలు శిక్ష కూడా విధించటంతో.. రాహుల్ అప్పట్లో ఎంపీ పదవిని కూడా కోల్పోయారు. ఇటీవల అమెరికా పర్యటనలో భాగంగా భారత్‌పై రాహుల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే.

## వడోదర, రాజ్‌కోట్ ఎయిర్‌పోర్ట్స్‌కు బాంబు బెదిరింపులు




**వడోదర:** దేశంలో బాంబు బెదిరింపులు కలకలం సృష్టిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా ఎక్కడో ఒకచోట పాఠశాలలకో, విమానాశ్రయాలకో, షాపింగ్ మాల్స్‌కో ఇలాంటి బెదిరింపులు వస్తూనే ఉన్నాయి. నిన్న బెంగళూరులోని మూడు కళాశాలలకు ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా గుజరాత్‌లోని వడోదర , రాజ్‌కోట్ ఎయిర్‌పోర్ట్స్ కు బాంబు బెదిరింపులు వచ్చాయి.గుర్తు తెలియని వ్యక్తులు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌కి ఈమెయిల్ ద్వారా ఈ బెదిరింపులకు పాల్పడ్డారు. సీఐఎస్ఎఫ్ బలగాలకు శనివారం ఉదయం 11 గంటలకు ఈ మెయిల్ వచ్చింది. బెదిరింపు మెయిల్‌తో పోలీసులు, సీఐఎస్ఎఫ్ బలగాలు వెంటనే అప్రమత్తమై రెండు విమానాశ్రయాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులూ, పేలుడు పదార్థాలూ లభించలేదని అధికారులు వెల్లడించారు. దేశంలోని ఇతర విమానాశ్రయాలకు కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చినట్లు వడోదర పోలీస్ కమిషనర్ నర్సింహా కోమర్ ధ్రువీకరించారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ అభ్యర్థన మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. కాగా, ఇలాంటి బెదిరింపులు రావడం ఇదేమీ మొదటిసారి కాదు. కొన్ని నెలల క్రితం అహ్మదాబాద్, వడోదర, రాజ్‌కోట్ సహా దేశంలోని సుమారు 100 విమానాశ్రయాలపై బాంబులు వేస్తామని గుర్తు తెలియని వ్యక్తులు ఈ మెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. అన్ని ఘటనలపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను గుర్తించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

## యూట్యూబర్ హర్షసాయిపై లుక్‌అవుట్ నోటీసులు



**విశ్వంభర, హైదరాబాద్:** యూట్యూబర్ హర్షసాయి కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అతడిపై నార్సింగి పోలీసులు లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. హర్షసాయిపై గత నెలలో అత్యాచారం కేసు నమోదైంది. తనపై అత్యాచారం చేశాడని, నగ్నచిత్రాలు సేకరించి బ్లాక్‌మెయిల్ చేశాడని ఓ సినీ నటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న హర్షసాయి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# తిరుమలలో వీఐపీ సంస్కృతి తగ్గాలి: సీఎం చంద్రబాబు



**విశ్వంభర, తిరుమల:** తిరుమల ఆలయ పవిత్రత, నమ్మకం కాపాడేలా పనిచేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. "కొండపై గోవింద నామ స్మరణ తప్ప మరో మాట వినిపించకూడదు. ప్రశాంతతకు ఎక్కడా భంగం కలగకూడదు. ఏ విషయంలోనూ రాజీ పడొద్దు. భవిష్యత్ నీటి అవసరాలకు ముందస్తు ప్రణాళిక చాలా అవసరం. అటవీ ప్రాంతాన్ని 72 నుంచి 80 శాతానికి పైగా పెంచాలి. అటవీ సంరక్షణ, అడవుల విస్తరణకు ప్రణాళికతో పని చేయాలి. ప్రసాదాల నాణ్యత ఎల్లప్పుడూ కొనసాగాలి. మరింత మెరుగపడాలి. తిరుమలలో వీఐపీ సం స్కృతి తగ్గాలి. ప్రముఖులు వచ్చినప్పుడు హడావుడి కనిపిం చకూడదు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఉండాలి.. ఆర్భాటం, అనవసర వ్యయం వద్దు. భక్తుల పట్ల టీటీటీడీ సిబ్బంది గౌరవంగా వ్యవహ రించాలి. దేశవిదేశాల నుంచి ఇక్కడికి వచ్చేవారిని గౌరవించుకోవాలి. దురుసు ప్రవర్తన ఎక్కడ కూడా ఉండొద్దని అన్నారు. స్విమ్స్ సేవలు కూడా మెరుగుపడాలి" అని చంద్రబాబు తెలిపారు. బయో డైవర్సిటీ పరిరక్షణకు తీసు కుంటున్న చర్యలపై సీఎం వివరాలు అడిగి తెలుసు కున్నారు. టీటీడీ సేవలపై భక్తుల నుంచి స్పందన తీసుకునే విధానంపై ప్రశ్నిం చారు. ప్రతి భక్తుడు అభిప్రాయాలు చెప్పే అవకాశాలు కల్పిం చాలన్నారు. వారి సూచనల ఆధారంగా సేవలపై టీటీడీ పని చేయాలని ఆదేశించారు. ఒక్క టీటీడీలోనే కాకుండా అన్ని ఆలయాల్లో ఇది అనుసరించాలని ఆదేశించారు. అభిప్రాయాలు తీసుకునే విధానం తీసుకురావాలని మంత్రి ఆనంకు సీఎం సూచించారు. ప్రసాదాల తయారీలో వాడే పదార్థాల నాణ్యత బాగుండేలా చూడాలని చెప్పారు. శ్రీవారి వార్షికబ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం లో వెంగమాంబ సెంట్రలైజ్డ్ కిచెన్ ను ప్రారంభించారు. ఈ కిచెన్ ప్రారం భోత్సవంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు

**టీటీడీలో రివర్స్ టెండరింగ్ రద్దు**

:టీటీడీ లో రివర్స్ టెండరింగ్ విధానాన్ని రద్దుచేశారు. ఈమేరకు ఈవో శ్యామలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీలో గత ప్రభుత్వం చేపట్టిన రివర్స్ టెండరింగ్ విధానాన్ని కూటమి ప్రభుత్వం ఇటీవల రద్దు చేసింది. దీంతో అదే విధానాన్ని అనుసరిస్తూ తాజాగా టీటీడీలో ఈవో చర్యలు చేపట్టారు. ఏపీ సీఎం చంద్రబాబు తిరుమల పర్యటన ముగిసిన వెంటనే ఈ ఉత్తర్వులు రావడం గమనార్హం.

**రివర్స్ టెండరింగ్ పేరుతో నెయ్యి నాణ్యతను భ్రష్టు పట్టించారు: నీలాయపాలెం విజయ్‌కుమార్**

**మంగళగిరి:** గత ప్రభుత్వ హయాంలో రివర్స్ టెండరింగ్ పేరుతో నెయ్యి నాణ్యతను భ్రష్టు పట్టించారని టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. కేవలం ట్రేడింగ్ చేసే నార్త్ ఇండియా సంస్థలకు మాత్రమే కట్టబెట్టారని తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పాల ధర పెరుగుతుంటే నెయ్యి ధర ఎందుకు తగ్గుతుందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో నెయ్యి సరఫరాకు సంబంధించి టెండర్ విధానంలో మొత్తం 9 సంస్థలు బిడ్లు దాఖలు చేశాయని పేర్కొన్నారు. అందులో ఏఆర్ డెయిరీ కెపాసిటీ ఏంటో చూశామని.. పక్క సంస్థల నుంచి నెయ్యి తెచ్చుకునే పరిస్థితి వాళ్లదని చెప్పారు. దొడ్ల, తిరుమల, విజయ, సంగం డెయిరీలు ఇవేమీ జగన్‌కు కనిపించలేదని విజయ్‌కుమార్ దుయ్యబట్టారు.

## ఇంద్రకీలాద్రిపై ఘనంగా దసరా వేడుకలు
### అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు



**విశ్వంబర, విజయవాడ:** ఇంద్రకీలాద్రిపై దసరా వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మూడో రోజు అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. సకల చరాచర సృష్టి కి ప్రాణాధారమైన అన్నం ఈ తల్లిదయ వల్లనే లభిస్తుంది. అందుకే అన్నం పరబ్రహ్మ స్వరూపం అని పెద్దలు చెబుతారు. ఈ రూపంలో ఆది పరా శక్తిని అర్చిస్తే బుద్ధివికాసం, సమయస్ఫూర్తి, బుద్ధి కుశలత, వాక్‌సిద్ధి, శుద్ధి కలుగుతాయి. మానవు ఢ్ని సంపూర్ణుడిగా ఈ తల్లి అనుగ్రహిస్తుంది. అమ్మ ధరించిన అక్షయపాత్ర సకల శుభాలను అందిస్తుంది. బిడ్డల ఆకలి తీర్చడానికి ఆదిపరాశక్తి స్వయంగా అన్న పూర్ణాదేవిగా రావడం ఈ అవ తార విశేషం. పరిపూర్ణమైన చిత్తంతో ఆరాధి ంచిన వారి సమస్తపోషణా భారాన్ని ఈమె స్వ యంగా వహిస్తుంది.

## గన్నవరం విమానాశ్రయంలో శరవేగంగా ఇంటిగ్రేటెడ్ పనులు: ఎంపీ బాలశౌరి



**విశ్వంభర ,విజయవాడ:** గన్నవరం విమానాశ్రయానికి సంబంధించి నూతనంగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ పనులు శరవేగంగా సాగుతున్నాయని ఎంపీబాలశౌరి తెలిపారు. వచ్చే జూన్ నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శనివారంవిజయవాడ అంతర్జాతీయ విమా నాశ్రయ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి కమిటీ ఛైర్మన్ హోదాలో ఎంపీ బాలశౌరి, వైస్ ఛైర్మన్ హోదాలో ఎంపీ కేశినేని శివనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ.. అంతర్జాతీయ విమాన సర్వీసుల పెంపునకు సంప్రదింపులు జరిపామన్నారు. ఇంటిగ్రేటెడ్ టెర్మినల్‌ను జూన్ నాటికి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు కేశినేని శివనాథ్ తెలిపారు. పనుల్లో మరింత పురోగతి సాధించేలా వారాంతపు రివ్యూలు నిర్వహిస్తామన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగిన కుటుంబం.. దంపతులు మృతి

**విశ్వంభర, చిత్తూరు:** :చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు మండలంలో విషాదం చోటు చేసుకుంది. ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఒకే కుటుంబానికి చెందిన నలుగురు పురుగుల మందు తాగారు. గమనిం న స్థానికులు వారిని వెంటనే ఆస్పత్రికి తరలిం చారు. పరిస్థితి విషమించడంతో తమిళ నాడులోని ఆస్పత్రి కితరలిం చారు .చికిత్స పొందుతూ శనివారం నాగరాజారెడ్డి, జయంతి దంపతులు మృతి చెందారు. కుమారుడు, కుమార్తె పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం వారికి వైద్యులుచికిత్స అందజేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## చిత్తు కాగితానికి ఉన్న విలువ ఆడపిల్లలకు లేదా? వరుదు కల్యాణి ధ్వజం



**విశ్వంభర, అమరావతి:** ఏపీ అరాచక ఆంధ్రప్రదేశ్‌గామారిందని వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కల్యాణి విమర్శించారు. కూటమి ప్రభుత్వ పాలనలో రోజురోజుకూ రాష్ట్రంలో మహిళలపై హత్యలు, లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ అని ఎన్నికల ముందు ఊదరగొట్టారని కానీ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రం లోని ఆడపిల్లల మాన ప్రాణాలకు ష్యూరిటీ లేని పరిస్థితి వచ్చిందని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్నసీఎం సొంత జిల్లాలోనే మహిళలు శవాలై తేలుతున్నారని వరుదు కల్యాణి ఆరోపించారు. పుంగనూరులో అంజూమ్ అనే బాలిక హత్యకు గురైతే.. ఇంతవరకు దోషులను పట్టుకోలేదని ప్రశ్నించారు. చంద్రబాబు ఎందుకు బాలిక కుటుంబాన్ని పరామర్శించలేదని నిలదీశారు. ఈ కేసును నీరుగార్చేందుకు ప్రభుత్వ పెద్దలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు పాలనలో చిత్తు కాగితానికి ఉన్న విలువ కూడా మహిళలకు లేదా అని ప్రశ్నించారు. హోం మంత్రి అనిత నియోజకవర్గంలోమహిళను వివస్త్రను చేసి టీడీపీ నాయకులు దాడి చేశారని చెప్పారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ హాస్టల్‌లో సీక్రెట్ కెమెరాలు పెట్టి వీడియోలు చేశారని అమ్మాయిలే ధర్నా చేస్తే కనీసం ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు అక్కడకు వెళ్లి ఏం జరిగిందో తెలుసుకోవాలని కూడా హోంమంత్రి, డీజీపీ ప్రయత్నించలేదని మండిపడ్డారు. దీన్ని బట్టి ఆడపిల్లల మాన ప్రాణాల మీద కూటమి ప్రభుత్వానికి ఎంత నిర్లక్ష్య ధోరణి ఉన్నదో కనిపిస్తుందని విమర్శించారు. ఈ దారుణమైన ఘటనలు అన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఆడ పిల్లల రక్షణ కోసం కూటమి ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. రాష్ట్రంలోమహిళలపై జరుగుతున్న హత్యలు, లైంగిక దాడులపై ఎందుకు పవన్ ప్రశ్నించలేదని నిలదీశారు. ముచ్చుమర్రి, రాంబిల్లి, గుడ్లవల్లేరు ఘటనలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. పుంగనూరు ఘటన జరిగినప్పుడు అయితే పవన్ కల్యాణ్ అదే జిల్లాలోని తిరుపతిలో ఉన్నారని గుర్తుచేశారు. పోలీసులకు డైరెక్షన్ ఇవ్వొచ్చు.. లేదా బాధితకుటుంబం దగ్గరికి వెళ్లి భరోసా ఇవ్వొచ్చు కానీ అవేవీ చేయలేదని విమర్శించారు. ఆడపిల్లల మీద మీకు ఉన్న బాధ్యత ఇదేనా అని ప్రశ్నించారు. ఇది ఆడపిల్లలను అంతమొందించే ప్రభుత్వమని రాష్ట్రంలోని ప్రజలు అనుకుంటున్నారని పేర్కొన్నారు. హత్యలు, లైంగిక దాడులపై ఎందుకు పవన్ ప్రశ్నించలేదని నిలదీశారు.

## ఏపీ మారిటైమ్ బోర్డు ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన దామచర్ల సత్య



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు ఛైర్మన్‌గా తెలుగుదేశం నేత దామచర్ల సత్య శనివారం బాధ్యతలు చేపట్టారు. తనకు అప్పగించిన బాధ్యతలు సమర్థంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. కష్టనష్టాల్లో వెన్నంటే ఉంటూ తను ఈ స్థాయికి వచ్చేందుకు సహకరించిన కొండెపి ప్రజలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మంత్రులు అనిత, అనగాని సత్యప్రసాద్, డోలా బాలవీరాంజనేయస్వామి పలువురు పార్టీ నేతలు సత్యకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ.."రామాయపట్నం, బందరు పోర్టులను వచ్చే 5 ఏళ్లలో పూర్తి చేస్తాం. బోర్డు ద్వారా రూ.20వేల కోట్లు విలువైన అభివృద్ధి పనులు చేపడతాం. రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధికి సీఎం చంద్రబాబు చేసిన కృషి వల్లే ఎన్నో ఉపాధి అవకాశాలు లభించాయి. మత్స్యకారులకు మేలు జరిగేలా ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి బోర్డు ద్వారా కృషి చేస్తాం" అని తెలిపారు.

## ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కొనకళ్ల నారాయణ



విశ్వంభర, అమరావతి: ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్‌గా కొనకళ్ల నారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్ పలువురు తెదేపా నేతలు కొనకళ్లను సత్కరించి అభినందనలు తెలిపారు. కొనకళ్ల నారాయణ గతంలో రెండు సార్లు మచిలీపట్నం ఎంపీగా పనిచేశారు. తెదేపా, జనసేన, భాజపా కూటమి పొత్తులో మచిలీపట్నం ఎంపీ సీటు జనసేనకు కేటాయించడంతో నారాయణకు టికెట్ దక్కలేదు. దీంతో అధిష్ఠానం అయనను ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమించింది.

## సీబీఐ ఎంక్వైరీకి నేను రెడీ.. నువ్వు రెడీనా? సోమిరెడ్డికి మాజీ మంత్రి కాకాణి సవాల్




**విశ్వంభర, నెల్లూరు:** టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి మాజీ మంత్రి కాకాణి గోవర్దన్ రెడ్డి సవాలు విసిరారు. ఇసుక అక్రమ రవాణాలో తనకు సంబంధం ఉందని సోమిరెడ్డి చేస్తున్న ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు నకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తానుతప్పు చేసినట్లు నిరూపించే దమ్ము సోమిరెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. నెల్లూరులో మాజీ మంత్రి కాకాణి మీడి యాతో మాట్లాడుతూ.. తాను చెప్పిన పనులు అధికారులు చేయడం లేదని ఎమ్మెల్యే సోమిరెడ్డి ఫ్రస్టే షన్‌లో ఉన్నారని అన్నారు. తాను చెప్పిన వారిని కేసుల్లో ఇరికించడం లేదని ఆయన బాధపడు తున్నారని ఆరోపించారు. సోమిరెడ్డి బతుకు అంతా అవినీతిమయమే అని విమర్శించారు. తనపై సోమిరెడ్డి చేస్తున్న ఆరోపణలు అన్నీ అవాస్తవమే అని చెప్పారు. కేసులు, అరె స్టులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దొంగ కేసులు పెట్టి ఇబ్బంది పెడితే మా ప్రభుత్వం వచ్చిన తర్వాత మంచం లో పడుకొని ఉన్నా లాక్కొస్తామని హెచ్చరించారు. నాపై చేస్తున్న అవినీతి ఆరోపణల్లో ఒక్కదానిని అయినా రుజువు చేయగలవా అని సోమిరెడ్డిని కాకాణి ప్రశ్నించారు. దమ్ము ధైర్యం ఉంటే నేను అవినీతి చేసినట్లు నిరూపించు అని సవాలు విసిరారు. సూరాయిపాలెం ఇసుక రీచ్‌లో జరుగుతున్న తవ్వకాలపై గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్తామని తెలిపారు. నీరు చెట్టులో జరిగిన అవినీతి మీద విచారణకు ఆదేశిస్తే అధికారుల ఉద్యోగాలు పోతాయని మానవత్వంతో వెనక్కి తగ్గానని తెలిపారు. మైనింగ్ కాంట్రాక్టర్లతో చంద్రబాబు దగ్గరకు వెళ్తే సోమిరెడ్డికి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. సోమిరెడ్డి అవినీతి మీద విచారణ చేయాలని కోరారు. నేను చేస్తున్న ఆరోపణలపై సీబీఐ దర్యాప్తును ఎదుర్కొనే దమ్ముందా అని ప్రశ్నించారు.

# వైఎస్ఆర్ జిల్లా పేరు మార్చండి

## చంద్రబాబుకు మంత్రి సత్యకుమార్ లేఖ



**విశ్వంభర, కడప:** వైఎస్ఆర్ జిల్లా పేరును మార్చాలని ఏపీ మంత్రి సత్యకుమార్ కోరారు. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడికి మంత్రి లేఖ రాశారు. వైఎస్ఆర్ జిల్లాగా ఉన్న కడప జిల్లాను వైఎస్ఆర్ కడపగా గెజిట్‌లో మార్చాలని విజ్ఞప్తి చేశారు. కలియుగ దైవం వేంకటేశ్వరుడి సన్నిధికి చేరడానికి తొలి గడప కడప అని మంత్రి సత్యకుమార్ అన్నారు. ఒక చారిత్రక నేపథ్యం, ఆధ్యాత్మిక ప్రాశస్త్యం ఉన్నాయని.. వీటి పట్ల కనీస అవగాహన లేని మాజీ సీఎం వైఎస్ జగన్ పేర్ల పిచ్చితో జిల్లా పేరు వైఎస్ఆర్ జిల్లాగా మార్చడం తప్పు అని విమర్శించారు. అందుకే కడప జిల్లా ప్రజల మనోభావాల మేరకు జిల్లా పేరును గెజిట్‌లో మార్పులు చేసి గతంలో జరిగిన తప్పును సరిదిద్దాల్సిందిగా కోరారు. ఈ మేరకు కడప జిల్లాకు ఉన్న విశిష్టతను ఆయన లేఖలో వివరించారు.

' పూర్వం ఈ ప్రాంతమంతా రాక్షస నిలయంగా ఉండేది. ఈ ప్రాంత వాసులకు దానవ పీడ తొలగించడానికి మత్స్యావతారంలో ఆవిర్భావించాడు. ఇక్కడికి ఒకసారి కృపాచార్యుల వారు తీర్థయాత్రలు చేస్తూ వచ్చారు. ఈ హనుమత్ క్షేత్రంలోనే బస చేశారు. అక్కడి నుంచి తిరుమల వెళ్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలని సంకల్పించారు. కానీ కొన్ని పరిస్థితుల వల్ల ముందుకు సాగలేకపోయారు. దీంతో శ్రీవారి దర్శనం కోసం కృపాచార్యులు తపించిపోయారు. ఆ తర్వాత ఆయన శ్రీవారి కృపను పొందారు. తనలాగే శ్రీవారి దర్శనానికి వెళ్లలేకపోయిన నిస్సహాయుల కోసం తిరుమల శ్రీవారి ప్రతిరూపాన్ని ఈ క్షేత్రంలో కృపాచార్యులు ప్రతిష్టించారు. శ్రీవారి ఆదేశానుసారం హనుమంతుడి విగ్రహం ముందు ప్రతిష్టించబడిన శ్రీవేంకటేశ్వర స్వామి భక్త వత్సలుడై ఇక్కడ పూజలు అందుకుంటున్నాడు. నాటి నుంచి తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వెళ్లే భక్తులు ముందుగా ఇక్కడి స్వామివారిని దర్శించుకోవడం ఆచారంగా మారింది. కృపాచార్యులు స్వామి వారి కృప పొందిన ప్రదేశం కాబట్టి ఈ ప్రాంతానికి కృపావతిగా నామకరణం చేశారు. ఆ కృపావతి కురపగా, కుడపగా క్రమేపి కడపగా ప్రసిద్ధి చెందింది. దీనిపై అవగాహనరాహిత్యంతో గత ప్రభుత్వం కడప జిల్లా పేరును వైఎస్ఆర్ జిల్లాగా మార్చింది. ' అని మంత్రి సత్యకుమార్ తన లేఖలో పేర్కొన్నారు. ఈ పరిణామంపై శ్రీవారి భక్తుల మనసులు నొచ్చుకున్నాయని.. కానీ భయంతో ఎవరూ తమ అభిప్రాయాన్ని బయటపెట్టలేకపోయారని మంత్రి సత్యకుమార్ అన్నారు. సీఎంగా ఉన్న సమయంలో కడప జిల్లా అభివృద్ధికి వైఎస్ఆర్ చేసిన అభివృద్ధిని ఎవరూ కాదనలేరని చెప్పారు. అందుకే కడప చారిత్రక నేపథ్యాన్ని, వైఎస్ఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని జిల్లాను వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్చాలని విజ్ఞప్తి చేశారు.

## ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై మదురైలో కేసు




**విశ్వంభర, మదురై:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై మదురైలో కేసు నమోదు అయ్యింది. తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయానిధి స్టాలిన్‌ను ఉద్దేశించి పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు గాను మదురైలోని కమిషనరేట్‌లో వాంజినాథన్ అనే న్యాయవాది కంప్లయింట్ ఇచ్చాడు. సనతాన ధర్మంపై ఉదయానిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను పవన్ వక్రీకరించి మాట్లాడాడని ఫిర్యాదులో తెలిపాడు. వెంటనే అతడిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరాడు. అసలు ఏం జరిగిందంటే..తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయానిధి స్టాలిన్ సనాతన ధర్మంపై గత ఏడాది సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. సనాతన నిర్మూలన సభలో ముఖ్య అతిథిగా హాజరైన స్టాలిన్ మాట్లాడుతూ.. మనం డెంగ్యూను, దోమలను, మలేరియాను లేదా కరోనాను వ్యతిరేకించలేం. వాటిని నిర్మూలించాల్సిందే. అలాగే సనాతన ధర్మాన్ని కూడా నిర్మూలించాలని ఉదయనిధి చెప్పారు. సనాతన అంటే సంస్కృతం నుంచి వచ్చిందని, ఇది సాంఘిక న్యాయం, సమానత్వాలకు, మహిళా సాధికారతకు వ్యతిరేకమని ఉదయనిధి స్టాలిన్ స్పష్టం చేశారు. అయితే.. ఈ వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇవ్వగా, బీజేపీ నాయకులు అప్పుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఇదే వ్యాఖ్యలపై తాజాగా పవన్ కళ్యాణ్ స్టాలిన్‌ను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేయడంతో పాటు పరో క్షంగా స్టాలిన్‌కు వార్నింగ్ ఇచ్చారు. పవన్‌మాట్లాడుతూ.. సనాతన ధర్మాన్ని ఎవరూ తుడిచిపెట్టలే రని, సనాతన ధర్మాన్ని తుడిచిపెట్టాలనుకున్న వారే తుడిచిపెట్టుకు పోతారని పవన్ కళ్యాణ్ వారాహి డిక్లరేషన్ సభలో ప్రకటించారు. దీంతో ఈ వ్యాఖ్యలపై అటు తమిళనాడు డీఎంకే నేతలకు ఇటు జనసేన నేతలకు సోషల్ మీడియాలో వార్ జరుగుతుంది. మరోవైపు సనాతన ధర్మం గురించి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మీ స్పందన ఏమిటి..? అని మీడియా ప్రతినిధులు ఉదయనిధి స్టాలిన్‌ను ప్రశ్నించగా.. ఆయన ఏక వాక్యంలో ముక్తసరిగా 'ఏం జరుగుతుందో చూద్దాం' అని వ్యాఖ్యానించారు.

# ఈ ప్రభుత్వ తప్పును మాకు అంటగాడుతున్నారు..

## టీడీపీపై మాజీ మంత్రి కురసాల సీరియస్



**విశ్వంభర, కాకినాడః** దేవుడిని కూడా టీడీపీ రాజకీయాల్లోకి లాగిందని మాజీ మంత్రి కురసాల కన్నబాబు విమర్శించారు. ఈ ప్రభుత్వంలో జరిగిన తప్పిదాన్ని గత ప్రభుత్వానికి అంటగడుతున్నారని మండిపడ్డారు. కాకినాడలో కురసాల మీడియాతో మాట్లాడుతూ.. లడ్డూ విషయంలో టీడీపీ దుష్ప్రచారం చేస్తూనే ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల మనోభావాలకు టీడీపీ భంగం కలిగించిందని కన్నబాబు అన్నారు. గత ప్రభుత్వంపై బురద జల్లి రాద్ధాంతం చేశారని మండిపడ్డారు. సుప్రీంకోర్టు చివాట్లు పెట్టిన తర్వాత కూడా చంద్రబాబు అండ్ కో కట్టుకథలు ప్రచారం చేస్తూనే ఉన్నారని విమర్శించారు. జగన్‌ను తగ్గిస్తున్నామని అనుకుంటూ.. టీటీడీ విశిష్టతను దెబ్బతీస్తున్నారని ఆయన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని కన్నబాబు అన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేసేందుకు టీడీపీ కుట్రలు చేస్తుందని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్‌లో నాలుగువేల ఉద్యోగులను తొలగిస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసి మంచి ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటుందని విమర్శించారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలపై భారం పడుతుందని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిత్యవసర వస్తువుల ధరలు పెరిగితే.. మార్కెట్ స్థిరీకరణ నిధులతో తక్కువగా ప్రజలకు అందించామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ధరలు ఎక్కడైనా తగ్గించారా అని ప్రశ్నించారు.

# 27 ఏళ్ల తర్వాత ఇరానీ కప్ గెలిచిన ముంబయి




**లఖ్‌నవూ :** 2024 ఇరానీ టైటిల్ ముంబయి దక్కించుకుంది. టోర్నీలో భా గంగా రెస్టాఫ్ ఇండియా ముంబయి మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో 121 పరుగుల ఆధిక్యం సంపాదించిన ముంబయి విజేతగా నిలిచింది. ముంబయి తొలి ఇన్నింగ్స్‌లో 537 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 329 పరుగులు చేసింది. రెస్టాఫ్ ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 416 పరుగులు చేసింది. డబుల్ సెంచరీతో అదరగొట్టిన ముంబయి బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. కాగా, ఇరానీ కప్‌ను ముంబయి 15వ సారి కైవసం చేసుకోవడం విశేషం. ఐదో రోజు ఓవర్‌నైట్ స్కోర్ 153 6తో ఆట కొనసాగించిన ముంబయి, 329 8తో నిలిచింది. ముంబయి రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌లో తనుష్ కొటియన్ (114* పరుగులు), పృథ్వీ షా (76 పరుగులు), మోహిత్(51* పరుగులు) చేశారు. తనుష్ మోహిత్ జోడీ తొమ్మిదో వికెట్‌కు 151 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. అయితే, మ్యాచ్‌లో ఫలితం తేలే అవకాశం లేకపోవడం వల్ల డ్రా గా ముగిస్తున్నట్లు ప్రకటించారు. రెండో ఇన్నింగ్స్‌లో రెస్టాఫ్ ఇండియా బౌలర్ సరాంశ్ జైన్ 6 వికెట్లు దక్కించుకున్నాడు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో ముంబయి 537 పరుగుల భారీ స్కోర్ సాధించింది. యంగ్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ (222* పరుగులు) డబుల్ సెంచరీకి తోడు కెప్టెన్ అజింక్యా రహానే (97 పరుగులు), శ్రేయస్ అయ్యర్ (57 పరుగులు), తనుష్ కొటియన్ (64 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఇక తొలి ఇన్నింగ్స్‌లో ముకేశ్ కుమార్ 5 వికెట్ల ప్రదర్శనతో అదరగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్టాఫ్ ఇండియా 416 పరుగులకు ఆలౌటైంది. అభిమన్యు ఈశ్వరన్ (191 పరుగులు) త్రుటిలో డబుల్ సెంచరీ మిస్ అవ్వగా, ధ్రువ్ జురెల్ (93 పరుగులు) సెంచరీకి దగ్గరలో ఔటయ్యాడు. ఇషాన్ కిషన్ (38 పరుగులు) పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు.

## ఉత్కంఠ పోరులో బంగ్లాదేశ్ ఓటమి




**విశ్వంభర, క్రీడావిభాగం :** మహిళల టీ20 వరల్డ్ కప్‌లో పెద్ద సంచలనం తప్పింది. తొలి పోరు స్కాట్లాండ్‌పై విజయంతో బోణీ కొట్టిన బంగ్లాదేశ్ రెండో మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను ఓడించినంత పని చేసింది. అయితే.. మిడిల్ ఓవర్లలో ఒత్తిడికి తలొగ్గి చేజేతులా ఓడింది. లో స్కోరింగ్ మ్యాచ్‌లో మాజీ చాంపియన్ ఇంగ్లండ్‌కు ముచ్చెమటలు పట్టించినంది. ఫీల్డింగ్, బౌలింగ్‌లో అద్భుతంగా రాణించిన ఇంగ్లండ్ 21 పరుగుల తేడాతో గెలుపొంది వరల్డ్ కప్‌లో బోణీ కొట్టింది. కొట్టింది తక్కువ స్కోరే అయిన బౌలింగ్‌లో ఇంగ్లండ్ అద్భుతం చేసింది. నలుగురు స్పిన్నర్లతో ఆడిన హీటర్ నైట్ బృందం బంగ్లా నుంచి విజయాన్ని లాగేసుకుంది. స్వల్ప ఛేదనలో శోభన మొస్త్రే(44), కెప్టెన్ నిగర్ సుల్తానా(15)లు అద్భుతంగా ఆడారు. అయితే.. ఇంగ్లండ్ స్పిన్నర్లు లిన్సే స్మిత్(211), చార్లొట్టె డీన్(222)లు వరుస విరామాల్లో వికెట్లు తీసి బంగ్లాను ఒత్తిడిలో పడేశారు. సుల్తానా ఔటయ్యాక ఓ ఒక్కరూ క్రీజులో నిలవలేకపోయారు. దాంతో, గెలవాల్సిన మ్యాచ్‌లో బంగ్లా 21 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. మొదట ఆడిన ఇంగ్లండ్ 118 పరుగులే చేసింది. వరల్డ్ క్లాస్ బ్యాటర్లో కూడిన ఇంగ్లీష్ టీమ్‌ను స్వల్ప స్కోర్‌కే పరిమితం చేసింది. బంతి టర్న్ కావడంతో రెచ్చిపోయిన స్పిన్నర్లు నహిదా అక్తర్(232), ఫహిమా ఖాతూన్(218)లు వరుస వికెట్లతో వణుకు పుట్టించారు. ఈ ఇద్దరి ధాటికి సహచర అమ్మాయిలంతా డగౌట్ చేరుతుంటే ఓపెనర్ డానియల్ వ్యాట్ (43) మాత్రం ఒంటరి పోరాటం చేసింది. ఆఖర్లో వికెట్ కీపర్ అమీ జోన్స్() ధనాధన్ ఆడడంతో ఇంగ్లండ్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది.

### మహిళల టీ20 ప్రపంచకప్ 2024లో

## భారత్ సెమీస్‌కు చేరాలంటే..?

**దుబాయ్:** మహిళల టీ20 ప్రపంచకప్ 2024లో హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగిన భారత్.. ఓటమితో ఈ టోర్నీని ప్రారంభించింది. శుక్రవారం న్యూజిలాండ్‌తో జరిగిన తమ తొలి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా 58 పరుగుల తేడాతో చిత్తయ్యింది. న్యూజిలాండ్ నిర్దేశించిన 161 పరుగుల లక్ష్యచేధనకు దిగిన టీమిండియా అనూహ్యంగా 102 పరుగులకే కుప్పకూలి ఘోర పరాభావాన్ని మూటగట్టుకుంది. ఈ ఓటమి టీమిండియా సెమీస్ అవకాశాలను సంక్లిష్టంగా మార్చింది. ఈ టోర్నీలో గ్రూప్‌ఏలో ఉన్న భారత్.. తమ తదుపరి మ్యాచ్‌ల్లో పాకిస్థాన్, శ్రీలంక, ఆస్ట్రేలియాతో తలపడనుంది. హర్మన్‌సేన సెమీస్ చేరాలంటే ఈ మూడు మ్యాచ్‌లు గెలవడంతో పాటు మెరుగైన రన్‌రేట్ సాధించాలి. న్యూజిలాండ్ చేతిలో ఎదురైన ఘోర పరాజయంతో భారత్ రన్‌రేట్ 2.900 నెగటీవ్‌గా మారింది.
ప్రస్తుతం భారత్ గ్రూప్‌ఏలో చిట్ట చివరి స్థానంలో ఉంది. చివరి మూడు మ్యాచ్‌లు గెలిచినా.. ఇతర జట్ల నెట్ రన్‌రేట్‌పై భారత్ సెమీస్ అవకాశాలు ఆధారపడి ఉంటాయి. ప్రతీ గ్రూప్ నుంచి రెండేసి జట్లు సెమీస్‌కు అర్హత సాధించనున్నాయి. గ్రూప్ఏ నుంచి డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా సెమీస్ బెర్త్ దక్కించుకోవడం ఖాయం. మరో బెర్త్ కోసం భారత్.. పాకిస్థాన్, శ్రీలంక, న్యూజిలాండ్‌తో పోటీపడాల్సి ఉంది.
భారత్ సెమీస్ చేరాలంటే ఆస్ట్రేలియా మినహా మిగతా జట్లు రెండేసి మ్యాచ్‌లు ఓడాలి. వాటి రన్‌రేట్ మనకంటే తక్కువగా ఉండాలి. అప్పుడే భారత్‌కు సెమీస్ బెర్త్ దక్కుతుంది. లేకుంటే ఇంటిదారి పడుతోంది. టీమిండియా తమ తుదపరి మ్యాచ్ ఆదివారం పాకిస్థాన్‌తో ఆడనుంది.



### టీమిండియా-బంగ్లాదేశ్ టీ20 సిరీస్‌లో

## హైదరాబాద్ కుర్రాడు తిలక్ వర్మకు ఛాన్స్



**విశ్వంభర, క్రీడావిభాగం :** బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌కు టీమ్‌ఇండియా యంగ్ బ్యాటర్ శివమ్ దూబే దూరమయ్యాడు. వెన్నునొప్పితో బాధపడుతున్న దూబే సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. దూబే స్థానాన్ని తెలుగు కుర్రాడు తిలక్ వర్మ భర్తీ చేయనున్నాడు. ఈ మేరకు బీసీసీఐ ప్రకటించింది. ఇక తిలక్ ఆదివారం ఉదయం గ్వాలియర్‌లో టీమ్‌ఇండియాతో కలుస్తాడని బోర్డు పేర్కొంది. దీంతో బంగ్లాతో సిరీస్‌లో నితీశ్ రెడ్డితో సహా తెలుగు ప్లేయర్ల సంఖ్య రెండుకు చేరింది.

**టీ20 కెరీర్**

యంగ్ బ్యాటర్ తిలక్ వర్మ 2023 అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. ఆగస్టులో వెస్టిండీస్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో తిలక్ ఆడాడు. అప్పట్నుంచి ఇప్పటిదాకా తిలక్ 16 టీ20ల్లో టీమ్‌ఇండియాకు ప్రాతినిధ్యం వహించాడు. 15 ఇన్నింగ్స్‌ల్లో 139.42 స్ట్రైక్ రేట్‌తో 336 పరుగులు చే శాడు. ఇందులో రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అతడి అత్యధిక స్కోర్ 55 పరుగులు.

**ఓపెనింగ్ జోడీ ఫిక్స్**

ఈ సిరీస్‌కు కేవలం ఒకే స్పెష్టలిస్ట్ ఓపెనర్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. అది అభిషేక్ శర్మ. అయితే అభిషేక్‌తో పాటు వికెట్ కీపర్ సంజూ శాంసన్ ఇన్నింగ్స్ ప్రారంభించవచ్చని మొదట్నుంచి ప్రచారం సాగింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఈ ఉత్కంఠకు తెరదించాడు. అందరూ అనుకున్నట్లుగానే అభిషేక్‌తోపాటు శాంసన్ ఓపెనర్‌గా రానున్నాడని సూర్య వెల్లడించాడు.

**షెడ్యూల్**

తొ లి టీ20 మ్యాచ్ అక్టోబర్ 06న గ్వాలియర్‌లో, రెండోది అక్టోబర్ 09న న్యూ ఢిల్లీ, మూడో టీ20 అక్టోబర్ 12న హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు.

భారత్ జట్టు : సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), రింకు సింగ్, హార్దిక్ పాండ్యా, రియాన్ పరాగ్, నితీష్ కుమార్ రెడ్డి, తిలక్ వర్మ, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, జితేష్ శర్మ (వికెట్ కీపర్), అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా, మయాంక్ యాదవ్

బంగ్లా జట్టు: నజ్ముల్ హొస్సేన్ షాంటో (కెప్టెన్), తాంజిద్ హసన్ తమీమ్, పర్వేజ్ హుస్సేన్ ఎమోన్, తౌహిద్ హృదయ్, మహ్మదుల్లా, లిట్టన్ కుమార్ దాస్, జాకర్ అలీ అనిక్, మెహిదీ హసన్ మిరాజ్, మెహదీ హసన్, రిషద్ హుస్సేన్, ముస్తాఫిజుర్ రహ్మాద్, తస్రీకిన్ అహ్మద్, తస్రీకిన్ అహ్మద్ , రకీబుల్ హసన్

## 'దేవుడి ప్లాన్' అంటూ రింకూ సింగ్ కొత్త టాటూ




**విశ్వంభర, క్రీడావిభాగం :** ఉత్తరప్రదేశ్‌లో ఎక్కడో మారుమూల గ్రామంలో పుట్టిన యువ సంచలనం రింకూ సింగ్, ఇవాళ టీమిండియాలో కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు. ఈ ప్రస్థానం వెనుక తన శ్రమ మాత్రమే కాక దేవుడి ప్లాన్ కూడా ఉందంటున్నాడతను. ఈ నేపథ్యంలోనే తన చేతిపై 'గాడ్స్ ప్లాన్' అంటూ పచ్చబొట్టు వేయించుకున్నట్టు తెలిపాడు. ఈ పచ్చబొట్టు వెనుక ఉన్న నిజమైన కథను రింకూ తాజాగా పంచుకున్నాడు. ఆ వీడియోను బీసీసీఐ విడుదల చేసింది.
వీడియోలో రింకూ సింగ్ మాట్లాడుతూ... "నేను తరచుగా చెప్పే ఒక సామెత అందరికీ బాగా తెలుసు. అదే దేవుని ప్రణాళిక (గాడ్స్ ప్లాన్). కొన్ని వారాల క్రితం దాని ఆధారంగానే పచ్చబొట్టు వేయించుకున్నాను. దేవుడి ప్లాన్ కారణంగానే ఇప్పుడు అందరూ నన్ను గుర్తు పడుతున్నారు. అది శాశ్వతంగా ఉండాలనే ఇలా చేతిపై పచ్చబొట్టు రూపంలో వేయించుకున్నాను. ఇక ఈ టాటూలో నేను ఐపీఎల్‌లో కొట్టిన 5 సిక్స్‌లు ఉన్నాయి. ఆ సిక్సులే నన్ను టీమిండియా తలుపులు తట్టేలా చేశాయి" అని రింకూ సింగ్ చెప్పుకొచ్చాడు.
ఇక ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) ఫ్రాంచైజీకి ఆడే ఈ యువ బ్యాటర్ పలుమార్లు తుపాను ఇన్నింగ్స్‌లతో ఆ జట్టుకు ఎన్నో మరపురాని విజయాలు అందించాడు. ఆఖరి ఓవర్లలో క్రీజులోకి వచ్చి మంచి ఫినిషర్‌గా పేరు తెచ్చుకున్నాడు.
కాగా, 2023 ఐపీఎల్ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ (జీటీ)పై రింకూ ఆడిన ఇన్నింగ్స్‌ను ఎవరూ అంత సులువుగా మరిచిపోలేరు. ఓడిపోతుందనుకున్న మ్యాచ్‌ను వరుసగా ఐదు భారీ సిక్సర్లు కొట్టి ఊహించని విజయాన్ని అందించాడు. ఆ విజయం అతని జీవితాన్ని శాశ్వతంగా మార్చివేసింది. ఆ ఇన్నింగ్స్ కారణంగా రింకూకు ఏకంగా భారత క్రికెట్ జట్టు నుంచి పిలుపు వచ్చింది. దాంతో ప్రస్తుతం టీ20ల్లో టీమిండియా తరపున ఆకట్టుకునే ప్రదర్శనలు చేస్తున్నాడు. ఇక ఈ ఆదివారం గ్వాలియర్‌లో బంగ్లాదేశ్‌తో జరగనున్న తొలి టీ20 మ్యాచ్‌కి భారత తుది జట్టులో రింకూ సింగ్ ఆడే అవకాశం ఉంది.

## టీ20 ప్రపంచ కప్‌లో బోణి కొట్టిన ఆస్ట్రేలియా..




**విశ్వంభర, క్రీడావిభాగం :** మహిళల టీ20 ప్రపంచ కప్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. షార్జా వేదికగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 93 పరుగులే చేసింది. ఈ లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా తొలుత తడబడినా.. తర్వాత పుంజుకుని విజయాన్ని అందుకుంది. 14.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి టార్గెట్‌ని ఛేదించింది. ఓపెనర్ బెత్ మూనీ (43; 38 బంతుల్లో 4 ఫోర్లు) రాణించింది. ఎల్లీస్ పెర్రీ (17), ఆష్లీన్ గార్డ్‌నర్ (12) పరుగులు చేశారు. శ్రీలంకకు వరుసగా ఇది రెండో ఓటమి. శ్రీలంక బ్యాటర్లలో హర్షిత సమరవిక్రమ (23), నీలాక్షి డి సిల్వా (29), అనుష్క సంజీవని (16) పరుగులు చేయగా.. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. విష్మి గుణరత్నే(0), చమరి ఆటపట్టు (3), కవిషా దిల్హారి (5), హాసిని పెరీరా (6) ఘోరంగా విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మెగాన్ షెట్ 3, మోలినెక్స్ 2, ఆష్లీ గార్డనర్, జార్జియా వేర్‌హామ్ తలో వికెట్ పడగొట్టారు.

---

## టెక్స్ట్ ఇస్తే చిటికెలో వీడియో జనరేషన్
## ఓపెన్ ఏఐకి పోటీగా మెటా మూవీ జెన్ ఏఐ



**విశ్వంభర, బిజినెస్ :** ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా కొత్త తరహా సేవలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు చాట్‌బాట్, ఫొటో జనరేషన్ సేవలకు పరిమితమైన సంస్థ తాజాగా వీడియో జనరేషన్ సదుపాయాన్ని పరిచయం చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా టెక్స్ట్ సాయంతో వీడియోలు, ఆడియో క్లిప్‌లు రూపొందించవచ్చని తెలిపింది. మూవీ జెన్ ఏఐ పేరిట దీన్ని తీసుకొచ్చింది. దీంతో చాట్‌జీపీటీ, లెవన్‌ల్యాబ్స్ వంటి ప్రముఖ వీడియో జనరేషన్ స్టార్టప్‌లను ఇది పోటీగా నిలవనుంది.
మూవీ జన్ ఏఐ సాయంతో సులభంగా వీడియో జనరేట్ చేయొచ్చు. కేవలం మీ ఊహలకు తగ్గట్టుగా ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా ప్రాంప్ట్ ఇస్తే చాలు. జెన్‌ఏఐ సాయంతో 16 సెకన్ల పాటు వీడియోను రూపొందించవచ్చని మెటా ఏఐ బ్లాగ్‌లో వివరంగా పేర్కొంది. ఇక 45 సెకన్ల పాటు ఆడియోను క్రియేట్ చేస్తుందని తెలిపింది. వీడియో జనరేట్ చేయడంతో పాటు కంటెంట్‌కు తగ్గట్టుగా బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, సౌండ్ ఎఫెక్ట్‌లను కూడా మూవీ జెన్‌ఏఐ జోడిస్తుంది. ఈ విషయాన్ని మెటా తన బ్లాగ్ పోస్ట్‌లో పంచుకుంది. జెన్‌ఏఐ సాయంతో రూపొందించిన వీడియోలు, ప్రాంప్ట్‌లను అందులో పోస్ట్ చేసింది.
ఉదాహరణకు.. ఒక చిన్న పిల్లవాడు స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్ చేస్తున్నాడు అని ప్రాంప్ట్ ఇస్తే. అచ్చం అలానే వీడియో జనరేట్ చేస్తుంది. తర్వాత ఆ బాలుడు తన చేతిలో బొమ్మని పట్టుకున్నాడు, స్విమ్మింగ్ సూట్ వేసుకున్నాడు అని ప్రాంప్ట్‌ను జోడిస్తే, టెక్స్ట్‌కు తగ్గట్టుగా వీడియోను ఎడిట్ చేసేస్తుంది. అలా మన ఊహలకు తగ్గట్లు ప్రాంప్ట్ ఇచ్చి వీడియోను క్రియేట్ చేయొచ్చు. అయితే డెవలపర్ల బహిరంగ వినియోగం కోసం మూవీ జెన్ ఏఐని తీసుకురాబోమని మెటా స్పష్టం చేసింది. దుర్వినియోగం అయ్యే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ఎంటర్‌టైన్‌మెంట్ కమ్యూనిటీకి మాత్రమే అందుబాటులోకి తేనుంది. ఇప్పటికే ఓపెన్‌ఏఐ సైతం చాట్‌జీపీటీ సాయంతో వీడియో జనరేషన్ సదుపాయాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. సొరా పేరిట తీసుకొచ్చిన ఈ మోడల్.. ప్రాంప్ట్ ఆధారంగా హై డీటెయిల్స్ కలిగిన 60 సెకన్ల వీడియోను క్రియేట్ చేస్తుందని ఆవిష్కరణ సమయంలో కంపెనీ తెలిపింది.

# తలసరి ఆదాయాన్ని రెట్టింపు చేస్తాం

- చర్యలు తీసుకుంటున్న కేంద్రం
- 'కౌటిల్య ఎకనమిక్ కాంక్లేవ్' లో నిర్మలా సీతారామన్



**దిల్లీ:** వచ్చే కొన్నేళ్లలో తలసరి ఆదాయాన్ని రెట్టింపు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో భారత్‌లో జీవన ప్రమాణాలు భారీ స్థాయిలో పెరగనున్నాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. 'కౌటిల్య ఎకనమిక్ కాంక్లేవ్' మూడో ఎడిషన్‌నుద్దేశించి ఆమె మాట్లాడారు.

**అసమానతలు తగ్గుతున్నాయ్..**

పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ అసమానతలు తగ్గుతున్నాయి. అసమానతలకు ప్రామాణికంగా భావించే 'జిని కోషియెంట్' తగ్గుతూ వస్తోంది. గత 10 ఏళ్లలో చేపట్టిన ఆర్థిక, నిర్మాణాత్మక సంస్కరణల ప్రభావం కొనసాగుతుందనే భావిస్తున్నా. రాబోయే కొన్నేళ్లలో అది మరింత స్పష్టంగా కనిపిస్తుంది. 2,730 డాలర్ల తలసరి ఆదాయాన్ని చేరడానికి మనకు 75 ఏళ్లు పట్టింది. కానీ మరో అయిదేళ్లలోనే దీనికి మరో 2,000 డాలర్లను జత చేయగలం. రాబోయే దశాబ్దాల్లో అయితే సామాన్యుడి జీవన ప్రమాణాలు అత్యున్నత స్థాయికి చేరతాయి. 140 కోట్ల మంది జనాభా గల భారత్‌లో తలసరి ఆదాయాన్ని రెట్టింపు చేయడానికే ప్రభుత్వం కృషి చేస్తోంది.

**2047 నుంచి కొత్త యుగం..**

మనకు స్వాతంత్ర్యం వచ్చి 2047కు 100 ఏళ్లు అవుతుంది. ఆ సమయానికి ఒక కొత్త భారత యుగం మొదలవుతుంది. అభివృద్ధి చెందిన దేశాలకు సమాన లక్షణాలు ఇక్కడా కనిపిస్తాయి. 'వికసిత్ భారత్' వల్ల కేవలం భారతీయులకే కాక.. యావత్ ప్రపంచానికి ఆలోచనలు, సాంకేతికత, సంప్రదాయాల మార్పిడికి భారత్ ఒక కేంద్రంగా మారుతుంది.

**బ్యాంకింగ్ రంగం బలంగా..**

భారత బ్యాంకింగ్ రంగం బలంగా ఉంది. ఆస్తుల నాణ్యత మెరుగైంది. మొండి బకాయిలకు కేటాయింపులు పెంచగలిగారు. కనీస మూలధన నిల్వలు, లాభదాయకత రాణించాయి. దీంతో మొండి బకాయిల నిష్పత్తి పలు సంవత్సరాల కనిష్ఠానికి చేరింది. బ్యాంకుల వద్ద ఇపుడు సమర్థమైన రుణ రికవరీ వ్యవస్థలూ ఉన్నాయి. భారత్‌లో ఉన్న యువ జనాభా వల్ల ఉత్పాదకత పెరుగుతోంది. వచ్చే రెండు దశాబ్దాల పాటు భారత యువ వాటా వృద్ధి చెందనుంది. ప్రస్తుతం 43% భారతీయులు 24 ఏళ్ల కంటే తక్కువ వయసున్నవారే.

**సబ్సిడీల ఖర్చు తగ్గింది..**

ద్రవ్యలోటును తగ్గించడానికి కేంద్రం కట్టుబడి ఉంది. కిందటేడాది జీడీపీలో 5.6 శాతంగా ఉన్న ద్రవ్యలోటును 202425లో 4.9 శాతానికి పరిమితం చేసే లక్ష్యంతో ఉన్నాం. మౌలిక పెట్టుబడులను 17.1% పెంచి రూ.11.1 లక్షల కోట్లకు చేర్చాం. కమొడిటీ ధరలు తగ్గడం వల్ల ఎరువులు, ఇంధన సబ్సిడీలకు చేయాల్సిన ఖర్చులు తగ్గాయి. మౌలిక, బ్యాంకింగ్, వాణిజ్య విధానం, పెట్టుబడులు, సులభతర వాణిజ్యం.. ఇలా అన్ని రంగాల్లో సంస్కరణలకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది.

## ఫేక్ వెబ్‌సైట్లకు గూగుల్ చెక్

### సెర్చ్ రిజల్ట్స్ లో వాటికి వెరిఫైడ్ బ్యాడ్జ్

**దిల్లీ:** గూగుల్‌లో ఏ అంశం గురించి సెర్చ్ చేసినా దాని తాలూకా నకిలీ ఖాతాలు దర్శనమిస్తుంటాయి. అది కంపెనీ అధికారిక ఖాతానేనా? కాదా? అనే విషయం తెలియకపోవడంతో చాలా మంది మోసపూరిత ఖాతాలనే వినియోగిస్తున్నారు. దీంతో బాధితుల సంఖ్య పెరుగుతోంది. వీటిని అరికట్టేందుకు ప్రముఖ సెర్చ్ ఇంజిన్ గూగుల్ నడుంబిగించింది. అందులో భాగంగా తన సెర్చ్ రిజల్ట్స్‌లో కనిపించే ఫలితాలకు వెరిఫైడ్ బ్యాడ్జ్ అందించేందుకు సిద్ధమైంది.
''కంపెనీలకు సంబంధించిన అధికారిక ఖాతాలను గుర్తించేందుకు కొత్త ఫీచర్లు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుతం గూగుల్‌లోని నిర్దిష్ట వ్యాపారాల వెబ్‌సైట్ల పక్కనే చెక్ మార్క్‌లను చూపించేలా పరీక్షలు నిర్వహిస్తున్నాం'' అని గూగుల్ అధికారులు వెల్లడించారు. ఇప్పటికే గూగుల్ సెర్చ్ ఫలితాల్లో మైక్రోసాఫ్ట్, మెటా, యాపిల్ కంపెనీల అధికారిక సైట్ లింక్ పక్కన బ్లూ వెరిఫైడ్ బ్యాడ్జ్ కనిపిస్తోందని ధవెర్జ్ నివేదించింది. టెస్టింగ్ దశలో కొందరు యూజర్లకు మాత్రమే ఈ ఫీచర్ అందుబాటులోకి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే గూగుల్ ఈ సదుపాయాన్ని ఇంకా రోలవుట్ చేయలేదు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వాట్సప్‌ల్లో అధికారుల ఖాతాను గుర్తించేందుకు వెరిఫైడ్ బ్యాడ్జ్‌లు అందుబాటులోకి వచ్చాయి. వాటి సాయంతో ఫేక్ ఖాతాలను సులువుగా గుర్తిస్తున్నాం. ఇకపై అలాంటి సదుపాయమే గూగుల్ సెర్చ్ రిజల్ట్స్‌లోనూ కనిపించనుంది. మోసపూరిత కంటెంట్‌ను గుర్తించి వాటిని సెర్చ్ రిజల్ట్స్‌లో చూపించకుండా ఉండేందుకు గూగుల్ ఇప్పటికే ఆటోమేటెడ్ సిస్టమ్‌లను ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే.

## పెరగనున్న సిమెంట్ ధరలు

**వెల్లడించిన సెంట్రమ్ నివేదిక**

**దిల్లీ:** 202425 ఆర్థిక సంవత్సరంలో మొత్తం సిమెంట్ డిమాండ్ 5 శాతం పెరుగుతుందని, రాబోయే నెలల్లో కంపెనీలు మరికొన్ని సార్లు సిమెంట్ ధరలను పెంచే అవకాశముందని సెంట్రమ్ నివేదిక తెలిపింది. సాధారణ ఎన్నికల తర్వాత ప్రభుత్వ వ్యయం ఆలస్యం కావడం, రుతుపవనాల ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం అధికంగా ఉండడం, దీనివల్ల దేశంలోని అనేక ప్రాంతాల్లో వరదలు రావడంతో పాటు అనేక అంశాలు డిమాండ్‌ను ప్రతికూలంగా ప్రభావితం చేశాయి. వార్షిక ప్రాతిపదికన సిమెంట్ డిమాండ్ 56 శాతం తగ్గింది. అయితే, ఇటీవల సిమెంట్ కంపెనీల సామర్థ్య విస్తరణతో, ఈ నివేదిక 2.70 శాతం వృద్ధిని అంచనా వేసింది. దక్షిణ భారతదేశంలో డిమాండ్‌లో ఏకీకరణ, ఉత్తర భారతంలో అధిక వినియోగం వల్ల




202425 ఆర్థిక సంవత్సరం 3,4 త్రైమాసికాల్లో సిమెంట్ ఉత్పత్తుల ధరలు పెరుగుతాయని నివేదిక పేర్కొంది. డిమాండ్ పునరుద్ధరణ, ధరల పెంపుతో సిమెంట్ కంపెనీలు మిగిలిన అర్ధ సంవత్సరం మెరుగైన ఆదాయ వృద్ధి చూపుతాయని సెంట్రమ్ నివేదిక తెలిపింది.

# నటుడు రాజేంద్రప్రసాద్ కుమార్తె మృతి



టాలీవుడ్ సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. నటకిరీటీ రాజేంద్రప్రసాద్ కుమార్తె గాయత్రి (38) గుండెపోటుతో చనిపోయారు. శుక్రవారం రాత్రి కార్డియాక్ అరెస్టుతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో గాయత్రి కన్నుమూశారు. ఆమెకు తీవ్ర గ్యాస్ట్రిక్ సమస్య రావడంతో వెంటనే కుటుంబ సభ్యులు హాస్పిటల్‌కి తరలించారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతూనే ఆమె హార్ట్ ఎటాక్‌కు గురై కన్నుమూశారు. రాజేంద్ర ప్రసాద్‌కు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. బిడ్డ మరణంతో వారి ఇంట్లో తీవ్ర విషాదం నిండింది. గాయత్రి మృతిని తట్టుకోలేక రాజేంద్రప్రసాద్, ఆయన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. శుక్రవారం గ్యాస్ట్రిక్ సమస్యతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న గాయత్రి.. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో జాయిన్ అయ్యారు. అయితే సడెన్‌గా అర్ధరాత్రి 12 గంటల 40 నిమిషాల సమయంలో ఆమెకు తీవ్రమైన హార్ట్ ఎటాక్‌కు వచ్చినట్లుగా తెలుస్తుంది. డాక్టర్స్ చికిత్స అందించినా పరిస్థితి చేయిదాటి పోవటంతో గాయత్రి కన్నుమూశారు. ఆదివారం గాయత్రి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. గాయత్రి కుమార్తె సాయి తేజస్విని బాలనటిగా 'మహానటి' చిత్రంలో నటించింది.

సీనియర్ నటుడు శ్రీ రాజేంద్రప్రసాద్ కుమార్తె గాయత్రి గుండెపోటుతో మరణించారనే వార్త నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. చిన్న వయసులోనే అకాల మరణానికి గురికావడం అత్యంత దురదృష్టకరం. ఈ విషాద సమయంలో ఆ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాను. గాయత్రి ఆత్మకు శాంతి చేకూర్చాలని దేవుడిని కోరుకుంటున్నాను.

**- ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు**

రాజేంద్రప్రసాద్‌గారికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఆయన కుమార్తె శ్రీమతి గాయత్రి హఠాన్మరణం దిగ్భ్రాంతిని కలిగించింది. శ్రీమతి గాయత్రి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. రాజేంద్రప్రసాద్‌గారికి, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. పుత్రిక వియోగాన్ని తట్టుకొనే మనో ధైర్యాన్ని రాజేంద్రప్రసాద్‌గారికి ఇవ్వాలని ఆ భగవంతుణ్ణి కోరుకుంటున్నాను.

**- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్‌గారి కుమార్తె గాయత్రి మృతి బాధాకరం. ఆమె ఆత్మకు శాంతి కలగాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

**- నారా లోకేష్**

నాకు అత్యంత ఆప్తులైన రాజేంద్ర ప్రసాద్ కుమార్తె గాయత్రి గారి మరణం చాలా విషాదకరం. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. రాజేంద్ర ప్రసాద్‌గారికి మరియు కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

**- జూ. ఎన్టీఆర్**

నాకు అత్యంత ఆప్తులు రాజేంద్రప్రసాద్ కూతురు గాయత్రి గారి హఠాన్మరణం మనసును ఎంతో కలిచివేసింది. కూతురులోనే అమ్మను చూసుకున్న ఆయనకు ఇలాంటి కష్టం రావడం అత్యంత బాధాకరం. ఆయనకు నా ప్రగాఢ సంతాపం. ఈ కష్ట సమయాన్ని తట్టుకుని నిలబడే మనోస్థైర్యాన్ని, ధైర్యాన్ని దేవుడు ఆయన కుటుంబానికి ఇవ్వాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను.

**-సాయిధరమ్ తేజ్**

ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్ కుమార్తె గాయత్రి ఆకస్మిక మరణం నన్ను ఎంతగానో కలచివేసింది. రాజేంద్రప్రసాద్ అన్నయ్యకు ఆ భగవంతుడు ఈ బాధను తట్టుకునే మనో ధైర్యాన్ని ఇవ్వాలని దేవుడిని వేడుకుంటున్నాను.

**- నటుడు అలీ**

**రాజేంద్ర ప్రసాద్ కు చిరంజీవి, అల్లు అర్జున్ పరామర్శ**

సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ ఇంట్లో విషాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. గుండెపోటుతో ఆయన కుమార్తె గాయత్రి మృతిచెందింది. రాజేంద్ర ప్రసాద్ కుమార్తె గాయత్రి మరణవార్త తెలుసుకున్న పలువురు సినీ ప్రముఖులు ఆమెకు నివాళులు అర్పించడంతో పాటు రాజేంద్రప్రసాద్‌ను కలిసి ధైర్యం చెబుతున్నారు. తాజాగా నటుడు వెంకటేశ్‌తో పాటు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కూడా నటకిరిటిని కలిసి పరామర్శించారు. వీరే కాకుండా మెగాస్టార్ చిరంజీవి ఫ్యామిలీతో పాటు సాయి కుమార్ ఆమెకు నివాళులు అర్పించారు. మరోవైపు బీఆర్ఎస్ నేత మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కూడా రాజేంద్రప్రసాద్‌ని కలిసి కూతురు పోయిన బాధలో ఉన్న అతడిని ఓదార్చాడు.

# 22 ఏళ్ల తర్వాత ఖడ్గం రీ రిలీజ్

కృష్ణవంశీ దర్శకత్వంలో రవితేజ, శ్రీకాంత్, ప్రకాశ్ రాజ్, శివాజీ రాజా ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'ఖడ్గం' . ఈ సినిమా అప్పట్లో ఎటువంటి సంచలనం సృష్టించిందో తెలిసిందే. ఇప్పటికే ఇండిపెండెన్స్ డే సమయంలో ఈ సినిమాను ఖచ్చితంగా టెలివిజన్‌లో టెలికాస్ట్ చేస్తూ ఉంటారు. ప్రస్తుతం ఈ సినిమా రీ రిలీజ్‌కి ముస్తాబవుతున్న తరుణంలో చిత్ర యూనిట్ మీడియా సమావేశం నిర్వహించారు. దాదాపు 22 ఏళ్ల తర్వాత ఈ సినిమా మళ్ళీ ప్రేక్షకుల ముందుకు వస్తున్నందుకు దర్శకుడు కృష్ణవంశీ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు కృష్ణవంశీ మాట్లాడుతూ.. మాకు ఈ సినిమా తీయడంలో సహాయం చేసిన నిర్మాత మధు మురళి గారికి ధన్యవాదాలు.



భారతీయ జెండా ఒక ఖడ్గం అనే ఉద్దేశ్యంతో ఈ సినిమాకి ఆ టైటిల్ పెట్టి సినిమా తీశాం. ఈ సినిమాకి సహకరించిన నటీనటులందరికీ ధన్యవాదాలు. రీ రిలీజ్‌లోనూ ఈ సినిమా బ్రహ్మాండంగా ఆదరణ పొందుతుందని భావిస్తున్నానని అన్నారు. నటుడు షఫీ మాట్లాడుతూ.. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో చదివి ఏడేళ్లు వెయిట్ చేస్తున్న సమయంలో నాకు దొరికిన అవకాశం 'ఖడ్గం'. ఈ సినిమాలో అవకాశం ఇచ్చి నా వనవాసంకి ఎండ్ చెప్పడానికి కారణమైన కృష్ణవంశీ గారికి కృతజ్ఞతలని చెప్పారు.నటుడు శివాజీ రాజా మాట్లాడుతూ.. నిర్మాత మధు మురళిగారికి స్పెషల్ థాంక్స్. ఈ సినిమాలో నాకు అవకాశం ఇచ్చి ఈ సినిమా చేసినందుకు థాంక్స్. ఇటీవలే 'మురారి' పండుగ చేసుకున్నాం. ఇప్పుడు 'ఖడ్గం' రీ రిలీజ్ అవుతుంది. నాకు చాలా సంతోషంగా ఉంది. నేను అప్పట్లో ఈ సినిమాలో చేయనని చెప్పాను. కానీ ఇప్పటి వరకు నేను చేసిన సినిమాలన్నింటిలో మంచి పేరు తెచ్చి పెట్టిన చిత్రంగా ఈ సినిమా నా జీవితంలో నిలబడిందని తెలిపారు. హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ.. జనరేషన్స్ మారినా పెట్రియాటిక్ ఫిల్మ్స్ అన్నింటిలో 'ఖడ్గం' చాలా గొప్ప చిత్రం. అసలు 'ఖడ్గం' సినిమాలో నిర్మాత మధు మురళి నన్ను వద్దు అన్నారు ముందు. కానీ వంశీ ధైర్యం చేసి ఆయన్ని ఒప్పించి నన్ను సినిమాలోకి తీసుకున్నారు. నా లైఫ్‌లో ఈ సినిమాను మర్చిపోలేను. ఈ సినిమా మళ్ళీ రిలీజ్ అవుతున్నందుకు చాలా హ్యాపీగా ఉందని అన్నారు. కాగా, అక్టోబర్ 18న ఈ చిత్రం రీ రిలీజ్ కాబోతోంది.

# వరుణ్ తేజ్ 'మట్కా' టీజర్ రిలీజ్

మెగా హీరో వరుణ్ తేజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం మట్కా . పలాస 1978 సినిమాతో హిట్ అందుకున్న కరుణ కుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. విజేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ ఇప్పటికే ఫస్ట్ లుక్ విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ దేశంలో చలామణి అయ్యే ప్రతి రూపాయిలో 90 పైసలు నూటికి ఒక్కడే సంపాదిస్తున్నాడు. మిగత 10 పైసల కోసం 99 మంది కొట్టుకుంటారు. నాలాంటోళ్లు. నువ్వు ఆ 90 పైసలు సంపాదించేవాడివి. 99 మందిలో ఒక్కడిగా మిగిలిపోకు. నీకు ఆ దమ్ము ఉంది అంటూ డైలాగ్‌తోనే టీజర్ మొదలైంది. ఇక టీజర్ చూస్తుంటే వరుణ్‌తేజ్ 'వాసు' అనే పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. 1958-1982 మధ్య కాలంలో దేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన ఒక వాస్తవ సంఘటనను ఆధారం చేసుకొని ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు చిత్రయూనిట్ తెలిపింది. వైజాగ్ నేపథ్యంగా సాగే ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో వరుణ్ నాలుగు భిన్న గెటప్పుల్లో కనిపించనున్నారు. ఇప్పటికే సగ భాగానికి పైగా చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ ఏడాది చివరిలో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలుస్తోంది. నవీన్ చంద్ర, కిశోర్, రవీంద్ర విజయ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు జీవి ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు.



# త్రిష సెకండ్ ఇన్నింగ్స్ జోరు

సినీ ఇండస్ట్రీకి వచ్చి రెండు దశాబ్దాలు దాటినా తరగని అందంతో ఇప్పటికీ అదే వన్నెతో సినీ ప్రేక్షకులను కట్టిపాడేస్తున్న హీరోయిన్ త్రిష. ఒకప్పుడు ఫుల్ జోష్‌తో తెలుగు, తమిళ ఇండస్ట్రీని అలరించిన ఈ భామ ఆ మధ్య ఒకానొక దశలో మోహినీ, నాయకీ లాంటి వరుస ఫ్లాపులను చవిచూసింది. ఇక త్రిష కెరీర్ క్లోజ్ అని అంతా అనుకునే సమయంలో 96 వంటి సూపర్ హిట్ సినిమాలో కనిపించి ఐయామ్ బ్యాక్ అనిపించుకుంది. అప్పటి నుంచి కథా బలమున్న పాత్రలను ఎంచుకొని తిరుగులేని నటనతో రాణిస్తూ వస్తోంది. ప్రస్తుతం తమిళ ఇండస్ట్రీలో ఈ బ్యూటీకి గిరాకీ బాగానే ఉందని చెప్పాలి. ఫ్లాపుల నుంచి నేర్చుకున్న పాఠాలో లేక టైమ్ కలిసొచ్చిందో తెలియదు కానీ ఈ మధ్య కాలంలో త్రిష నటించిన సినిమాలన్నీ వందల కోట్ల రూపాయలు సంపాదిస్తున్నాయి. నలభై ఏళ్లు దాటిన ఈ అమ్మడు ఏవో చిన్న చిన్న సినిమాల్లో నటించి సరిపెట్టుకోవడం లేదు. తమిళ ఫిల్మ్ ఇండస్ట్రీ చూపు మొత్తాన్ని తన వైపు తిప్పుకునేలా బడా బడా హీరోలతో కలిసి నటిస్తూ ఒక్కో సినిమాతో రూ.200 కోట్లకు పైగా కలెక్షన్లు అందుకుంటోంది. విజయ్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన లియో తమిళంలోని టాప్ సినిమాల్లో ఒకటిగా నిలిచింది. 2023లో విడుదలైన ఈ చిత్రం కేవలం తమిళనాడులోనే దాదాపు రూ. 230కోట్ల గ్రాస్ వరకూ వసూళ్లను సాధించింది. అంతేకాదు, మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన పొన్నియన్ సెల్వన్ 1లో కూడా త్రిష - విక్రమ్, ఐశ్వర్యా రాయ్, కార్తీలతో పోటీపటి నటించి ఇందులో మెప్పించింది. తమిళనాట ఈ సినిమా కలెక్షన్లు కూడా రూ.220 కోట్లకు పై మాటే. ఆ రాష్ట్రంలో సెకండ్ హైయెస్ట్ తమిళ గ్రాసర్ సినిమాగా నిలిచింది. రీసెంట్‌గా తమిళ స్టార్ హీరో ధళపతి విజయ్ నటించిన 'ది గోట్' చిత్రం కూడా రూ.200 కోట్ల క్లబ్‌లో చేరిపోయింది. ఈ సినిమాలో త్రిష "మట్టా" అనే స్పెషల్ సాంగ్‌లో కనిపించి అభిమానులకు కనువిందు చేసింది. చాలా ఏళ్ల తర్వాత త్రిషలోని మాస్ యాంగిల్ డ్యాన్స్ అందరినీ ఆకట్టుకుంది. ఇకపోతే ప్రస్తుతం త్రిష చేతిలో విదా ముయార్చి, గుడ్ బ్యాడ్ అండ్ అగ్లీ వంటి బడా సినిమాలు ఉన్నాయి. ఈ రెండింటిలోనూ తలా అజిత్ హీరోగా నటిస్తున్నారు. ఇంకా తమిళంలో థగ్ లైఫ్, తెలుగు విశ్వంభర కూడా చేస్తోంది. ఈ చిత్రాలన్నీ కూడా కచ్చితంగా హిట్ సాధిస్తాయని తమిళ నటా మంచి కలెక్షన్లు అందుకుంటాయని సినీ పరిశ్రమ వర్గాల అంచనా. ఇటు ఫ్యాన్స్ కూడా త్రిష తమను ఏమాత్రం డిసప్పాయింట్ చేయదని బాగా నమ్ముతున్నారు.



# ఆరేండ్లు గ్యాప్ తీసుకోవడానికి కారణం అదే: శ్రీనువైట్ల

టాలీవుడ్ దర్శకుడు శ్రీనువైట్ల దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం విశ్వం. గోపిచంద్ కథానాయకుడిగా వస్తున్న ఈ చిత్రంలో కావ్య థాపర్ కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమా దసరా కానుకగా అక్టోబర్ 11న ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఈ సినిమా విడుదల తేదీ దగ్గరపడటంతో వరుస ప్రమోషన్స్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో శ్రీనువైట్ల మాట్లాడుతూ.. ఇన్నిరోజులు గ్యాప్ తీసుకోవడానికి గల కారణాలు వెల్లడించాడు. ఈ మధ్య ప్రేక్షకులు కొత్త కథలను కోరుకుంటున్నారు. అయితే నేను మూవీ తీసే విధానం, ఎంటర్‌టైనమెంట్‌ని ప్రేక్షకులు ఇష్టపడుతున్నారు. కానీ అన్ని సినిమాలలో ఒకటే థీమ్ ఉంటుందని తెలిపారు. దానివల్ల ఏ సినిమాలో కామెడీ ఒకేరకంగా ఉంటుంది. అందుకే కొన్నిరోజులు గ్యాప్ తీసుకోని వర్క్ చేశా. సరికొత్త థీమ్ తీసుకోని దానికి కామెడీ జోడించడం మాములు విషయం కాదు. నేను అలానే చేయాలని ఫిక్స్ అయ్యి విశ్వం తెరకెక్కించాను. ఈ సినిమా అందరికి తప్పకుండా నచ్చుతుంది. ఫ్యామిలీ మొత్తం కలిసి చూసే సినిమా ఇది అంటూ శ్రీనువైట్ల చెప్పుకోచ్చాడు



# టీ తాగేటప్పడు చేయాల్సినవి.. చేయకూడనివి...

**విశ్వంభర, ఫిచర్ :** ప్రపంచంలో అత్యధికంగా మంచినీటి తర్వాత ఎక్కువ మంది తాగుతున్నది టీ నే.. ఈ టీకి ఎంతో చరిత్ర, ప్రాముఖ్యత ఉంది. తలనొప్పికి, రీఫ్రెష్ అవడానికి, టైంపాస్ కి.. ఇలా సమయం, సందర్భంతో తేడా లేకుండా చాలా మందికి వెంటనే గుర్తొచ్చేది టీ. అంతే కాకుండా ముఖ్యంగా మన దేశంలో టీ లవర్స్ కోట్లలో ఉన్నారు. పైగా మన దేశం నుంచీ చాలా దేశాలకు టీ ఎగుమతి అవుతోంది. అసోం, డార్జిలింగ్ టీలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఐరోపా దేశాల్లో టీ కంపెనీలు తమ ప్రతినిధులను ఇండియాకి పంపి టీ ఎస్టేట్ ఓనర్లతో డీల్స్ కుదుర్చుకుంటాయి. అంతలా మన దేశపు టీ కోసం ప్రపంచ దేశాలు ఆసక్తి చూపిస్తాయి. ఇక ఇండియా లో అత్యంత సంపన్నుల నుంచీ అత్యంత పేదల వరకూ అందరూ టీని ఎంతో ఇష్టంగా తాగుతారు. ఒకప్పుడు టీ, కాఫీ మాత్రమే ఉండేవి. మరి ఇప్పుడో ఒక్క టీలోనే ఎన్నో రకాలు వచ్చేశాయి. లెక్కలేనన్ని ఫ్లేవర్లు ఉన్నాయి. టీకి సంబంధించి ఆసక్తికర అంశాల్ని తెలుసుకుందాం.



**ఈ డెడ్లీ కాంబినేషన్ వల్ల ఆరోగ్య సమస్యలు**

పని ఒత్తిడి నుంచి సాంత్వన పొందేందుకు, ఇంటికి వచ్చిన అతిథులకు ఇచ్చేందుకు చాలామంది టీ ప్రిఫర్ చేస్తుంటారు. అంతగా భారతీయుల జీవితాల్లో టీ పాతుకుపోయింది. ఈ మధ్య ధూమపానం చేసేటప్పుడు టీ తాగేందుకు మరికొందరు ఆసక్తిని కనబరుస్తున్నారు. ఇది పలు ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. సిగరెట్‌లో ఉండే నికోటిన్ గుండెకు చేటు చేస్తుంది. ఇతరులతో పోలిస్తే ధూమపానం చేసేవారికి గుండెనొప్పి వచ్చే అవకాశం 3 రెట్లు ఎక్కువ అని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనులలో నికోటిన్ సంకోచాన్ని కలిగిస్తుంది. తద్వారా స్వచ్ఛమైన రక్తం గుండెకు చేరకుండా అడ్డుకుంటుంది. ఇది గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది. టీలో ఉండే పాలీఫెనాల్స్ గుండెకు మేలు చేస్తాయి. కానీ టీ లో పాలు కలపడంతో అవికాస్తా ప్రతికూలంగా మారతాయి. పాలలోని ప్రొటీన్ టీ లోని పాలీఫెనాల్ తో రియాక్ట్ అయ్యి దాని ప్రభావాన్ని తగ్గిస్తుంది. అందుకే ఎక్కువగా టీ తాగితే హృదయ స్పందన రేటును పెరగడంతో పాటు అధిక రక్తపోటుకు గురికావచ్చు. అందుకే ధూమపానం మరియు టీ రెండూ గుండె ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తాయి. సిగరెట్ కాలుస్తూ టీ తాగే అలవాటు ఉంటే రోగాలకు వెల్‌కమ్ చెప్పినట్లే. టీ మరియు సిగరెట్ల కలయిక గుండె జబ్బులు సహా అనేక ఇతర వ్యాధులకు కారణమవుతుంది. క్యాన్సర్ వచ్చే అవకాశాలు 30 శాతం పెరుగుతాయని తాజా అధ్యయనంలో తేలింది. టీ లోని టాక్సిన్స్ సిగరెట్ పొగతో కలిసి ఈ ప్రమాదకరమైన వ్యాధికి కారణమవుతాయి. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ టీతో పాటు సిగరెట్ తాగకూడదని వైద్యులు సూచిస్తున్నారు. ఈ రెండు డెడ్లీ కాంబినేషన్ వల్ల ముఖ్యంగా నోరు, ఊపిరితిత్తులు, గొంతు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువ. జీర్ణవ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రేగులు మరియు కడుపుకు చేటు చేయడం వల్ల కడుపునొప్పి, ఎసిడిటీ, గ్యాస్ వంటి జీర్ణ సమస్యలు వస్తాయి. ధూమపానం చేస్తున్నప్పుడు రిలాక్స్‌గా అనిపించినా ఆ తర్వాత మానసిక ఒత్తిడి, ఆందోళన పెరుగుతుంది. మరోవైపు టీ లో ఉండే కెఫిన్ సరిగా నిద్ర రానివ్వదు.

ఇవేకాక దంతాలు మరియు నోటి ఆరోగ్యంపైనా టీ మరియు సిగరెట్ ప్రభావం చూపిస్తాయి. తెల్లటి దంతాలను పసుపు రంగులోకి మార్చడంతో పాటు దంతాల బలాన్ని తగ్గిస్తాయి. దీనికి అదనంగా నోటి దుర్వాసన ఖాయం. నోటి క్యాన్సర్ ప్రమాదం కూడా పెంచుతాయి. టీ ఎక్కువగా తాగడం వల్ల మూత్ర విసర్జన పెరుగి, కిడ్నీలపై పనితీరు మందగించేలా చేస్తుంది. శరీరాన్ని డీహైడ్రేట్ చేయడం వల్ల ఆరోగ్యాన్ని చెడగొడుతుంది.

**టీ తాగడానికి ముందు తప్పక చేయాల్సినది...**

టీ తాగడం వల్ల కడుపు సమస్యలు పెరుగుతాయని కొందరిమాట. చాలామందికి టీ తాగడం వల్ల గ్యాస్ , జీర్ణ సమస్యలు, మలబద్ధకం సమస్య వస్తుందని చెబుతుంటారు. కానీ మీరు సులభమైన చిట్కాను అనుసరించడం ద్వారా వాటిని నివారించవచ్చు. టీ వల్ల మూత్రం ఉత్పత్తి పెరిగి మన శరీరంలో నీటి లోటు పెరుగుతుంది. తద్వారా మన మెదడులోని నీటి నిల్వలు తగ్గిపోతాయి. అందువల్ల, శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడానికి టీ కంటే ఎక్కువ నీరు తాగటం ముఖ్యం. అలాగే టీ తాగే ముందు కచ్చితంగా నీరు తాగడం మరిచి పోకుడదు. టీ తాగే ముందు నీరు తాగడం వల్ల పొట్టకు సంబంధించిన సమస్యలు రాకుండా ఉంటాయి. మనం టీ లేదా కాఫీ తాగే ముందు నీరు బాగా తాగాలి. ఎందుకంటే టీ యొక్క pH స్థాయి 6 , కాఫీ 5. pH స్థాయి 7 కంటే తక్కువగా ఉన్నప్పుడు, పదార్థం ఆమ్లంగా మారుతుంది. కాబట్టి మీరు మీ కడుపులో యొక్క PH స్థాయిని సరిచేసుకోవాలి. కాబట్టి టీ తీసుకునే ముందు ఎక్కువ నీరు తీసుకుంటే ఎసిడిటీ లేదా మలబద్ధకం సమస్య ఉండదు. అసిడిటీ వల్ల క్యాన్సర్, అల్సర్, అనేక ఇతర వ్యాధుల బారిన పడవచ్చు. మీరు టీ ప్రేమికులైతే, మీ పేగు ఆరోగ్యం కోసం టీ తాగే ముందు పుష్కలంగా నీరు తాగండి. మీరు ఈ చిట్కాలను జాగ్రత్తగా పాటిస్తే, మీకు అలాంటి సమస్య ఉండదు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com